RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:222 హైదరాబాద్, శనివారం, 8 మార్చి 2025 పేజీలు: 12 వెల: 1.00



భారత శక్తి
VOICE OF INDIAN

## సౌత్ లో డీలిమిటేషన్ రగడ

తమిళనాడు రాజకీయం రగిలిపోతోంది. నివురుగప్పిన నిప్పులా ఆ సెగ ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది తమిళనాడులో. కాని, ఆ నిప్పును మరోసారి రగల్చడంలో సక్సెస్ అయ్యారు సీఎం స్టాలిన్. హిందీ భాషకు నియోజకవర్గాల పునర్విభజన అనే అంశాన్ని ముడిపెట్టి ఓ ఉద్యమంగా మారుస్తున్నారు. సీఎం స్టాలిన్.. ఓ పక్కా వ్యూహంతో చేస్తున్న రాజకీయ ఎత్తుగడ ఇది. తమిళనాడులో ఎంపీ సీట్లు తగ్గిపోతున్నాయ్, అదే జరిగితే తమిళ అస్తిత్వానికే దెబ్బ అని అరవ సెంటిమెంట్‌ను గట్టిగానే జనాల్లోకి తీసుకెళ్తున్నారు... సీఎం స్టాలిన్ ఆల్‌పార్టీ మీటింగ్‌కు పిలుపునివ్వగానే ప్రధాన ప్రతిక్షం అయిన అన్నా డీఎంకే కూడా కదిలి వచ్చింది. డీఎంకే, అన్నాడీఎంకే మధ్య ఎంతటి రాజకీయ వైరం ఉంటుందో దశాబ్దాలుగా చూస్తునే ఉన్నాం. అలాంటిది.. ఒకే వేదిక మీదకు వచ్చాయ్ ఆ పార్టీలు. పైగా.. కొత్తగా పార్టీ పెట్టిన హీరో విజయ్ కూడా.. తన పార్టీ ప్రతినిధిని ఆ సమావేశానికి పంపించారు. పార్టీ పెట్టినప్పటి నుంచి సీఎం స్టాలిన్ లక్ష్యంగా, డీఎంకేను ఓడించడమే టార్గెట్‌గా విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తూనే ఉన్నారు హీరో విజయ్. స్టాలిన్‌ను విమర్శించడానికి ఉన్న ఏ ఒక్క అవకాశాన్నీ వదలుకోవడం లేదు. అలాంటిది.. ముఖ్యమంత్రి ఆహ్వానం పంపడం ఆలస్యం.. టీవీకే పార్టీ కూడా ఆ సమావేశానికి హాజరైంది. ఈ విషయంలో సీఎం స్టాలిన్ సాధించింది మామూలు సక్సెస్ కాదు. ఎవరూ ఊహించని విజయం. నిజానికి, ఈ విజయాన్ని స్టాలిన్ ఖాతాలో వేయడానికి కూడా లేదు. ఎందుకంటే.. తమిళ సెంటిమెంట్‌కు ఉన్న బలం అలాంటిది. ఏదైనా ఒక అంశం ఉద్యమ రూపం దాల్చితే.. దానికి మద్దతిస్తూ అన్ని పార్టీలూ కలిసి వస్తాయి. ఆమధ్య జల్లికట్టును నిషేధించాలన్నప్పుడు కూడా.. పార్టీలన్నీ తమ వైరాన్ని పక్కనపెట్టి మరీ కలిసి నడిచాయి. సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినా సరే.. పార్లమెంట్ ద్వారా ఆర్డినెన్స్ తెచ్చుకునే దాకా పోరాటాలు చేశాయి అక్కడి పార్టీలు. అది కూడా.. అందరూ కలిసికట్టుగా పోరాడారు. హిందీ భాష విషయంలో తమిళులంతా ఏకతాటిపైకి వచ్చారు. ముగ్గులతో హిందీకి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. హిందీలో రాసి ఉన్న బోర్డులను తీసేస్తున్నారు. తమిళంపై బీజేపీకి ప్రేమ ఉంటే.. సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసుల నుంచి హిందీని తొలగించాలని ఛాలెంజ్ చేశారు. సో, తమిళులకు, తమిళ భాషకు, తమిళ సంస్కృతికి, తమిళనాడుకు అన్యాయం జరుగుతోందని ఏమాత్రం అనిపించినా సరే.. పెద్ద ఉద్యమాలకు సిద్ధమైపోతారు. ఇప్పుడు కూడా అలాంటి ఉద్యమమే ఊపిరిపోసుకుంటోందా అని అనిపిస్తోంది తమిళ రాజకీయాలు చూస్తే. వారం రోజుల క్రితం తమిళనాడు క్యాబినెట్ సమావేశం ముగిసిన వెంటనే.. మీడియాతో మాట్లాడారు సీఎం స్టాలిన్. ఆ ప్రెస్‌మీట్‌లో నియోజకవర్గాల పునర్విభజనపై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను తగ్గించి ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెంచుకునే కుట్ర జరుగుతోందని అన్నారు. దక్షిణ భారతదేశంలో ఒక్క తమిళనాడులో మాత్రమే ఎక్కువ లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న 39 ఎంపీ స్థానాలు 31కి తగ్గొచ్చనేది సీఎం స్టాలిన్ చెబుతున్న లెక్క. అందుకే, నాగపట్నంలో డీఎంకే నేత ఇంట పెళ్లికి వెళ్లిన స్టాలిన్.. ఆలస్యం చేయకుండా పిల్లల్ని కనండి, వాళ్లకు తమిళ పేర్లు పెట్టండి అని ఆశీర్వదించి వచ్చారు. తమిళనాడులో వందకు పైగా రాజకీయ పార్టీలు ఉంటే.. అందులో యాక్టివ్‌గా ఉన్నవి 64 పార్టీలు. అందులో 56 పార్టీలు హాజరయ్యాయి. 64కి 56 పార్టీలు హాజరయ్యాయంటే.. వాళ్ల మధ్య ఏ స్థాయిలో ఐక్యత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మక్కల్ నీరుమయం అధ్యక్షుడు కమలహాసన్ కూడా సమావేశానికి వచ్చారు. పునర్విభజనలో 8 నియోజకవర్గాలకు కోతపెట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సీఎం స్టాలిన్ మాట్లాడారు. ఇక.. హీరో విజయ్ అయితే పెద్ద స్టేట్‌మెంటే రిలీజ్ చేశారు. రాబోయే జనగణన ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజిస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మరీ ముఖ్యంగా.. దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు తగ్గినా.. ఉత్తరప్రదేశ్, బిహార్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు పెరిగినా.. ఏమాత్రం సహించేది లేదని క్లియర్ అల్టిమేటం ఇచ్చారు. కేంద్రం మాటకు కట్టుబడి.. 50 ఏళ్లుగా తమిళనాడుతో సహా దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రించిన విషయాన్ని మరోసారి గుర్తు చేశారు. ఒకవేళ కాదూకూడదని కొత్త జనాభా లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన చేస్తే మాత్రం.. అన్ని పార్టీలతో కలిసి ఉద్యమిస్తామని వార్నింగ్ ఇచ్చారు. అఖిలపక్ష సమావేశంలో కొన్ని కీలక తీర్మానాలు చేశారు. ఒకటి.. 1971 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ జరగాలి. అలా జరిపే డీలిమిటేషన్ 30 ఏళ్ల పాటు అమల్లో ఉండాలి. రెండు.. తమిళనాడు ఎంపీలు, అఖిలపక్షంలోని పార్టీల ప్రతినిధులతో ఓ కమిటీ వేయాలి. మూడు.. దక్షిణాది రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని, ఆ పార్టీలతో కలిసి కేంద్రంపై పోరాటం చేయాలి. నాలుగు.. నియోజకవర్గాల పునర్విభజన జరగకూడదు. ఐదు.. పునర్విభజన జరగడం లేదని ప్రధాని మోదీ నుంచే ప్రకటన వచ్చేలా పోరాడాలి. ఇవీ.. అఖిలపక్ష సమావేశంలో చేసిన తీర్మానాలు.. దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటించి, పార్టీల అధినేతలు, ముఖ్యనేతలతో చర్చిస్తారు. నియోజకవర్గాల పునర్విభజనతో తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ అన్యాయం జరుగుతుందన్న విషయాన్ని అందరితో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారు. ఇక తెలంగాణలో.. బీఆర్ఎస్ పార్టీ కేంద్రంపై పోరాడుతోంది. కానీ, ఈ విషయంలో స్టాలిన్ నాయకత్వాన్ని అంగీకరిస్తుందా అన్నదే ప్రశ్న. సీఎం రేవంత్‌రెడ్డి అధిష్టానం నిర్ణయాన్ని బట్టే నడుచుకుంటారు. కర్నాటక కాంగ్రెస్ పరిస్థితి కూడా ఇంచుమించు ఇంతే. అక్కడ ప్రధాన ప్రాంతీయ పార్టీ జేడీఎస్ కూడా ఎన్డీయే పక్షమే. సో, కర్నాటక నుంచి ఎలాంటి సపోర్ట్ వస్తుందో ఇప్పుడే చెప్పలేం. ఇకపోతే.. కేరళ. నియోజకవర్గాల పునర్విభజనతో కేరళలో ఒక్క సీటు కూడా పెరగదు అనే విశ్లేషణలు ఉన్నాయి.

# పదవుల కోసం పాకులట..?

విజయవాడ, మార్చి 7, ( వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇప్పటికైనా పదవుల కోసం పాకులాడుకుండా ప్రజాసమస్యలను పట్టించుకోవడం మేలు. కేవలం ప్రతిపక్ష హోదా కోసం పట్టుపట్టకుండా జనం బాట పడితే మేలంటున్నారు. గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారు. ఇప్పుడు అసెంబ్లీకి పోనంటున్నారు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప రానుంటున్నారు. ఎవరి మీద అలక? జనం మీదనా? లేక ప్రతిపక్ష హోదా ఇవ్వని అధికార పార్టీ మీదనా? అన్నది ప్రజలు ఆలోచించుకునే అవకాశముంది. ఎన్నికలు ముగిసి ఏడాదవుతుంది. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే తాను అసెంబ్లీకి రానంటూ జగన్ మొండి కేసి కూర్చుకున్నారు. అనర్హత వేటు పడుతుందని ఒక రోజు వెళ్లి రావడం మిగిలిన రోజుల్లో సభకు దుమ్మా కొట్టడం జగన్ కు అలవాటుగా మారింది. అయితే ముఖ్యమంత్రిగా ఉంటే తప్ప సభకు వెళ్లరా? లేకపోతే ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప సమావేశాల్లో పాల్గొనరా? ప్రజా సమస్యల కంటే పదవులపైనే జగన్ ఎక్కువ మక్కువ చూపుతున్నారన్న అభిప్రాయం ప్రజల్లో కలిగేందుకు ఎక్కువ అవకాశముంది. ప్రతిపక్ష హోదా ఉంటే అసెంబ్లీలో ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఇస్తారన్నది జగన్ వాదన. అలా మాట్లాడకుండా అధికార పార్టీ జగన్ ను అడ్డుకుంటే అది ఆయనకే సానుభూతి కలుగుతుంది. మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వకపోతే అప్పుడే వాకౌట్ చేసి బయటకు వచ్చి మీడియా సమావేశం పెట్టొచ్చు... కానీ జగన్ అలా చేయడం లేదు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే తాను రానుంటూ చిన్నపిల్లాడు మంకు పట్టునట్లు వ్యవహరిస్తుండటం కూడా చూసే వారికి ఇబ్బందికరంగా ఉంది. సభలో ఏదైనా అవమానం జరిగితే సభ నుంచి శపథం చేసి బయటకు రావచ్చు. కానీ పదవి ఇవ్వడం లేదంటూ తాను పోనంటూ మొరాయించడం జగన్ ఆలోచన ఎటు వెళుతుందన్నదానికి మాత్రం వైసీపీ నేతలకే అర్థం కావడం లేదు. తాను వెళ్లకుండా, తన పార్టీ గుర్తు మీద గెలిచిన మిగిలిన పది మంది ఎమ్మెల్యేలకు కూడా జగన్ ఇదే సూత్రాన్ని అమలు చేస్తున్నారు. తాను చెడింది కాకుండా.. తన తోటి ఎమ్మెల్యేలను కూడా సభకు వెళ్లకుండా నిలువరించడం ఎందుకన్న ప్రశ్న వినపడుతుంది. వాళు ఇవ్వమంటున్నా.. ఇవ్వాల్సిందేనని పట్టుబట్టడం ఎందుకని కొందరు ప్రశ్నిస్తున్నారు.. ఇక వైఎస్ జగన్ జనంలోకి వెళ్లాల్సిన సమయంలో ఇటు బెంగళూరు టు అమరావతి చక్కర్లు కొడుతూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వినపడుతున్నాయి. ఇక్కడ కూర్చుని అధికార పార్టీపై విమర్శలు చేసే కన్నా జనంలోకి వెళ్లి తేల్చుకుంటే అది ప్లస్ గా మారుతుందని సూచిస్తున్నారు. కానీ జగన్ మాత్రం సంక్రాంతి నుంచి జిల్లాల పర్యటనలు వాయిదా వేసుకంటూ వస్తున్నారు. ఇప్పుడు ఉగాది అంటున్నారు. ఉగాది నాటికి కూడా జనంలోకి రావడం డౌట్ గానే ఉంది. ఎందుకంటే ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో ఇంత ముందు జనంలోకి వెళ్లడం వృధా ప్రయాస అని జగన్ భావిస్తున్నట్లుంది. కానీ ఈలోపు క్యాడర్ తో పాటు నేతలు కూడా చేజారిపోయే అవకాశముందన్న హెచ్చరికలు జగన్ చెవికి సోకడం లేదు


# నెల్లిమర్లలో సీన్ రివర్స్...

విజయనగరం. మార్చి 7, =ఉమ్మడి విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలో 2024 ఎన్నికల్లో జనసేన జెండా ఎగిరింది. టీడీపీకి కంచుకోట లాంటి నెల్లిమర్ల సెగ్మెంట్‌ని పొత్తుల లెక్కల్లో భాగంగా చివరి నిముషంలో జనసేనకు కేటాయించారు. నియోజకవర్గం ఆవిర్భావం నుండి ఇక్కడ టీడీపి హవానే కొనసాగుతూ వచ్చింది. అలాంటి నియోజకవర్గాన్ని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మాట కొట్టిపారేయలేక తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు వదులుకున్నారు. ఎవరు పోటీ చేసిన అంతిమంగా గెలవాలన్నదే తమ ధ్యేయమని పదే పదే చెప్పుకొచ్చారు కూటమి నేతలు. దానికి తగ్గట్లే నెల్లిమర్లలో కూటమి అభ్యర్ధి అయిన లోకం మాధవి టీడీపీ సపోర్ట్‌తో సునాయాసంగా గెలిచారు .ముఖ్యంగా నియోజకవర్గ టీడీపీ కేడర్ జనసేనకు పూర్తి స్థాయిలో సహకారం అందించారు. ఎన్నికల ముందు తానే అభ్యర్థినన్న ధీమాతో నెల్లిమర్లలో.. పూర్తిస్థాయి గ్రౌండ్ వర్క్ చేసుకున్న టీడీపీ ఇన్చార్జ్ బంగారురాజు పార్టీ అధిష్టానం నిర్ణయానికి శిరసావహించి ఎన్నకల ప్రచారంలో ఫుల్ ఎఫర్ట్స్ పెట్టారు. దాంతో లోకం మాధవి విజయం నల్లేరు మీద నడకలా సాగింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఇంకా ఏడాది కూడా గడవలేదు . కేవలం 8 నెలలు మాత్రమే పూర్తయ్యాయి . కానీ నెల్లిమర్ల కూటమిలో మాత్రం విభేదాలు రోజురోజుకీ తారాస్థాయికి చేరుకుంటున్నాయి .ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే లోకం మాధవి, టీడీపీ ఇన్చార్జ్ బంగారురాజులు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ బహిరంగంగానే వాగ్యుద్ధాలకు దిగారు. నెల్లిమర్ల నగర పంచాయితీ సమావేశంలో ఎమ్మెల్యే మాధవి ఆయన్ని గెట్ అవుట్ అంటూ అవమనపరిచారు. ఈ ఘటనను నియోజకవర్గ తెలుగు తమ్ముళ్ళు కూడా సీరియస్‌గా తీసుకున్నారు. బంగారురాజుకి మద్దతు తెలుపుతూ సర్వసభ్య సమావేశం నిర్వహించి మాధవికి బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు . టీడీపీ చలవతోనే గెలిచావన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని మండిపడ్డారు. ఆ తరువాత జనసేన, టీడీపీ పార్టీల క్రమ శిక్షణా సంఘం కమిటీలు మాధవికి, బంగారురాజుకి ఈ విషయంలో క్లాస్ కూడా తీసుకున్నాయి . చిన్న చిన్న విభేదాలు ఉంటే సర్దుకుపోవాలి తప్ప రచ్చకెక్కడం సరికాదంటూ ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశాయి .కానీ ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఇరు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటున్నట్లు కనిపిస్తుంది. గ్రామ స్థాయిలో సైతం పరిస్థితి అలానే ఉందంట. ఎక్కడా సైకిల్, గాజుగ్లాసు పార్టీలు కలిసి పనిచేసే పరిస్థితి లేదంట. ఇటీవల బూరాడపేట గ్రామంలో జరిగిన ఘర్షణ అందుకు తార్కాణంగా నిలుస్తోంది. ఓ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ విషయమై రెండు పార్టీల మధ్య పెద్ద యుద్ధమే నడిచింది. ఆ పోస్టు టీడీపీ కాకుండా జనసేనకి ఎలా కేటాయిస్తారంటూ తెలుగు తమ్ముళ్ళు ఫైర్ అయ్యారు. రెండు వర్గాల వారు ఒకరిపై ఒక్కరూ పిడిగుద్దులు కురిపించుకోవడంతో పలువురికి గాయలయ్యాయి . దాంతో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇదే కాదు నియోజకవర్గంలో నిత్యం పలు ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే లోకం మాధవి భర్త లోకం ప్రసాద్ ఇన్‌వాల్వ్‌మెంట్ పెరగడంతోనే విభేదాలు వస్తున్నాయని.. రెండు పార్టీలకు చెందిన కొందరు నాయకులు ఓపెన్‌గానే చెప్తున్నారు. పోలింగ్ వరకు టీడీపీ ఇంచార్ బంగారురాజుతో కలిసికట్టుగా పని చేసిన లోకం మాధవి.. గెలిచిన తరువాత బంగారురాజుతో పాటు టీడీపీ శ్రేణులను కూడా పట్టించుకోవడం మానేశారని.. అందుకు ఆమె భర్త పెత్తనమే కారణమన్న విమర్శలున్నాయి. స్థానికంగా బలోపేతమవ్వడానికి లోకం మాధవి భర్త వైసీపీ వారిని చేరదీస్తూ.. జనసేనలో చేర్చుకుంటున్నారని టీడీపీ నాయకులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ క్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా స్థానిక ఎమ్మెల్యే వర్గం పావులు కదుపుతున్నారని తెలుగు తమ్ముళ్లు వాపోతున్నారు. ఇప్పుడు తెలుగు తమ్ముళ్లతో కలిసి జనసైనికులు కూడా అదే వాయిస్ వినిపిస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది. మొదట్లో జనసైనికులకు పెద్ద పీట వేసిన లోకం మాధవి ఇపుడు మెల్లగా వారిని కూడా పక్కకి నెట్టేస్తున్నారట. నెల్లిమర్లకు స్థానికేతురాలైన లోకం మాధవిని పాలన వ్యవహారాల్లో ఆమె భర్త లోకం ప్రసాద్ డామినేట్ చేస్తూ .. అధికార కార్యక్రమాలు, ప్రభుత్వ పనుల్లో చేతివాటం చూపిస్తున్నారని జనసైనికులు ఆరోపిస్తున్నారు. తాము పవన్ కళ్యాణ్ ఆశయాల కోసం అహర్నిశలు పని చేస్తుంటే.. ఎమ్మెల్యే, ఆమె భర్త సొంత ప్రయోజనాల కోసం కార్పొరేట్ రాజకీయం చేస్తున్నారని జనసైనికులు మండిపడుతున్నారు. ఆ క్రమంలో నాన్ లోకల్ వాళ్ళని గెలిపించడం పెద్ద తప్పైందని నెల్లిమర్ల కూటమి శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. టీడీపీ వారిని ఇప్పటికే దూరం పెట్టేసిన ఎమ్మెల్యేను జనసేన కార్యకర్తలు, ప్రజలు కలిసి సమస్యలు చెప్పుకుందామంటే కుదరడం లేదంట. ఇంటి దగ్గరకు వెళ్తే మాధవి భర్త పర్సనల్ వ్యక్తులు గేటు దగ్గరే అడ్డుకుంటూ.. ఎపుడు అడిగినా మేడమ్ బిజీ అంటూ తరిమేస్తున్నారంట. అదలా ఉంటే కూటమి కుమ్ములాటలతో వైసీపీ శ్రేణులు నవ్వుకుంటున్నాయంట. తమను ఓడించి ఇప్పుడు వాళ్ళలోవాళ్ళే కొట్టుకుంటుంటే వైసీపీ కేడర్ తెగ ఎంజాయ్ చేస్తోందంట. ఏదేమైనా ప్రత్యర్థులను టార్గెట్ చేయాల్సిన కూటమి నాయకులు కొట్లాటలతో వారికి వారే టార్గెట్ అవుతుండటం నెల్లిమర్లలో హాట్‌టాపిక్‌గా మారిందిప్పుడు. చూడాలి మరి భవిష్యత్‌లోనైనా సర్దుకుపోతారో.. లేక వీళ్ళే సర్దేసుకొని, ప్రత్యర్థులకు పట్టం కడతారో.

# కమలం గూటికి విజయసాయిరెడ్డి

విశాఖపట్టణం, మార్చి 7,

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీతో పాటు తన ఎంపీ పదవికి కూడా హఠాత్తుగా రాజీనామా చేశారు. ఇక తాను రాజకీయాలకు దూరమని హార్టికల్చర్ చేసుకుంటానని ప్రకటించారు. అన్నట్లుగానే ఆయన రాజీనామా చేసి కొన్నాళ్లు కనిపించకుండా పోయారు. ఈ మధ్యలో ఆయన కొన్ని రహస్య సమావేశాలు నిర్వహించారు. కానీ వివరాలు బయటకు రాలేదు. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్‌ను కూడా కలిశారు. కంది ఐఐటీకి వచ్చిన ఆయనకు ప్రోటోకాల్ లేకపోయినా ఆయన వద్దకు వెళ్లి మరీ ఆహ్వానించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఆయనకు ఎందుకు అవకాశం వచ్చిందో మెల్లగా కన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. విజయసాయిరెడ్డి రాజకీయాలకు శాశ్వతంగా దూరం కాలేదు. ఆయన కొంత విరామం తీసుకోవాలనుకున్నారు. ముఖ్యంగా వైసీపీకి రాజీనామా చేసిన వెంటనే మరో పార్టీలో చేరితే అనేక ప్రశ్నలు వస్తాయని అందుకే కొంత కాలం విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నారు. భారతీయ జనతా పార్టీలో చేరేందుకు అన్నీ మాట్లాడుకున్న తర్వాతనే రాజీనామా చేశారని ప్రస్తుతం ఓ క్లారిటీ వచ్చిందని అంటున్నారు. ఆయన బయటకు కనిపించకపోయినా..తెలియకపోయినా బీజేపీ పెద్దలతో నిరంతరం టచ్ లో ఉంటున్నట్లుగా తెలుస్తోంది. తాను రాజీనామా చేసిన రాజ్యసభ సీటును మళ్లీ ఆయన కోరుకోవడడం లేదు. పదవి లేకపోయినా పర్వాలేదు ఆయన బీజేపీలో చేరాలనుకుంటున్నారు. అందుకే తను రాజీనామా చేసిన స్థానంలో ఉపఎన్నిక జరిగిన వెంటనే ఆయన బీజేపీలో చేరేందుకు ప్రణాళికలు సిద్దం చేసుకుంటారని చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఉన్న విశ్వసనీయ సమాచారం మేరకు జూన్ లేదా జూలై నెలల్లో బీజేపీ తీర్థాన్ని పుచ్చుకునేందుకు విజయసాయిరెడ్డి రెడీ అయ్యారని అంటున్నారు. బీజేపీ పెద్దలు కూడా ఈ అంశంపై సానుకూలంగా ఉన్నారని.. అలా డీల్ మాట్లాడుకున్నందునే రాజీనామా చేశారని అంటున్నారు. అయితే విజయసాయిరెడ్డిని పార్టీలో చేర్చుకోవడంపై కూటమి పార్టీలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఆయన తన పదవికి రాజీనామా చేసినప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ గురించి చాలా పద్ధతిగా మాట్లాడారు. వారిపై తాను చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయాల్లో భాగంగా చేసినవే తప్ప.. వ్యక్తిగతంగా తనకు వారితో మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. విజయసాయిరెడ్డిపై అనేక కేసులు ఉన్నాయి. జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఆయన ఏ2గా ఉన్నారు. అలాగే కాకినాడ పోర్టును బెదిరించి రాయించుకున్నారన్న కేసుల్లోనూ ఇటీవల ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఇంకా అనేక స్కాముల్లో ఆయన పేరు ఉందని ప్రచారం జరుగుతున్న సమయంలోఆయన వైసీపీకి గుడ్ బై చెప్పారు. ఇప్పుడు బీజేపీలోనే చేరాలనుకుంటున్నారు. ఆయనను చేర్చుకుంటారా లేదా అన్నదానిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది.



## సీసీ కెమెరాలను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి మార్చి 7,

తిరుపతి రైల్వే స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. తరువాత ఈస్ట్ పోలీస్ స్టేషన్లో కర్నాలు వీధి నుండి పూర్ణకుంభం సర్కిల్ వరకు ఏర్పాటుచేసిన 19 కెమెరాలను ఎస్పీ పరిశీలించారు. భూదేవి కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను స్వయంగా పరిశీలించారు. సిసి కెమెరాలు క్వాలిటీ సంబంధించి క్లారిటీగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన సహించేది లేదని హెచ్చరించారు. అంతేకాకుండా కనక భూషణం లేఔట్ లో గల పద్మావతి పార్కు, గోపాల్ రాజ్ కాలనీ, సీతమ్మధార రోడ్డు, శాంతినగర్ కాలనీలోని ప్రజలతో మాట్లాడారు. తిరుపతిలో పోలీసింగ్ పనితీరు ఎలా ఉంది..? ప్రతిరోజు రాత్రి సమయంలో నైట్ బీట్ పోలీసులు వస్తున్నారా..? లేదా .?అనే విషయాన్ని కాలనీలోని మహిళలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో ఆకతాయిలు ఎవరైనా అల్లరి చేస్తున్నారా..? అలాంటివి ఉంటే వెంటనే తమ దృష్టి తీసుకురావాలని మహిళలకు సూచించారు. పోలీస్ పరంగా మీకు ఎమైన సమస్యలు ఉంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. స్థానిక పోలీసులు స్పందించని పక్షంలో ఫోన్ ద్వారా గాని స్వయంగా తన కార్యాలయానికి వచ్చి గాని తెలపాలని కాలనీ వాసులకు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై నిఘా ఉంచుతామని తెలిపినారు. ప్రశాంతతకు నిలయమైన తిరుపతిలో ఎవరైనా రాత్రి సమయంలో గానీ, పగలు సమయంలో గానీ ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలు చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీ హేమంత్ ట్రైనీ ఐపిఎస్, కె రవి మనోహర ఆచారి, అదనపు ఎస్పీ పరిపాలన, శ్రీలత డిఎస్పి మహిళ పిఎస్ సాధిక్ అలీ సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు

## రాజాం లో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

శ్రీకాకుళం మార్చి 7,

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజాం పట్టణంలో లీగల్ మెట్రాలజీ అధికారులు ఫ్రూట్స్ అమ్మకాల దుకాణాలపై తనిఖీలను నిర్వహించారు. పట్టణంలో పండ్ల దుకాణదారులపై తరచుగా వస్తున్న ఫిర్యాదులు మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారులు దామోదర్ నాయుడు, బలరాం కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి కాటాలను పరిశీలించి, తూకాలు సరిగా లేని కాటాలు సిజ్ చేసి పదిమందిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఇకపై తూకల్లో తేడాలు వస్తే కఠినమైన చర్యలతో ఉంటాయిని హెచ్చరించారు.

## కిడ్నాప్ కేసు సుఖాంతం

నల్లగొండ మార్చి 7,

జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో మూడేళ్ల బాలుడి కిడ్నాప్ కేసు సుఖాంతం అయింది. ఈ నెల 4న మధ్యాహ్నం సమయంలో బాలుడిని నకిరేకల్ మండలం, మాంద్ర కు చెందిన దుండగుడు సీతారాములు ఎత్తుకుపోయాడు. -బాధితుల ఫిర్యాదుతో 2 టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. బాధిత కుటుంబం గత మూడేళ్ళగా ఆసుపత్రి ఆవరణలోనే నివాసనీ ఉంటుంది. అక్కడే నివాసముంటున్నా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పట్టించుకోలేదు. సిసి ఫుటేజ్ లో చూయించిన సమయానికి ఆ లొకేషన్లో కాల్ డేటా తీసారు పోలీసులు.

## ఉడ్ ల్యాండ్ కార్యకలపాలను ప్రారంభించిన మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ మార్చి 7,

ప్రఖ్యాతబ్రాండెడ్ సంస్థలు నగరంలో సేవలందించడం అభినందనీయం అని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ లో ఉడ్ ల్యాండ్ సంస్థ కార్యకలాపాలను జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరానికి నిత్యం వస్తున్న విదేశీ టూరిస్టులు వారి అవసరాలకు అనుగుణంగా ఆహారం విషయంలో, వస్తువుల విషయంలో ప్రపంచంలోనే ఏ దేశంలో దొరికేవైనా ఇక్కడ లభిస్తుందడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా ఏజీఎం లీలా ప్రసాద్ మాట్లాడుతూ బంజారాహిల్స్ లో తాము 24వ బ్రాంచ్ ప్రారంభించినట్లు తెలిపారు.

భారత శక్తి



# ఎమ్మెల్సీ కోసం రాములమ్మ... హస్తినకు ప్రయాణం

హైదరాబాద్, మార్చి 7,

తెలంగాణ రాజకీయాలలో రాములమ్మ తెరపైకి వచ్చారు. తన త్యాగాలను గుర్తుపెట్టుకొని ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నేరుగా ఆమె అధిష్టానం వద్దకే వెళ్లింది. ఎలాగైనా తనకు న్యాయం చేయాలని రాములమ్మ విజ్ఞప్తి చేయడంతో, కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఇదే పొలిటికల్ టాపిక్ గా మారింది. ఇంతకు రాములమ్మ ఎవరని అనుకుంటున్నారా.. రాములమ్మ సినిమాతో ప్రజల మదిలో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకున్న నటి విజయశాంతి.సినీ రంగం నుండి రాజకీయ రంగంలోకి ప్రవేశించిన అనంతరం విజయశాంతి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. ముందుగా తల్లి తెలంగాణ పార్టీ స్థాపించి తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించారు. ఆ తర్వాత అనూహ్య రాజకీయ పరిణామాల నేపతిమాలో బిజెపి కండువా కప్పుకున్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో విజయశాంతి జాయిన్ అయ్యారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి వచ్చారు విజయశాంతి. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ నుండి బిజెపికి లో చేరారు. గత ఎన్నికల ముందు విజయశాంతి బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల సమయంలో తన వంతుగా ప్రచారాన్ని సైతం సాగించారు.ఇటీవల తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన క్రమంలో బీఆర్ఎస్ పార్టీ నుండి పలు విమర్శలు వచ్చాయి. ఆ సమయంలో విజయశాంతి గతంలో తాను



ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్స్ ఖాతా ద్వారా పోస్ట్ చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి మద్దతు తెలిపారు. అలాగే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డులపై సీఎం రేవంత్ రెడ్డి మాటకు విజయశాంతి వత్తాసు పలికారు. తెలంగాణకు కనీసం నాలుగు అవార్డులైన ఇచ్చి ఉండాల్సిందని విజయశాంతి అభిప్రాయపడ్డారు.తాజాగా తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. ఈ 5 స్థానాలకు ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రణాళిక ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో పడ్డాయి. బీఆర్ఎస్ కు ఉన్న ఎమ్మెల్యేల సంఖ్యకు ఒక ఎమ్మెల్సీ ఖాయమనే చెప్పవచ్చు. మిగిలిన 4 స్థానాలకు కాంగ్రెస్ నుండి అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఇక్కడే విజయశాంతి అలియాస్ రాములమ్మ ఎమ్మెల్సీ సీటు నేరుగా ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన విజయశాంతి, ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని ఢిల్లీ పెద్దలను కోరారని తెలుస్తోంది. పార్టీ కోసం తాను చేసిన త్యాగాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆమె కోరారట.అయితే అధిష్టానం మాత్రం ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదని, ఆమె విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ మాత్రం కాంగ్రెస్ ను నమ్ముకున్న ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని, పార్టీ కోసం కష్టపడిన వారికి సుస్థిర స్థానం ఉంటుందని హామీ ఇస్తున్నారు. మొత్తం మీద రాములమ్మ ఎమ్మెల్సీ పదవి కోసం ఏకంగా ఢిల్లీ పెద్దలను కలవడంపై ప్రస్తుతం ఇదే టాక్ ఆఫ్ ది పొలిటికల్ గా మారింది. మరి రాములమ్మ కోరిక నెరవేరుతుందా? లేదా అన్నది మున్ముందు తెలియాల్సి ఉంది.

# అమరావతి అప్పులకు లైన్ క్లియర్

విజయవాడ, మార్చి 7, రాజధాని నిర్మాణానికి సేకరించిన భూముల్ని విక్రయించడం ద్వారా నిధులు సమీకరిస్తామని, ప్రజలపై ఎలాంటి భారాలు మోపమని ఏపీ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ వ్యాఖ్యల్ని నారాయణ ఖండించారు. మరోవైపు అమరావతి రుణాలకు లైన్ క్లియర్ అయ్యింది.అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకున్న భూములలో కొంత మేర అమ్మడం ద్వారా రాజధానిని నిర్మిస్తామని మంత్రి నారాయణ వివరించారు. మరోవైపు అమరావతి రుణాల మంజూరులో ఎదురవుతోన్న సాంకేతిక సమస్యలను అధిగమించినట్టు సిఆర్డిఏ ప్రకటించింది. రాజధాని అప్పులపై ఆర్థిక సంస్థలు సంతృప్తి చెందినట్టు సీఆర్డిఏ కమిషనర్ కన్నబాబు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతి నిర్మాణం కోసం ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం వేసేది లేదని చెప్పారు. అమరావతిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నారాయణ నెల్లూరులో మీడియాతో మాట్లాడారుఅమరావతి రాజధాని నిర్మాణానికి హడ్కో, ప్రపంచ బ్యాంకు, ఏఎః తో పాటు జర్మనీ బ్యాంకు నుంచి రుణాలు సేకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజధానిపై ప్రతిపక్షాల మాటలు వినవద్దని, నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాజధాని అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ఉండాలని సీఎం భావిస్తున్నారని, అందుకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నమని చెప్పారు.రాష్ట్ర బడ్జెట్ లో అమరావతికి 6 వేల కోట్లు కేటాయించారని, అవసరమైతే ఇంకా నిధులు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పినట్లు మంత్రి వివరించారు. రాజధాని విషయంలో పారదర్శకంగా ఉంటామని, ఎలాంటి అవకతవకలు ఉండవని మరోసారి స్పష్టం చేశారు.నాఖీ రేట్ల ప్రకారం మాత్రమే టెండర్లు పిలిచి నిర్మాణాలు చేస్తున్నామని, గత ప్రభుత్వం మాదిరిగా నిధులు పక్క దారి పట్టించడం లేదని చెప్పారు. 217 చ.కి.మీ పరిధిలో పరిధిలో అంతర్జాతీయ ప్రమాణాలతో 5 వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం జరుగుతుందన్నారు.



50 వేల కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో 1000 నుంచి 1200 ఎకరాల్లో అంతర్జాతీయ యూనివర్సిటీలు, పాఠశాలలు, పలు సంస్థలకు భూములు కేటాయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు.అమరావతి నిర్మాణానికి ప్రపంచ ఆర్థిక సంస్థలు ఇప్పటికే రుణాలను మంజూరు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. పలు అంతర్జాతీయ సంస్థలతో పాటు హడ్కో కూడా భారీగా రుణాలను ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ క్రమంలో రాజధాని నిర్మాణం, రాజకీయ అభ్యంతరాలపై రుణాలను మంజూరు చేసే సంస్థలకు పలువురు ఫిర్యాదు చేశారు. అమరావతి నిర్మాణంపై రాజకీయంగా ఏకాభిప్రాయం లేదని ఫిర్యాదు చేయడంతో నిధుల విడుదలలో జాప్యం జరిగింది. డిసెంబర్ నాటికి రుణాలకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉండగా అందులో జాప్యం జరిగింది.ణ మంజూరులో జరుగుతున్న జాప్యంపై సిఆర్డిఏ కమిషనర్ కన్నబాబు వివరణ ఇచ్చారు. రుణాల మంజూరుపై వ్యక్తమైన అభ్యంతరాలకు వివరణ ఇచ్చినట్టు స్పష్టం చేశారు. అయా సంస్థల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. రుణాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ కొలిక్కి వచ్చిందని బ్యాంకు ఖాతాలు కూడా సిద్ధమైనట్టు తెలిపారు. రుణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేవని కన్నబాబు వివరించారు.

# ప్రతి రంగంలో మహిళల ప్రస్థానాన్ని, వారి స్థానాన్ని సమీక్షించాలి

నందిగామ మార్చి 7,

యూసఫ్ గూడా లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో , స్మాల్, మీడియం ఎంటర్ప్రైజెస్ ప్రాంగణంలో మహిళా సాధికారత యాక్షన్ ప్లాన్ వర్క్ షాప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ హజరయ్యారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు సమాన వేతనాలు ఉండాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం . మహిళల కష్టానికి తగిన ఫలితం ఉండాలన్నదే మహిళా దినోత్సవ ఆవిర్భావానికి కారణంగా నిలిచింది. భూగర్భం నుండి అంతరిక్ష రంగం వరకు అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు రావాలి. మహిళల కష్టానికి తగిన ఫలితం దక్కినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం. మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగిన వివక్షత కొనసాగుతూనే ఉంది. మహిళలు ఎమ్మెల్యేలు మంత్రులు ఐఏఎస్లు అయినా లైంగిక అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఒకప్పుడు మహిళలకు వ్యవసాయం, పరిశ్రమలు మాత్రమే ఉపాధి మార్గాలు. కానీ ఇప్పుడు ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు . అయినప్పటికీ మహిళల పట్ల సమాజంలో చిన్న చూపు పోవడం లేదని అన్నారు.ప్రతి రంగంలో మహిళల ప్రస్థానాన్ని, వారి స్థానాన్ని సమీక్షించాలి. లింగ సమానత్వం విషయంలో ఐక్యరాజ్యసమితి నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంత మేర మనం చేరుకోగలుగుతున్నామో ఆవలోకనం చేసుకోవాలి. మహిళలకు సమానత్వం, సమాన అవకాశాలు రావాలి. లింగ అంతరాలను తుంచితినే సమాజంలో సమానత్వం. శారీరకంగా మహిళలకు ఎన్నో ప్రతికూలతలు ఉన్నాయి. వాటన్నిటినీ అధిగమించి మహిళలు ముందంజ వేస్తున్నారు. మహిళల ప్రతికూలతలను దృష్టిలో ఉంచుకొని విధానాల రూపకల్పన జరగాలి. ఆదిశలో ప్రజా ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. మహిళా అనుకూలంగా అత్యుత్తమ విధానాన్ని రూపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. అనుభవజ్ఞులంతా సలహాలు సూచనలు చేస్తే, అనుగుణంగా నూతన విధానాన్ని రూపొందిస్తాం. లింగ సమానత్వాన్ని సాధించడంలో మహిళా సంఘాల పాత్ర గణనీయంగా ఉంది. మహిళా సంఘాలు మహిళలకు ఆర్థిక రక్షణతో పాటు సామాజిక భద్రత కల్పిస్తున్నాయి. అన్ని రంగాల్లో మహిళలకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. పెట్రోల్ పంపులు, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నాం. అదా నీ అంబానీలకి ఫలితమైన సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అందిస్తున్నాం. త్వరలో మరిన్ని వ్యాపారాల్లోకి మహిళా సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాం. ఏడాది అనుకున్న లక్ష్యాలకు మించి మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించామని అన్నారు.

# అంత ఫీల్ గుడ్డేనా...

విజయవాడ, మార్చి 7, (న్యూస్ పల్స్)

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఏదో జరిగిపోతుందని అందరూ ఊహించారు. కానీ ఇచ్చిన హామీలు అమలుపరుస్తామని చెబుతున్నప్పటికీ పెద్దగా అమలు కాలేదు. పింఛన్ల మొత్తాన్ని నాలుగు వేల రూపాయలుకు పెంచడం మినహా పెద్దగా ఒరిగిందేమీ లేదన్న కామెంట్స్ క్షేత్ర స్థాయిలో వినపడుతున్నాయి. మరోవైపు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించుకుంటున్నా మహిళలు అంత సంతోషంగా లేరన్నది కూడా అంతే వాస్తవం. అంతకు మించి ఇప్పటి వరకూ ఏ పథకాన్ని అమలు చేయకపోవడం.. అదిగో.. ఇదిగో అంటూ తేదీలు మారుస్తూ కాలయాపన చేస్తుండటంతో ప్రజలపై కూటమి ప్రభుత్వం పట్ల ఆశలు సన్నగిల్లినట్లే కనపడుతుంది ఇక ప్రధానమైన వర్గం రైతులు కూడా ఆందోళనలో ఉన్నారు. ఏ పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో గతమే మేలన్న అభిప్రాయానికి అన్నదాతలు వచ్చే అవకాశముంది. మిర్చి రైతులను ఆదుకుంటున్నామని ప్రభుత్వం హడావిడి చేసిన ప్రకటనలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఏ పంటకు సరైన ధర లభించడం లేదని రైతాంగం ఆందోళన చెందుతుంది. మరొక వైపు అన్నదాత సుఖీ భవ పథకాన్ని ఇస్తామని ప్రకటిస్తున్నా తమ ఖాతాల్లో పడేంత వరకూ ఎవరికీ నమ్మకం లేదు. అందులో ప్రతి పథకంలో లబ్దిదారుల ఎంపిక ఎలా ఉంటుంది? తమ పేరు అందులో ఉంటుందా? లేదా? అన్న సందేహాలు కూడా కర్షకులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. ఇక మహిళలకు ఉచిత బస్సు పథకం ఊసే లేకపోవడంతో పాటు పద్దెనిమిదేళ్లు నిండిన వారికి ప్రత్యేకంగా నిధులు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం దాని పేరు కూడా తలవడం లేదు. గత వైసీపీ హయాంలో ఏదో ఒక రూపంలో డబ్బులు వచ్చేవి చేతుల్లో ఉండేవి. కానీ ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా తమకు అందలేదన్న నిరాశా, నిస్పృహలు అయితే బాగా కనపడుతున్నాయి. ఏ పథకాన్ని అమలు చేయాలన్నా నిధులు లేవని ప్రభుత్వం పదే పదే చెబుతుండటంతో తమకు ఇప్పట్లో అవి దరి చేరే అవకాశం లేదన్న నిర్ణయానికి వచ్చారు. అయితే అధికార పార్టీని ఏమీ అనలేక, తమలో తాము మహిళలు ఆర్థికంగా చితికిపోక తప్పదన్న నిర్ణయానికి వచ్చినట్లుంది.. ఇక గత వైసీపీ ప్రభుత్వంలోనూ జగన్ ఇలాగే భావించారు. ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ ఎక్కువగా ఉందని, తనను పథకాలే తిరిగి గెలిపిస్తాయని జగన్ గట్టిగా నమ్మారు. కానీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత మైండ్ బ్లాంక్ అయింది. ఇప్పుడు కూడా కూటమి పార్టీల పరిస్థితి అలాగే ఉంది. ఈయన కంటే ఆయనే బెటర్ అన్న భావనకు ప్రజలు వచ్చే అవకాశముంది. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో తీసుకెళు తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో జనం మాత్రం అంతగా సంతృప్తికరంగా లేరన్నది వాస్తవం. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొంత ఇబ్బందులు పడుతున్నారు. జనంలోకి వెళ్లి వారికి నచ్చ చెబుదామన్న చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలించడం లేదు. కొన్నిచోట్ల మహిళలు ఎమ్మెల్యేలను నిలదీస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా అధికారుల నుంచి వచ్చే నివేదికలను కాకుండా క్షేత్రస్థాయి కార్యకర్తల ఒపీనియన్ తీసుకుంటే మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి


# పిఎంజే జ్యువెల్స్ ఆధ్వర్యంలో అతిపెద్ద వెడ్డింగ్, హాఫ్ సారీ ఆభరణాల ప్రదర్శన

హైదరాబాద్హైదరాబాద్లో పిఎంజే జ్యువెల్స్ ఆధ్వర్యంలో అతిపెద్ద వెడ్డింగ్, హాఫ్ సారీ ఆభరణాల ప్రదర్శన. 7 నుండి 9 వరకు జరిగే 3 రోజుల పాటు జరగనున్న ప్రదర్శనలో ఇంతకు ముందు చూడని 10 వేలకు పైగా హస్తకళా డిజైనర్ ఆభరణాల ప్రదర్శన వుంటుంది. . దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రియమైన ఫైన్ జ్యువెలరీ బ్రాండ్ అయిన పిఎంజే జ్యువెల్స్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్లోని తాజ్ కృష్ణలో అతిపెద్ద వెడ్డింగ్, హాఫ్ సారీ ఆభరణాల ప్రదర్శనను ప్రారంభించారు. ఆభరణాల ప్రదర్శనలో 20000 పైగా పిఎంజే యొక్క అత్యుత్తమ హ్యాండ్ మేడ్ డిజైనర్ ఆభరణాల శ్రేణిని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన హైదరాబాద్లో ఇప్పటివరకు అతిపెద్ద వివాహ, హాఫ్ సారీ ఆభరణాల ప్రదర్శనగా నిలిచింది.

# పోసాని ... తర్వాత ఎవరు...

ఒంగోలు, మార్చి 7,

కేసుల భయంతో వైసీపీ నేతలు వణికిపోతున్నారంట. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మొదలైన అరెస్టుల పర్వం కొనసాగుతూనే ఉంది. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై వరుసగా నమోదవుతున్న కేసులతో ఆయనకు ఇప్పట్లో బెయిల్ లభించే అవకాశం లేదంటున్నారు. తాజాగా.. సినీ నటుడు, వైసీపీ నేత, బూతుల సామ్రాట్ పోసాని కృష్ణమురళిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రజలు, పార్టీ కేడర్ను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదలి పెట్టబోమని శాసనమండలిలో మంత్రి నారా లోకేష్ ప్రకటించగానే పోసాని రూపంలో మరో వికెట్ పడటంతో.. నెక్స్ ఎవరో అని వైసీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారంట.మంత్రి నారా లోకేష్ శాసనమండలిలో చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగా యాక్షన్ పార్ట్ కొనసాగుతోంది. వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టారో.. వారిని వదిలే ప్రసక్తే లేదని.. టైం.. డేట్ కూడా రాసుకోండి అంటూ మంత్రి నారా లోకేశ్ మండలిలో ప్రతిపక్ష సభ్యులను ఉ



ద్దేశించి తాజాగా వ్యాఖ్యానించారు. తద్వారా త్వరలో మరికొంత మంది వైసీపీ నేతలు అరెస్టు కాబోతున్నారని లోకేష్ క్లియర్ కట్ గా చెప్పారు. దీంతో అధికారంలో ఉన్నంత కాలం ఇష్టానుసారం చెలరేగి పోయిన వైసీపీ నేతలు వణికిపోతున్నారు. ఎవరు ఎప్పుడు కటకటాల పాలుకావాల్సి వస్తుందోనని భయపడుతున్న పరిస్థితి.మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మొదలైన అరెస్టుల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై వరుసగా కేసుల మీద కేసులు నమోదౌతున్నాయి. సిట్ విచారణ కొనసాగుతుంది. వంశీ బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తూ సిట్ అధికారుల ముందు తమ గోడు వెళ్లబోసుకుని కేసులు పెడుతున్నారు. అంతకు ముందు నమోదైన కేసుల సంగతి పక్కన పెడితే? అరెస్ట్ అయ్యాక కూడా వంశీపై వరసగా నమోదవుతున్న కేసులతో.. ఆయన ఇప్పట్లో జైలు నుంచి బయటకు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.తాజాగా.. సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిని పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ లోని రాయదుర్గం మైహోం భూజా అపార్ట్ మెంట్స్ లో ఉంటున్న పోసానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ హయాంలో ఇష్టానుసారం నోరు పారేసుకున్న పోసాని కృష్ణమురళీ .. రెండు నెలల క్రితం మీడియా సమావేశం పెట్టి తనకు జ్ఞానోదయం అయ్యిందనీ, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. అయితే అరెస్ట సమయంలో పోసాని పెద్ద మెలో డ్రామానే నడిపారంట. పోలీసులతో వాగ్వివాదానికి దిగి, బనీన్, నిక్కర్ మీదనే హడావుడి చేశాడు. డ్రెస్ వేసుకుని రావాలని చెప్పినా వినకుండా ఆయన ఓవరాక్షన్ చేస్తుండటంతో.. అతి కష్టంమీద పోలీసులు పోసానిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.పోసాని కృష్ణమురళి.. ఆ వ్యక్తి పేరు, భాష గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయన నోరు తెరిస్తే బూతు పురాణం వల్లె వేశారు. పేరుకు ఆయనో సినిమా రచయిత, దర్శకుడు, నటుడు? ఆయన సినిమాల్లో నీతులు చెబుతుంటారు. కానీ మైకు దొరికితే చాలు పచ్చిబూతులతో చెలరేగిపోతారు. ముఖ్యంగా వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో జగన్ ప్రాపకం కోసం ఆయన ప్రెస్మీట్లు పెట్టి వాడిన బూతు డైలాగులు ఇప్పటికీ అందరి చెవుల్లో రీసౌండ్ ఇస్తూనే ఉంటాయి. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు, లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, వారి కుటుంబసభ్యులపై పచ్చి బూతులతో చెలరేగిపోయేవారు.వారిని ఎంతగా తిడితే జగన్ దగ్గర అన్ని మార్కులు పడతాయన్న ఉద్దేశంతో నోటికి అడ్డూ అదుపూ లేకుండా విరుచుకుపడ్డారు. పోసాని తిట్ల దండకంలో రాయడానికి వీల్లేని, అత్యంత అభ్యంతకరమైన బూతులు వినిపించేవి. మీడియా ముందు మాట్లాడుతున్నాన్న సోయ లేకుండా తనదైన హావభావాలతో తెగ చెలరేగిపోయారాయన. పోసాని ప్రెస్మీట్ టీవీల్లో వస్తోందంటే చిన్న పిల్లలు, ఆడపిల్లలున్న ఇళ్లలో వెంటనే ఛానల్ మార్చేయడమో, టీవీ కట్టేయడమో చేసేవారంటే ఆయన ఎంత నీచంగా మాట్లాడేవారో అర్థమవుతుంది.ఆ ఎఫెక్ట్ తోనే పోసానిపై గతంలో కేసులు నమోదయ్యాయి. అయితే అధికారం వైసీపీదే కావడంతో చర్యలు లేకుండా పోయాయి. వైసీపీ ప్రభుత్వంలో ఏపీఎఫ్టీవీడీసీ చైర్మన్గా పోసాని కృష్ణ మురళి పనిచేశారు. ఆ సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్తోపాటు నారా లోకేశ్ ను అసభ్యకరంగా దూషించారు. దాంతో ఏపీలోని పలు స్టేషన్లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఆయన పలు సందర్భాల్లో అభ్యంతరకర భాషతో కూటమి నేతలను దూషించారు. ఇటీవల కాలంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిపైనా అనుచిత వ్యాఖ్యలు చేశారు. దాంతో ఆయనపై బాపట్ల, అనంతపురం, పల్నాడు జిల్లా నరసరావుపేట, చిత్తూరు జిల్లా యాదమరి, తిరుపతి జిల్లా పుత్తూరులో పోలీసులకు ఫిర్యాదులు అందాయి.మొత్తంగా ఏపీ వ్యాప్తంగా పలు అంశాలపై పోసానిపై 11 కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే.. రెండు నెలల క్రితం పోసాని మీడియా సమావేశం పెట్టి తనకు జ్ఞానోదయం అయ్యిందనీ, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. దీంతో కూటమి ప్రభుత్వం తనను వదిలేస్తుందని పోసాని భావించినట్లున్నారు. కానీ, బండబూతులు తిట్టి రాజకీయాలు వదిలేశానంటే కుదరదని పోలీసులు అరెస్ట్ చేసి ఆయనకు క్లారిటీ ఇచ్చారు.మండలిలో లోకేశ్ స్ట్రాంగ్ వార్నింగ్ తరువాత చాలా మంది వైసీపీ నేతలు రహస్య ప్రాంతాలకు వెళ్లి తలదాచుకుంటున్నారని ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వంశీ అరెస్టు తరువాత ఎవర్ని అరెస్టు చేస్తారోనని వైసీపీ నేతలు భయంతో వణికిపోతున్నారు. అయితే ముందుగా పోసాని వంతు వచ్చింది. పోసానిని అరెస్టు చేసిన తరువాత నెక్స్ ఎవరు..? అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. .అయితే, ఈసారి పక్కాగా కొడాలి నాని అరెస్టు ఉంటుందని వైసీపీ నేతలు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొడాలి నానిపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గతంలో ఆయనపై కేసులు, ప్రస్తుతం పలు స్టేషన్లలో ఆయనపై నమోదైన కేసుల వివరాలను సేకరిస్తున్నారట.అరెస్ట్ భయంతోనే కొడాలి నాని హైదరాబాద్తోపాటు బెంగళూరు వంటి నగరాల్లోనే ఎక్కువగా ఉంటున్నారని టాక్ నడుస్తోంది. ఇటీవల వైసీపీ అధ్యక్షుడు జగన్.. వంశీని పరామర్శించేందుకు విజయవాడ జైలుకు వెళ్లారు. ఆ సమయంలో జగన్ వెంట కొడాలి నాని ఉన్నాడు. మరుసటి రోజు గుంటూరు మిర్చి యార్డుకు జగన్ వెళ్లిన సమయంలోనూ కొడాలి నాని ఉన్నాడు. ఆ వెంటనే కొడాలి నాని తన అనుచరులకు కూడా చెప్పకుండా రహస్య ప్రాంతానికి వెళ్లిపోయారంటున్నారుమొత్తమ్మీద పోసాని కృష్ణమురళి అరెస్టుతో జగన్ మళ్లీ బెంగళూరు నుంచి ఏపీకి రావాల్సిన పరిస్థితి తలెత్తిందన్న సెటైర్లు వినిపిస్తున్నాయి. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసినప్పుడు జగన్ బెంగళూరు ప్యాలెస్లోనే ఉన్నారు. అప్పట్లో జగన్ బెంగళూరు నుంచి నేరుగా నెల్లూరు జైలుకు వెళ్లి పిన్నెల్లిని పరామర్శించరు. ఇటీవలే విజయవాడ జైలుకెళ్లి వల్లభనేని వంశీతో జగన్ ములాఖత్ అయ్యాడు. ప్రస్తుతం పోసాని మురళీ కృష్ణ వంతు వచ్చింది . రాజకీయాలు వదిలేసానంటున్న పోసానిపై అమితమైన ప్రేమ కురిపిస్తున్న జగన్ మళ్లీ బెంగళూరు నుంచి మళ్లీ పరామర్శకు వస్తారంటున్నారు. అదే జరిగితే మున్ముందు జగన్ మరిన్ని జైలు యాత్రలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని వైసీపీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

====================

# మామునూరు ఎయిర్ పోర్ట్.. ప్రభుత్వానికి టెన్షన్..

వరంగల్, మార్చి 7,

మామునూరు ఎయిర్ పోర్ట్ చరిత్ర ఇప్పటిది కాదు. భారత స్వాతంత్ర్యానికి పూర్వమే అంటే నిజాం రాజుల పాలనలో 1930లో దీన్ని నిర్మించారు. చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ దీన్ని జాతికి అంకితం చేశారు. ఇది షోలాపూర్ లో వ్యాపార అభివృద్ధికి, సిర్పూర్ కాగజ్ నగర్ లో కాగితపు పరిశ్రమ సౌకర్యార్థం వరంగల్ లో అజాంజాహి మిల్స్ సేవల కోసం ఈ ఎయిర్ పోర్ట్ ఉపయోగపడేది.స్వాతంత్ర్యం తర్వాత పలువురు ప్రధాన మంత్రులు, రాష్ట్ర మంత్రులు ఈ ఎయిర్ పోర్ట్ కు వచ్చారు. ఇండో చైనా యుద్ధ సమయంలో ఢిల్లీ ఎయిర్ పోర్టును శత్రువులు లక్ష్యంగా చేసుకున్నప్పుడు ప్రయాణికులకు మామునూరు ఎయిర్ పోర్ట్ సేవలు అందించింది. 1875 ఎకరాల స్థలంలో 6.6 కిలోమీటర్ల రన్ వే, పైలెట్ సిబ్బంది గృహాలు, పైలట్ శిక్షణా కేంద్రం, ఒకటికన్నా ఎక్కువ టెర్మినల్లతో దేశంలోనే అతిపెద్ద విమానాశ్రయంగా ఉండేది. కాలక్రమేణ ప్రభుత్వాల నిర్లక్ష్యం, అప్పటి ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనంతో దీన్ని 1981లో మూసివేశారు.తాజాగా రేవంత్ సర్కార్ అధికారంలోకి రాగానే ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష మళ్లీ తెరపైకి వచ్చింది. జీఎంఆర్ అభ్యంతరాలను పరిశీలించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఆ సంస్థను చివరికి ఒప్పించాయి. ఎయిర్ పోర్ట్ అథారిటీ కూడా సమ్మతించడంతో మామునూరు ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఎయిర్ పోర్టుకు మోక్షం కలిగినప్పటికీ.. భూసేకరణ అంశం మాత్రం తెలంగాణ సర్కార్ కు సవాల్ గా మారింది. ఒకప్పుడు వరంగల్ నగరానికి శివారు ప్రాంతంగా ఉన్న మామునూరు ఎయిర్ పోర్ట్ పరిసరాల్లో ప్రస్తుతం బహుల అంతస్తుల నిర్మాణాలు, లేఔట్లు వెలిశాయి.రైతుల నుంచి సర్కార్ భూములను సేకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గ్రామ సభలు నిర్వహించారు. మంత్రి కొండా సురేఖతో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు గ్రామ సభల్లో పాల్గొన్నారు. భూమికి బదులు భూమి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని, ఎవరినీ రోడ్డున పడనివ్వబోమని నిర్వాసితులకు మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. దీంతో మంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాకే భూసేకరణ చేయాలని రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో సమస్య జఠిలమైంది.

# కాల్ సెంటర్ స్కామ్ గుట్టు

హైదరాబాద్, మార్చి 7,

హైదరాబాద్ లో ఘరానా మోసం వెలుగు చూసింది. దిమ్మతిరిగిపోయే కాల్ సెంటర్ స్కామ్ గుట్టు రట్టైంది. నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి విదేశీయులను మోసం చేస్తున్న ముఠాని సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్ కి చెందిన మనస్విని సహా 63 మందిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో ఎక్సిటో సొల్యూషన్స్ పేరిట మనస్విని కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది. కైవాన్ పటేల్, ప్రతీక్, రాహుల్ తో కలిసి ఈ కాల్ సెంటర్ ను నిర్వహిస్తోంది. పలువురు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వ్యక్తులని టెలీ కాలర్స్ గా నియమించుకుంది. అమెరికన్లే ప్రధాన లక్ష్యంగా నిందితులు మోసాలకు పాల్పడుతున్నారు.హ్యాక్ అయిన బ్యాంక్ ఖాతాలు సరి చేస్తామంటూ బాధితులకు ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు సేకరించి నగదు కాజేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 63 ల్యాప్ ట్యాప్ లు, 52 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.."పే పాల్ నకిలీ కాల్ సెంటర్ కేసులో 63 మందిని అరెస్ట్ చేశాం. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 50 మందితో పాటు 11 మంది హైదరాబాదీలను అదుపులోకి తీసుకున్నాం. 63 మందిని కోర్టులో హాజరుపరిచాం. వారికి రిమాండ్ విధించింది కోర్ట్. ఇంగ్లీష్ భాషపై పట్టు ఉన్నందునే కాల్ సెంటర్‌లో ఉద్యోగం ఇచ్చారు. జాదు రూపేష్‌తో కలిసి కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది మనస్విని.డబ్బు కోసం కాల్ సెంటర్‌లో అమ్మాయిలతో బిజినెస్ చేస్తోంది. పే పాల్ పేరుతో అమెరికన్లకు నకిలీ ఈమెయిల్స్ పంపుతారు. ఈ మెయిల్స్‌కు రెస్పాండ్ అయిన అమెరికన్ల నుంచి డబ్బులు వసూలు చేస్తారు. ఇప్పటి వరకు వందల కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు గుర్తించాం. కొట్టేసిన డబ్బంతా క్రిప్టో కరెన్సీలో మార్చింది ముఠా.పే పాల్‌లో నకిలీ కాల్ సెంటర్ లో పని చేస్తున్న ఉద్యోగులను నిర్బంధంలో పెట్టింది మనస్విని. పీజీ హాస్టల్‌లో ఉద్యోగులను పెట్టి ప్రతిరోజు రాత్రి కాల్ సెంటర్‌కు తరలిస్తోంది. 8 గంటలపాటు బలవంతంగా పని చేయించి తర్వాత హాస్టల్‌కు పంపుతుంది మనస్విని" అని పోలీసులు వెల్లడించారు.


# టీడీఆర్ బాండ్ల జారీలపై సిఐడి విచారణ

అమరావతి గత ప్రభుత్వంలో విశాఖపట్నంలో టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అక్రమాలపై రీజినల్ విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ తో పాటు సీఐడీ విచారణ కొనసాగుతుందన్నారు మంత్రి నారాయణ...విచారణ నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు...అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు...టీడీఆర్ బాండ్ల జారీలో ఒక్క విశాఖపట్నంలోనే కాకుండా తణుకు,తిరుపతిలో కూడా అక్రమాలు జరిగాయన్నారు...తణుకులో 63.24 కోట్ల విలువైన బాండ్లు ఇవ్వాల్సి ఉండగా 754 కోట్లకు బాండ్లు జారీ చేసారని అన్నారు...రూరల్ ఏరియాలో భూమి ఇచ్చి పట్టణంలో ఉన్న ఇంటి అడ్రస్ ఇవ్వడంతో ఆ ఇంటి విలువ ఆధారంగా బాండ్లు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు...

ఇదే విధంగా తిరుపతిలో 170..99 కోట్ల విలువైన 29 బాండ్లు జారీ చేసారన్నారు..గత ప్రభుత్వంలో టీడీఆర్ లు జారీలో అక్రమాలు జరగడంతో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు నెలల పాటు టీడీఆర్ లు నిలిపివేసామని సభలో తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 965 టీడీఆర్ బాండ్ల జారీ పెండింగ్ లో ఉండగా...482 దరఖాస్తులకు షార్ట్ ఫాల్ ఇచ్చారని..265 దరఖాస్తులకు గిఫ్ట్ డీడ్ ఇవ్వాల్సి ఉందన్నారు...మరో 218 దరఖాస్తులు నోటిఫై చేసారని,బాండ్లు జారీ చేయాల్సి ఉందని మంత్రి స్పష్టం చేసారు.

# మాగంటి రిటైర్మెంట్...?

ఏలూరు, మార్చి 7,



ఏలూరు మాజీ పార్లమెంటు సభ్యుడు మాగంటి బాబు రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నట్లే కనిపిస్తుంది. ఆయన ఇక ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకునట్లేనని చెప్పకతప్పదు. చంద్రబాబు పార్లమెంటు సీటును గత ఎన్నికల్లో మాగంటి బాబుకు ఇవ్వకుండా పక్కన పెట్టారు. బీసీలకు ఇవ్వాల్సి రావడంతో పాటు గుంటూరు, నరసరావుపేట, విజయవాడ వరసగా ఒకే సామాజికవర్గం నేతలకు టిక్కెట్లు ఇవ్వడంతో ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం టిక్కెట్ విషయంలో చంద్రబాబు మొన్నటి ఎన్నికల్లో ప్రత్యేకతను పాటించారు. యనమల రామకృష్ణుడి అల్లుడికి ఆ సీటును కేటాయించడంతో మాగంటి బాబుకు టిక్కెట్ దూరం అయిందనే చెప్పాలి. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గానికి వచ్చే సరికి మాగంటి వెంకటేశ్వరరావు అలియాస్ బాబు ఈసారి చంద్రబాబు పక్కన పెట్టటానికి అనేక కారణాలున్నాయి. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్నది ఆయన అభిప్రాయం. అయితే మాగంటి కుటుంబానికి ఇక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక ప్రత్యేకత ఉంది. ఆయన తండి దగ్గర నుంచి ఆయన వరకూ రాజకీయాల్లో కొనసాగారు. 1998 ఎన్నికల్లో ఏలూరు ఏంపీగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాగంటి బాబు 2009లో టీడీపీ తరుపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తిరిగి 2014లో అదే స్థానం నుంచి గెలిచారు. 2019లో ఓటమి పాలయ్యారు. అయితే మాగంటి కుటుంబంలో వరస విషాదాలు చోటు చేసుకోవడంతో కొంత పార్టీ కార్యక్రమాలకు దూరమైనా ఎన్నికలకు ముందు యాక్టివ్ అయ్యారు.. అయితే ఎక్కువ మంది శాసనసభ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు మాగంటి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడంతో పాటు సామాజిక వర్గాల సమీకరణ మాగంటికి టిక్కెట్ రాకుండా పోయింది. అయితే టిక్కెట్ రాకపోయినా తనకు ఏదో ఒక పదవి లభిస్తుందని మాగంటి బాబు భావించారు. రాజ్యసభ కానీ, ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని పలు మార్లు చంద్రబాబుకు మాగంటి మొర పెట్టుకున్నారు. కానీ ఏడాది గడుస్తున్నా మాగంటి బాబు గురించి టీడీపీ అధినాయకత్వం పెద్దగా పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం ఆయన సన్నిహితుల్లో వ్యక్తమవుతుంది. మొన్నామధ్య మాగంటి బాబు జనసేన నేత పవన్ కల్యాణ్ ను కలవడం కూడా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నా ఇప్పటి వరకూ సానుకూలత ఫలితం రాలేదు.అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మాగంటి బాబుకు ఆయన సామాజికవర్గమేఆయనకు శాపంగా మారిందని చెప్పాలి. టిక్కెట్ రాకోవడం దగ్గర నుంచి పదవులు అందకపోవడం వరకూ ఆయనకు క్యాస్ట్ అడ్డుపడుతుందని చెప్పాలి. కూటమి ప్రభుత్వం పది కాలాల పాటు కొనసాగాలంటే ఎక్కువ మంది బలహీన వర్గాలకు పదవులు ఇవ్వాలన్న పార్టీ అధినాయకత్వం ఆలోచనతో పాటు సీనియర్ నేతలకు కాదని, యువతరానికి అవకాశం ఇవ్వడమే లక్ష్యంగా అధినాయకత్వం అడుగులు వేస్తుండటంతో మాగంటి బాబుకు ఇక పొలిటికల్ కెరీర్ లేనట్లేనని అనిపిస్తుంది. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంలో గెలిచిన అనేక మందిలాగానే మాగంటి కూడా నిలిచిపోయే అవకాశముంది.

# కొడుకు కోసం ధర్మాన పాట్లు

శ్రీకాకుళం, మార్చి 7,

రానన్నారు.. రాలేనన్నారు.. వచ్చే పరిస్థితి లేదన్నారు.. కట్ చేస్తే సడెన్ ఎంట్రీతో రయ్‌న దూసుకొచ్చారు. మాజీ మంత్రి ధర్మాన తీరు.. ఇప్పుడు సిక్కోలు రాజకీయాల్లో సెగలు పుట్టిస్తోంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత సైలెంట్ అయిపోయిన ధర్మాన.. 9నెలలుగా అజ్ఞాతంలోనే ఉండిపోయారు. ఇక ఆయన పని అయిపోయిందని అంతా అనుకుంటున్న టైమ్‌లో.. గ్రాండ్ ఎంట్రీ ఇచ్చారు. అసలు ఎందుకు సైలెంట్ అయ్యారు.. ఇప్పుడు మళ్లీ ఎందుకు యాక్టివ్ అయ్యారు.. ధర్మాన ప్రసాదరావు.. ఏపీ రాజకీయాల్లో పరిచయం అవసరం లేని పేరు. ధర్మాన అంటేనే కూల్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్. ప్రత్యర్థులు మాటల తూటాలు సంధించినా.. విమర్శలు ఎక్కు పెట్టినా.. తన మార్క్ వాక్ చాతుర్యంతో సుతిమెత్తగా తిప్పికొడుతుంటారు. పాలిటిక్స్‌లో తనకంటూ ప్రత్యేక ముద్ర క్రియేట్ చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ రాజకీయాలను శాసించిన ఆయన.. ఆ తర్వాత పరిణామాలతో వైసీపీలో చేరారు.వైసీపీలోనూ కీలకంగా వ్యవహరించారు. జగన్ హయాంలో కీలకమైన రెవెన్యూ శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఐతే గత ఎన్నికల్లో ధర్మానకు ఘోర పరాభవం ఎదురైంది. ఎలక్షన్స్‌లో ఓటమి తర్వాత.. ఆయన కనిపించకుండా పోయారు. రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. దీంతో ధర్మాన చుట్టూ రకరకాల ప్రచారం వినిపించింది. కట్ చేస్తే ఇప్పుడు సడెన్‌గా ప్రత్యక్షం అయ్యారు. ఇదే ఇప్పుడు హాట్‌టాపిక్ అవుతోంది.పార్టీ కేడర్‌కే కాదు.. పార్టీ అధినేతకు కూడా ధర్మాన ఇన్ని రోజులు అందుబాటులో లేకుండా పోయారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్‌ను ఒక్కసారి కూడా కలిసింది లేదు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నేతలతో జగన్ నిర్వహించిన మీటింగ్ కూడా ధర్మాన డుమ్మా కొట్టారు. దీంతో ఆయన పార్టీ మారబోతున్నారంటూ ప్రచారం జరిగింది.ఐతే పార్టీ మారడం కాదు.. రాజకీయాలకు ధర్మాన గుడ్‌బై చెప్పేశారంటూ గాసిప్ వినిపించింది. దీంతో వైసీపీ అలర్ట్ అయింది. కీలకనేతలంతా వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు కూడా ! ఐతే తాను మరో రెండేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉండాలని డిసైడ్ అయినట్లు.. పార్టీ వర్గాలకు చెప్పుకుంటూ వచ్చారు ధర్మాన. దీంతో శ్రీకాకుళం నియోజకవర్గ బాధ్యతను మరొకరికి అప్పగించాలని వైసీపీ ప్రయత్నించింది. నిజానికి నూతన ఇంచార్జిని నియమించాలన్న ప్రతిపాదన తీసుకువచ్చిందే ధర్మాన అనే ప్రచారం జరిగింది.ఆరోగ్య కారణాలతో రెండేళ్ల పాటు.. యాక్టివ్ పాలిటిక్స్‌లో కనిపించనని చెప్పిన ధర్మాన.. సడెన్‌గా పొలిటికల్ స్క్రీన్ మీద ప్రత్యక్షం అయ్యారు. ఇది సిక్కోలు జిల్లా రాజకీయాల్లో కొత్త చర్చకు కారణం అవుతోంది. మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం చనిపోగా.. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసిపి అధినేత జగన్ పాలకొండ వెళ్లారు.ఆ సమయంలో.. వంద కార్లతో వెళ్లి మరీ జగన్‌కు స్వాగతం పలికారు ధర్మాన. ఆయన తీరుపై ఇప్పుడు రకరకాలు అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. ఇన్నాళ్లు జగన్ నిర్వహించిన కీలక సమావేశాలకు కూడా దూరంగా ఉన్న ధర్మాన.. ఇలా సడెన్ ఎంట్రీ ఇవ్వడంపై పార్టీ నేతలకే కాదు, అధిష్టానానికి కూడా షాకింగ్ ఫ్యాక్టర్‌గా మారిందట. ఐతే ధర్మాన రాజకీయం తెలిసిన వాళ్లు మాత్రం.. దీనివెనక పక్కా స్ట్రాటజీ ఉందంటూ ప్రచారం మొదలుపెట్టారు.పార్టీలో సైలెంట్‌గా ఉంటే.. నియోజకవర్గ బాధ్యతలను వేరొకరికి అప్పగించే అవకాశం ఉంటుందని.. అదే జరిగితే నియోజకవర్గంపై పట్టు కోల్పోయే ప్రమాదం ఉంటుందని.. దీంతో తానే యాక్టివ్ అయ్యారన్నది మరికొందరి వాదన. వయసురీత్యా తను పోటీలో ఉన్నా లేకపోయినా.. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడికి అవకాశం ఉంటుందని.. ఆ ఆలోచనతోనే అజ్ఞాతం వీడారంటూ ప్రచారం జరుగుతోంది.రానని చెప్పి వచ్చారంటే.. వస్తూ వస్తూ హడావుడి క్రియేట్ చేశారంటే.. ధర్మాన సడెన్ ఎంట్రీ వెనక భారీ వ్యూహమే ఉందనే గుసగుసలు వినిపిస్తు?నాయ్. ఆయన స్ట్రాటజీ ఎలా ఉన్నా.. ధర్మాన ఎంట్రీ మాత్రం సిక్కోలు వైసీపీ కేడర్‌కు కొత్త ఊపిరి పోసిందనే ప్రచారం జరుగుతోంది.

# ఎవరు గెలిచారు... ఎవరు ఓడారు

హైదరాబాద్, మార్చి 7

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై అనేక రకాల విశ్లేషణలు జరుగుతున్నాయి. తెలంగాణలో రెండు టీచర్ ఎమ్మెల్సీ, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా అందులో రెండింటిలో బీజేపీ విజయం సాధించింది. అయితే ఇది తమ బలం పెరుగుతుందని బీజేపీ భావిస్తుంది. కానీ అది బలం కాదు వాపు మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ అంటోంది. ఎందుకంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయలేదు. సహజంగా బీఆర్ఎస్ సానుభూతి పరులు కాంగ్రెస్ కంటే బీజేపీ వైపు మొగ్గు చూపారంటున్నారు. అందుకే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు సాధ్యమయిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటి కావడంతోనే ఈ ఎన్నికల్లో గెలుపు దక్కిందని గట్టిగా చెబుతున్నారు.. ముక్కోణపు పోటీ జరగలేదని, అదే జరిగి ఉంటే విజయం తమకే దక్కేదన్నది కాంగ్రెస్ నేతల అభిప్రాయం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడం అంటే నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యతిరేకతతో ఉన్నారని, రానున్న కాలం బీజేపీదేనని కమలనాధులు చెబుతున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలు గెలిచిన తాము పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో గెలిచి కాంగ్రెస్ కు ధీటుగా స్థానాలను సాధించామని కమలనాధులు ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో అధికారం తమదేనంటూ గట్టి ధీమాగా ఉన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, అందుకే తమను గెలిపించాలని కాషాయపార్టీ నేతలు కోరుతున్నార.. మరొక వైపు కాంగ్రెస్ మాత్రం ఇందుకు భిన్నంగా ఆలోచన చేస్తుంది. తెలంగాణ ప్రజలు వరసగా రెండు సార్లు అధికారాన్ని ఇవ్వడం సంప్రదాయంగా వస్తుందని, మరొకసారి కూడా కాంగ్రెస్ దే అధికారమని ఢంకా భజాయించి చెబుతున్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న తీరు, జనంతో మమైకమవుతున్న వైనం వంటి విషయాలు తమను విజయానికి మరింత దగ్గర చేరుస్తాయని అంటున్నారు. అందుకే రెండు పార్టీలు కలిసి పరోక్షంగా పోటీ చేసిన ఈ ఎన్నికల ఫలితాలు ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించవని చెబుతున్నారు. మొత్తం మీద ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఎవరి అంచనాలు వారివిగా కనిపిస్తున్నాయి.

# స్కూలు కిట్స్, గుడ్లు, చిక్కీల్లో వెయ్యికోట్లు ఆదా!

అమరావతీ:, మార్చి 7,

రాబోయే అయిదేళ్లలో స్కూల్ కిట్స్, చిక్కీ, గుడ్ల కొనుగోళ్ల టెండర్లలో అవకతవకలను అరికట్టి రాష్ట్ర ఖజానాకు వెయ్యికోట్లు ఆదా చేయబోతున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. టెండర్లలో పారదర్శక విధానాలను అమలుచేయడం ద్వారా పెద్దఎత్తున ఖజానాకు నిధులు ఆదా చేస్తున్నాం. ఒక్క చిక్కీల్లోనే 63 కోట్లు (36శాతం) ఆదా చేశాం, రాబోయే అయేదేళ్లలో రూ.300 కోట్లకు పైగా చిక్కీల్లో నిధులు ఖజానాకు ఆదా అవుతాయని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, కరిక్యులమ్ మార్పులు, మౌలికసదుపాయాలపై అనకాపల్లి ఎమ్మెల్యే కొణతల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ...స్కూల్ కిట్స్ లో కూడా 8 నుంచి 9శాతం వరకు అంటే 70కోట్లవరకు ఆదా అవుతుంది. కోడిగుడ్లలో కూడా 10నుంచి 12శాతం తగ్గింది. రేట్లు తగ్గించడంతోపాటు క్వాలిటీ మెయింటెన్ చేయాలని అధికారులకు చెప్పాను. విద్యావ్యవస్థలో సంస్కరణల అమలుపై మేం దృష్టిసారించాం. స్కూల్ కిట్స్ విషయంలో థర్డ్ పార్టీతో మానిటరింగ్ పెట్టాం. టెక్ట్స్ బుక్స్ విద్యార్థులకు బరువుగా ఉన్నాయని పలువురు చెప్పడంతో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, పుస్తకాల బరువు తగ్గించేందుకు మహారాష్ట్ర మోడల్ లో సెమిస్టర్ వారీ విధానం తెస్తున్నాం. స్కూలు కిట్స్ లో ఇంకా ఎక్కువ ఆదా అయ్యేది, కానీ యూనిఫాం నాణ్యతగా ఉండాలనే ఉద్దేశంతో టూ సైడ్ ప్రింటింగ్ తో మంచి క్లాత్ ఇచ్చాం, ప్రస్తుత యూనిఫాం మరో ఏడాది కూడా వాడవచ్చు. అందువల్ల యూనిఫాంలో సేవింగ్స్ తగ్గింది.

# జానారెడ్డికి కీలక పదవి..

నల్గొండ, మార్చి 7, (న్యూస్ పల్స్)

పెద్దలు జానారెడ్డికి.. ప్రభుత్వంలో పెద్ద పదవి దక్కబోతుందా అంటే.. అవుననే సమాధానమే అన్నిచోట్లా వస్తోంది. దీనికి జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీ కావడమే కారణంగా చూపిస్తున్నాయ్ గాంధీభవన్ వర్గాలు. కేబినెట్‌లోని కొందరు తన మాట వినడం లేదని.. సహకారం లేదని.. బహిరంగంగానే కామెంట్ చేసిన రేవంత్.. పార్టీలో, ప్రభుత్వంలో తనకో పెద్ద దిక్కు కావాలని అనుకుంటున్నారా.. అందుకే పెద్దలు జానారెడ్డిని వ్యూహాత్మకంగా తెరపైకి తెస్తున్నారా? ఇదే నిజమైతే ఒకే కుటుంబానికి మూడు పదవులు అంటే.. కొత్త సమస్యలు తప్పవా.. ఇప్పుడిదే కాంగ్రెస్ నేతల్లో కాకరేపుతోంది..రేవంత్ ఢిల్లీ టూర్‌కు రెడీ అవుతున్నారు. మంత్రివర్గ విస్తరణతో పాటు కీలక పదవులకు సంబంధించి.. హైకమాండ్‌తో చర్చలు జరిపే చాన్స్ ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇలాంటి పరిణామాల మధ్య సీనియర్ నేత జానారెడ్డి ఇంటికి సీఎం రేవంత్ వెళ్లడం కొత్త ప్రాధాన్యత సంతరించుకుంది. జానారెడ్డితో ఆంతరంగికంగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.కేబినెట్ విస్తరణతో పాటు.. పార్టీలో కీలక పదవుల అప్పగింతల వేళ.. జానారెడ్డితో రేవంత్ భేటీ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఐతే ఇక్కడే అసలు ట్విస్ట్ కనిపిస్తోంది. సలహాల కోసమే కాదు.. సర్‌ప్రైజ్ ప్లాన్ చేసి మరీ జానారెడ్డి ఇంటికి రేవంత్ వెళ్లారనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. ఈ ప్రచారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాలను షేక్ చేస్తోంది.ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా జానారెడ్డిని నియమించాలని రేవంత్ నిర్ణయించారని.. దీని గురించి ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయ్. ఐతే త్వరలో దీనికి సంబంధించి ప్రకటన వచ్చే అవకాశం ఉందనే ప్రచారం కూడా నడుస్తోంది. ఇదంతా ఎలా ఉన్నా.. ప్రభుత్వంతో జానారెడ్డిని భాగం చేయడం వెనక రేవంత్ భారీ స్కెచ్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.పార్టీ మాత్రమే కాదు.. ప్రభుత్వంలోని కొందరు మంత్రుల నుంచే తనకు సహకారం లభించడం లేదని.. ఈ మధ్య పీసీసీ సర్వసభ్య సమావేశంలో రేవంత్ బహిరంగంగానే కామెంట్లు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ మీద, ప్రభుత్వం మీద పట్టు నిలుపుకోవాలంటే.. ఓ పెద్ద సపోర్టు కావాలి.. ఓ పెద్దమనిషి అండ కావాలి. అందుకే పెద్దలు జానారెడ్డికి పెద్దపదవి కట్టబెట్టేందుకు రేవంత్ రెడీ అయ్యారనే చర్చ నడుస్తోంది.జానారెడ్డిలాంటి పెద్దలు తనతో ఉంటే, తన పక్కన ఉంటే.. మరింత బలం లభించే అవకాశాలు ఉన్నాయన్నది రేవంత్ ప్లాన్ అనేది మరికొందరి అభిప్రాయం. నిజానికి పార్టీలో మిగతా సీనియర్లతో పలు సందర్భాల్లో రేవంత్‌కు గ్యాప్ ఏర్పడ్డా .. జానారెడ్డితో మాత్రం మొదటి నుంచి బంధం బలంగానే ఉంది. పీసీసీ చీఫ్‌గా రేవంత్ నియామకంలోనూ జానారెడ్డి పాత్ర కీలకం అనే చర్చ కూడా జరిగింది.రేవంత్‌కు పదవి ఇప్పించేందుకు అధిష్టానంతో జానారెడ్డి స్వయంగా మాట్లాడారనే టాక్ కూడా అప్పట్లో విన్పించింది. ! ఐతే ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పరిస్థితుల మధ్య.. పెద్దలు జానారెడ్డి సపోర్టు రేవంత్‌కు చాలా అవసరం అనడంలో ఎలాంటి అనుమానం లేదు. అందుకే ఆయనను ప్రభుత్వంలో చేర్చి.. తన బలం పెంచుకోవాలన్నది రేవంత్ వ్యూహమనే టాక్ కూడా అప్పుడే మొదలైంది.పెద్దలు జానారెడ్డికి.. పెద్ద పదవి సంగతి ఎలా ఉన్నా.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పెట్టుకున్న నిబంధనల సంగతి ఏంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయ్. ఒక కుటుంబానికి ఒకే పదవి అనే నిబంధన పెట్టుకున్నారు. ఐతే ఇప్పుడు జానారెడ్డికి ప్రభుత్వంలో పదవి అప్పగిస్తే.. ఆయన కుటుంబంలో ముగ్గురికి అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. ఇప్పటికే ఆయన కుమారుల్లో ఒకరు



ఎమ్మెల్యేగా ఉండగా.. మరొకరు ఎంపీగా కొనసాగుతున్నారు.జానారెడ్డికి పదవి అప్పగించాలని సీఎం రేవంత్ నిర్ణయం తీసుకున్నా.. పార్టీపరంగా ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయనే చర్చ కూడా జరుగుతోంది. ఐతే ఒక కుటుంబానికి ఒకే నిబంధన అనే నిబంధన పెట్టుకున్నా.. తెలంగాణలో అది పెద్దగా వర్కౌట్ కాలేదు. వివేక్ వెంకటస్వామి కుటుంబం నుండి ఇప్పటికే మూడు పదవులు ఉండగా?వివేక్ కేబినెట్ రేసులోనూ ఉన్నారనే టాక్ ఉంది. ఇక ఉత్తమ్ కుటుంబానికి రెండు.. కోమటిరెడ్డి ఫ్యామిలీకి రెండు.. కేకే కుటుంబం నుంచి ఇద్దరు పదవుల్లో ఉన్నారు. మరి ఇప్పుడు జానారెడ్డికి లైన్ క్లియర్ అవుతుందా.. ఆయన విషయంలో రేవంత్ ప్లాన్ వర్కౌట్ అవుతుందా?బెడిసి కొడుతుందా అన్నది చూడాలి మరి

# సీజనల్ హాస్టళ్ల పనితీరును మెరుగుపరుస్తాం

## వలసల నివారణకు చరలు తీసుకుంటాం

## అసెంబ్లీలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్

అమరావతి:‾, మార్చి 7,

యువగళం పాదయాత్ర ఆలూరు, ఆదోని కొనసాగుతున్నపుడు కుటుంబాలు మూకుమ్మడిగా వలసల వెళ్లడం చూశాను, ఒకే వాహనంపై 200మంది వెళ్లడం గమనించాను. అవన్నీ చూశాక ఇరిగేషన్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తిచేసి, సాగు, తాగునీరు ఇస్తామని హామీ ఇచ్చాను. ఇచ్చిన మాట ప్రకారం సాగు, తాగునీరు ఇచ్చే బాధ్యత ఎన్ డిఎ ప్రభుత్వం తీసుకుంటుంది. నంద్యాల తర్వాత నేను కర్నూలుకు పాదయాత్రకు వెళ్లాను. రెండు ప్రాంతాల నడుమ ఎంతో వ్యత్యాసం కన్పించింది. కర్నూలు జిల్లాలో శివారు ప్రాంతాలకు సైతం సాగు, తాగునీరు అందించడమే మా లక్ష్యం. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో రెండుసార్లు చర్చించాను. గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో, లిటరసీలో కర్నూలు వెనుకబడి ఉందన్నది వాస్తవం. అందుకే రాబోయే డిఎస్సీలో కర్నూలుకు ఎక్కువమంది ఉపాధ్యాయులు రాబోతున్నారు. విద్యార్థులకు అపార్ ఐడి ని కేంద్రం మ్యాండేట్ చేస్తోంది. కెజి నుంచి పిజివరకు ఒక కంట్రోల్ రూమ్ పెట్టి విద్యార్థులను ట్రాక్ చేస్తాం, ఇందుకు అవసరమైన ఐటి ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ను తయారు చేస్తున్నాం. ఒక్కరు కూడా డ్రాపవుట్ కాకూడదనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. సీజనల్ హాస్టల్స్ కు సంబంధించి కేవలం భోజనం పెట్టడానికి మాత్రమే అవకాశం ఉంది, హాస్టల్ వసతులు లేవు. కరువు ప్రాంతాల్లో ప్రజలు వేరేచోటకు వలసలు వెళ్లిన సమయంలో అక్కడ అడ్మిషన్లు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం. హాస్టళ్ల పనితీరు, విద్యార్థుల ట్రాకింగ్ ఉంటేనే డ్రాపవుట్స్ తగ్గుతాయి. రాష్ట్రంలో 2024-25లో 121 సీజనల్ హాస్టళ్లు ఉండగా, వాటిలో 6,040 మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించాం. ఇందుకోసం 6.04కోట్లు ఖర్చు పెడుతున్నాం. సీజనల్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పటివరకు ప్రణాళికాబద్ధంగా లేదు. వివిధ సంవత్సరాల్లో ఎక్కువ, తక్కువలు ఉన్నాయి. పిల్లలకు మెరుగైన విద్య అందించాలన్నదే మా లక్ష్యం. పిల్లల వలసల నివారణకు గత ప్రభుత్వం పనిచేయలేదు. సీజనల్ హాస్టళ్ల పనితీరు మెరుగుదలకు అసెంబ్లీ అయ్యాక శాసనసభ్యులతో చర్చిస్తాం. హాస్టళ్ల పనితీరు మెరుగు, గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో, స్టూడెంట్ టీచర్ రేషియో మెరుగుదలకు వచ్చే మూడేళ్లు కలసి పనిచేద్దాం. బిసి, ఎస్సీ హాస్టళ్లను కన్వర్జెన్స్ చేసి సీజనల్ హాస్టళ్ల పనితీరు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటాం. రాబోయే మూడేళ్లలో హాస్టళ్ల పనితీరులో మార్పు తెస్తాం. సీజనల్ హాస్టళ్లకు సంబంధించి పలు పత్రికల్లో ఆర్టికల్స్ వచ్చాయి, ఏ మీడియాలో వచ్చినా సీరియస్ గా తీసుకుంటున్నాం. రాబోయే రెండు, మూడునెలల్లో సీజనల్ హాస్టళ్ల పనితీరులో మార్పును గమనిస్తారని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# సంప్రదాయ నగలంటే చాలా ఇష్టం.. నమ్రతా శిరోద్కర్

హైదరాబాద్ మార్చి 7,

బ్లీహిల్స్ క్లబ్లో సిద్దార్థ్ ఫైన్ జ్యువెలర్స్ ఎగ్జిబిషన్లోనీ నటి నమ్రతా శిరద్కోర్ పాల్గోన్నారు. తనకు సంప్రదాయ నగలంటే ఎంతో ఇష్టమని, కానీ అప్పుడప్పుడు అవసరానికి తగినట్లు మోడ్రన్ నగలు కూడా ధరిస్తుంటానని ప్రముఖ నటి, మహేష్బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ అన్నారు. జూబ్లీహిల్స్ క్లబ్లో సిద్దార్థ ఫైన్ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డైమండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ సిద్దార్థ్ ఫైన్ జ్యువెలర్స్ డిజైనర్ నాగిని ప్రసాద్ వేమూరి రూపొందించిన భిన్న రకాల ప్రత్యేక కలెక్షన్న్లు ఆమె పరిశీలించారు. వెడ్డింగ్ కలెక్షన్స్ పాటు ఫెస్టివల్ కలెక్షన్న్లు అందుబాటులో ఉంచినట్లు రెండు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని నిర్వాహకులు కృష్ణ ప్రసాద్ వేమూరి తెలిపారు.

# విద్యారంగానికి 30 శాతం నిధులు కెటాయించాలి

హైదరాబాద్ మార్చి 7, మార్చ్ 12 న జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని విద్యార్థి సేన అధ్యక్షుడు శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థి సేన ఆధ్వర్యంలో పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల పోరాటాల ద్వారా ఏర్పడ్డ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురవుతుంది అన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించమని విద్యావేత్తలు మేధావులు, సంపన్న వర్గాలు విద్యార్థి సంఘాలు ఎన్నిసార్లు ధర్నాలు రాస్తారోకోలు చేసినా కూడా ఈ ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదన్నారు. అవసరం లేని సంక్షేమ పథకాలకు నిధులు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తో పాటు తెలంగాణలోని అన్ని యూనివర్సిటీలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అన్నారు. ముఖ్యంగా విద్యారంగానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి విద్యారంగాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ప్రభుత్వం పై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సేన నాయకులు పాల్గొన్నారు.

## నామినేషన్ దాఖలు చేసిన నాగబాబు

అమరావతి ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. రిటర్నింగ్ అధికారిణి వనితారాణికి నాగబాబు నామినేషన్ పత్రాలు సమర్పించారు.


# కార్యేషు దాసి.. కరణేషు మంత్రి..

# భోజ్యేసు మాత.. ఇలా సమస్తం నీవే ఓ మాతృ మూర్తి

-నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

కార్యేషు దాసి.. కరణేశు మంత్రి.. భోజ్యేసు మాత.. ఇలా సమస్తం నీవే. ఓ మాతృ మూర్తి.. ఈ మహిళా దినోత్సవం సందర్భంగా మీ కిదే మా వందనం!!"అమ్మను పూజించు.. భార్యను ప్రేమించు.. సోదరిని,కూతురుని దీవించు.. ముఖ్యంగా మహిళలను




గౌరవించు" మహిళా దినోత్సవం గురించి తెలుసుకుందాం.

మార్చి 8 ఒక చారిత్రాత్మక ప్రాధాన్యత గల రోజు. పదిగంటల పనిదినాలకోసం, పురుషులతో సమానమైన వేతనాలకోసం పశ్చిమ పెన్సిల్వేనియాలోని ఒక బట్టల మిల్లులో సమ్మె ప్రారంభమైంది. ఇందులో 5000 మంది పాల్గొన్నారు. ఇతర ప్రాంతాలకూ విస్తరించింది. చివరకు 1857 మార్చి 8వ తేదీన ఈ సమ్మె విజయవంతమైంది. అందుకే ఆరోజున అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించుకున్నాం. ఇంతటి ప్రాధాన్యతల గల 8వ తేదీ ముంగిట్లో... మార్కెట్ యుగంలో మహిళ స్థితిగతులను పరిశీలిద్దాం.

అంతర్జాతీయమహిళాదినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి ఎనిమిదవ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. దేశం, జాతి, భాష, రాజ్యం, సాంస్కతిక భేదభావాలకు తావు లేకుండా మహిళలందరూ ఒకచోట చేరి ఉత్సవాన్ని ఘనంగా చేసుకుంటారు. చరిత్రను అనుసరించి సాధికారత సాధన దిశగా మహిళలు పోరాటానికి అంకురార్పణ చేశారు. ప్రాచీన గ్రీకు రాజ్యంలో లీసిస్ట్రాటా పేరు గల మహిళ ఫ్రెంచి విప్లవం ద్వారా యుద్ధానికి ముగింపు చెప్పాలని విజ్ఞప్తి చేస్తూ ఆందోళనకు శ్రీకారం చుట్టింది. పార్శీ మహిళలతో కూడిన సమూహం ఒకటి ఇదే రోజు వెర్సెల్స్లో ఒక ఊరేగింపును నిర్వహించింది.

యుద్ధం కారణంగా మహిళలపై రోజురోజుకు పెరిగిపోతున్న అత్యాచారాలను నిరోధించాలని డిమాండ్ చేస్తూ వారు ఊరేగింపు జరిపారు. 1909 సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో అమెరికాలో మహిళా దినోత్సవం జరిగింది. 1910 సంవత్సరంలో కొపెన్‌హెగన్‌లో సోషలిస్ట్ ఇంటర్నేషనల్ ద్వారా మహిళా దినోత్సవం ఆవిర్భవించింది. 1911 సంవత్సరంలో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ మరియు స్విట్జర్లాండ్ దేశాల్లో లక్షలాదిగా మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.

మతాధికారం, ప్రభుత్వ ఉద్యోగాల్లో తగు ప్రాధాన్యత, కార్యక్షేత్రంలో వివక్ష నిర్మూలన తదితర డిమాండ్ల సాధనకు మహిళలు ఈ ర్యాలీలో పాలు పంచుకున్నారు. 1913-14 మధ్య కాలంలో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో శాంతిని స్థాపించాలని కోరుతూ ఫిబ్రవరి మాసాపు చివరి ఆదివారం నాడు రష్యా దేశపు మహిళలు మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు.

ఐరోపా అంతటా యుద్ధ వ్యతిరేక ఆందోళన కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. 1917 సంవత్సరం వరకు జరిగిన ప్రపంచ యుద్ధంలో రష్యాకు చెందిన రెండు లక్షలకు పైగా సైనికులు మరణించారు. ఆహారం మరియు శాంతిని కోరుతూ ఇదే రోజున రష్యా మహిళలు హర్తాళ్ కార్యక్రమం చేపట్టారు. తమ ఉద్యమాలు, పోరాటాలతో రష్యా మహిళలు ఓటు హక్కును సాధించుకున్నారు. మహిళలు సాధించిన విజయాలకు చిహ్నంగా సాధికారతను పొందే క్రమంలో ప్రతి యేటా మార్చి ఎనిమిదవతేదీన విశ్వవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

మహిళాసంరక్షణలోభారతీయచట్టాలు:

స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు, వారి హక్కులను పరిరక్షించేందుకు గడచిన దశాబ్ద కాలంగా భారీ సంఖ్యలో చట్టాలు రూపుదిద్దుకున్నాయి. అయితే ఈ చట్టాలు సక్రమంగా అమలుకు నోచుకుని ఉన్నట్లయితే భారత దేశంలో మహిళల పట్ల వివక్ష మరియు అత్యాచారాలు ఈ సరికే ముగిసిపోయి ఉండేవి. కానీ పురుషాధ్యికత విశృంఖలమైన పరిస్థితులు ఈ అద్భుతం ఆవిష్కరణకు అడ్డుపడ్డాయి. అయితే ప్రస్తుతం పూర్తి స్థాయిలో కాకపోయినా కొంత మేరకు ఈ చట్టాలు అమలుకు నోచుకుంటున్నాయి. భారతదేశంలో స్త్రీలను కాచుకోవడంలో చట్టాలను మించినవి మరేవీ కానరావు. భారతీయ సంవిధానంలోని ప్రతి అంశం కూడా మహిళలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ రూపుదిద్దుకుంది. ఈ విషయమై మహిళలు సంపూర్ణమైన అవగాహనను కలిగి ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది.

సంవిధానంలోని 14వ అధ్యాయం ద్వారా సమన్యాయం, అధ్యాయం 15 (3) లో జాతి, ధర్మం, లింగం మరియు జన్మస్థానం తదితరాలను అనుసరించి భేదభావం చూపరాదు. అధ్యాయం 16 (1) ని అనుసరించి లోక సేవలో బేధభావం లేకుండా సమానత్వం, అధ్యాయం 19 (1) లో సమాన రూపంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, స్త్రీ మరియు పురుషులను ప్రాణ, దేహపరమైన స్వాధీనం చేసుకోవడంతో వంచించిరాదని అధ్యాయం 21 తెలుపుతుంది. అధ్యాయాలు 23-24 లలో శోషణకు విరుద్ధంగా సమాన రూపంలో అధికార ప్రాప్తి, అధ్యాయాలు 25-28 లలో స్త్రీపురుషులివురికి సమాన రూపంలో ధార్మిక స్వతంత్రత ప్రాప్తి, అధ్యాయాలు 29-30 ల ద్వారా విద్య మరియు సాంస్కృతిక అధికారం సంప్రాప్తించింది.

అధ్యాయం 32లో సంవిధానపు సేవలపై అధికారం, అధ్యాయం 39 (ఘ) ను అనుసరించి స్త్రీలు పురుషులు చేసే సమానమైన పనికి సమవేతనాన్ని పొందే హక్కు, అధ్యాయం 40లో పంచాయతీ రాజ్ వ్యవస్థ 73 మరియు 74 అధికరణాలను అనుసరించి ఆరక్షణ యొక్క వ్యవస్థ, అధ్యాయం 41 ద్వారా పని లేమి, వృద్ధాప్యం, అనారోగ్యం తదితర అసహాయ స్థితిలో సహాయాన్ని పొందే అధికారం, అధ్యాయం 42లో మహిళా శిశు సంక్షేమ ప్రాప్తి, అధ్యాయం 33 (క) లో పొందుపరిచిన 84వ అధికరణ ద్వారా లోక్‌సభలో మహిళలకు తగు ప్రాధాన్యత, అధ్యాయం 332 (క) లోని 84వ అధికరణాన్ని అనుసరించి రాష్ట్రాల్లోని శాసనసభల్లో మహిళలకు తగు ప్రాధాన్యత సంప్రాప్తించాయి.

చట్టం ఇలా అంటోంది:

× కార్యక్షేత్రంలో స్త్రీపురుషులకు సమానమైన వేతనాన్ని ఇవ్వాలి..× మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు మరియు స్నానాల గదులు ఏర్పాటు చేయాలి.× ఏ మహిళను కూడా దాస్యభావంతో చూడరాదు.

బలాత్కారం నుంచి బయటపడేందుకు అవసరమైతే సదరు పురుషుని హత్య చేసే అధికారం మహిళకు ఉంది. వివాహితురాలైన హిందూ మహిళకు తన ధనంపై సర్వాధికారాలు ఉంటాయి. తన ధనాన్ని ఏ విధంగానైనా ఖర్చు పెట్టుకునే అధికారం ఆమెకు ఉంటుంది. వరకట్నం తీసుకోవడం లేదా ఇవ్వడం చట్టవిరుద్ధం.

# యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్న కమలదళం

హైదరాబాద్, మార్చి 7,

తెలంగాణలో బీజేపీ స్పీడ్ పెంచబోతోంది. మూడు ఎమ్మెల్సీల్లో రెండింటిలో విజయం సాధించి మూడో స్థానంపై కూడా ప్రభావం చూపింది. ఇదే జోష్ కంటిన్యూ చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికారంలోకి రావాలని స్కెచ్ వేస్తోంది. అందులో భాగంగానే కొత్త నినాదాన్ని అందుకుంది. ఆ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తోంది. అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నినదిస్తూ వచ్చిన బీజేపీ ఇప్పుడు ప్లాన్ బీని అమలు చేస్తోంది. సేవ్ తెలంగాణ - సపోర్ట్ బీజేపీ నినాదంతో ప్రజల ముందుకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోంది. పదేళ్ల నుంచి కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న సహాయం ప్రజలకు వివరించనున్నారు. ఇకపై వచ్చే ఎన్నికల అన్నింటిలో కూడా సత్తా చాటేందుకు సర్వశక్తులు ఒడ్డి పోరాటం చేయడానికి రెడీ అయింది. అధికార పార్టీని కాదని ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం అంటే చిన్న విషయం కాదని బీజేపీ భావన. అందుకే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆ దిశగానే పార్టీ కార్యచరణ ఉండాలని బీజేపీ అధినాయకత్వం ఆలోచన. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షుడిని నియమించలేదు. ప్రస్తుతానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు బీజేపీ భావజాలన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే వ్యక్తికి ఆ పగ్గాలు అప్పగించాలని కూడా చూస్తోంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలు, ఇక్కడ ప్రజలకు వ్యతిరేకంగా కాంగ్రెస, బీఆర్ఎస్ తీసుకుంటున్న నిర్ణయాలపై పోరాటం ఉద్ధృతం చేయబోతున్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై క్షేత్రస్థాయి నుంచే పోరాటం చేయాలని డిసైడ్ అయ్యారు. ఇదే విషయాన్ని గురువారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ కిషన్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు చూపిన ఆదరణకు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల విజయాన్ని తెలంగాణ సమాజానికి అంకితం ఇస్తున్నట్టు చెప్పిన ఆయన... బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పదేళ్లుగా జరుగుతున్న పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉంటున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. పాలకులే మారుతున్నారు తప్ప పాలన తీరు మారడం లేదని ఆయన విమర్శించారు. అందుకే ప్రజలకు కొత్త మార్గం చూపేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని అందుకే తమ పార్టీని కూడా ప్రజల్లోకి మరింత స్పీడ్‌గా తీసుకెళ్తామన్నారు. ముందుగా సంస్థాగతంగా పార్టీ పదవులు భర్తీ వీలైనంత త్వరగా పూర్తి చేయనున్నామని వివరించారు. ప్రజలు చూపిస్తున్న అభిమానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లలే నేతలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేసినా తమను ఓడించలేకపోయారని గుర్తు చేశారు కిషన్ రెడ్డి. ఇది తమ బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ఇకపై అసెంబ్లీలో, బయట ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వదిలి పెట్టబోమని వార్నింగ్ ఇచ్చారు. పసలేని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలను ప్రజలు తిప్పికొట్టారని కిషన్ రెడ్డి అన్నారు. అందుకే ఇలాంటి ఆరోపణలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని సూచించారు. అయినా మారకుండా అదే రిపీట్ చేస్తే ఇలాంటి ఫలితాలే పునరావృతమవుతాయని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల మనసులు గెలుచుకునేందుకు బీజేపీ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఎలా ఉంటుందో గురువారం ప్రెస్‌మీట్‌లో కిషన్ రెడ్డి చెప్పకనే చెప్పారు. త్వరలోనే అన్ని పదవులు భర్తీ చేసి రాష్ట్ర కేడర్‌లో నయా జోష్ నింపుతారమన్నారు. ఇకపై నేతలంతా ప్రజల్లో ఉండి ప్రభుత్వాని ప్రశ్నిస్తూ వచ్చే ఎన్నికల లక్ష్యంగా పని చేయాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

మంథని మహిళలు అన్ని రంగాలలో రాణించాలని మగవారితో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకోవాలని మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కె .కృష్ణ అన్నారు.

మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసి మరియు కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ముందస్తుగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కె .కృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి స్త్రీ తమకంటూ ఆర్థిక స్వాతంత్రాన్ని కలిగి ఉండాలని తెలియజేశారు. చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్ మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే అనేక సాహసాలు, విజయాలు సాధించగలరని అందుకు ఉదాహరణగా బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడిన ఝాన్సీ లక్ష్మీబాయి, కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాణి రుద్రమదేవిని ఆదర్శంగా తీసుకోవాలని మానసిక దుర్బలత్వాన్ని విడనాడాలని సూచించారు.

# అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్

## అనర్హత వేటు ప్రమాదం

హైదరాబాద్ మార్చి 7, తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష నేతలు అసెంబ్లీకి హాజరు కావడం లేదు. వారు రాకపోతే నిబంధనల ప్రకారం అనర్హతా వేటు వేస్తామని అధికార పార్టీలు హెచ్చరిస్తున్నాయి. ఈ క్రమంలో ఏపీలో ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి గవర్నర్ ప్రసంగం రోజున ఒక్క రోజు వెళ్లారు. దాంతో హాజరు కావడం లేదన్న కారణంతో అనర్హతా వేటు పడకుండా జాగ్రత్తలు పడ్డారు. అయితే ఆ హాజరు చెల్లదంటున్నారు కానీ.. అది వేరే విషయం. ఒక్క రోజు జగన్ తన శపథాన్ని పక్కన పెట్టి అసెంబ్లీకి వెళ్లి వచ్చారు. ఇప్పుడు తెలంగాణ ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా ఒక్క రోజు అసెంబ్లీకి వెళ్లాలని అనుకుంటున్నారు. త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టే రోజున ఆయన బడ్జెట్ ప్రసంగం వినేందుకు అసెంబ్లీకి హాజరవుతారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లో ఆయన గజ్వేల్ నుంచి గెలిచినప్పటికీ.. పార్టీ ఓడిపోవడంతో అసెంబ్లీకి రావడం లేదు. ప్రతిపక్ష నేతగా కూడా ఆయనే ఎన్నికయ్యారు. అయినా కిందపడిన కారణంగా మొదట్లో అసెంబ్లీకి రాలేదు. తర్వాత బడ్జెట్ పెడుతున్న రోజున ఒక్క రోజు అసెంబ్లీకి వచ్చి బడ్జెట్ ప్రసంగం విని వెళ్లి పోయారు. మళ్లీ ఇప్పటి వరకూ అసెంబ్లీ వైపు రాలేదు. మరోసారి ఆయన బడ్జెట్ ప్రసంగాన్ని వినేందుకు అసెంబ్లీకి వస్తారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం అరవై వర్కంగ్ డేస్ సభకు హాజరు కాకపోతే అనర్హతా వేటు వేయడానికి స్పీకర్ కు అధికారం ఉంటుంది. ఈ బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకపోతే.. కేసీఆర్ పై అనర్హతా వేటు వేయడానికి అవకాశం లభిస్తుంది. ఉపఎన్నికలు వస్తాయా లేదా అన్న విషయాన్ని పక్కన పెడితే అసెంబ్లీకి హాజరు కాని కారణంగా అనర్హతా వేటు అనేది కేసీఆర్ ఇమేజ్ కు మచ్చలా ఉంటుంది. అందుకే బీఆర్ఎస్ వ్యూహకర్తలు ఒక్కరోజు అసెంబ్లీ అనే ఫార్ములాకు ఓటేసినట్లుగా చెబుతున్నారు. అయితే ఏపీలో వైసీపీ గవర్నర్ ప్రసంగం రోజు వెళ్లినట్లుగా కాకుండా.. బిజినెస్ డేలోనే అంటే.. సభా కార్యక్రమాలు అధికారికంగా జరుగుతున్నప్పుడే హాజరు కావాలని అనుకుంటున్నారు. ఒక్క సారి హాజరైతే..మరో అరవై రోజుల వరకూ హాజరు కాకపోయినా ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉండదు. ఈ నెలలోనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. పూర్తి స్థాయి బడ్జెట్ ను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. కేసీఆర్ హాజరు కాకపోయినా అసెంబ్లీకి బీఆర్ఎస్ సభ్యులంతా హాజరై.. ప్రభుత్వాన్ని గట్టిగానే ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ కూడా వస్తే మరింతగా ప్రభుత్వాన్ని నిలదీయవచ్చని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా పదే పదే కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి రావడం లేదని ప్రశ్నిస్తోంది. దీంతో కేసీఆర్ అసెంబ్లీకి హాజరవనున్నారు. ఒక్క రోజే వస్తారా లేదా.. ప్రభుత్వంపై ఎదురుదాడికి ఇదే సరైన సమయం అని కంటిన్యూ చేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

# బీజేపీ గెలుపు విజయోత్సవ ర్యాలీ

పెద్దపల్లి

జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ విజయోత్సవ ర్యాలీ పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి కమాన్ చౌరస్తా వరకు డీజే సౌండ్, బాణాసంచా శబ్దాలతో, కార్యకర్తల నినాదాల మధ్య నాయకుల నూతన ఉత్సాహంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ బిఆర్ఎస్ కుమ్మకు రాజకీయాలకు చెరమాగితం పాడిన మేధావి వర్గం, కష్టపడ్డ



కార్యకర్తలకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియచేసారు, ఇదే స్ఫూర్తితో జిల్లా లోని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుస్తాం, స్థానిక ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యేల మధ్య జరిగిన చీకటి ఒప్పందం పెద్దపల్లి ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, రామగుండం అసెంబ్లీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి, మండల అధ్యక్షులు వెల్పుల రమేష్, కొప్పుల మహేష్, కూకట్ల నాగరాజు, కందుల శ్రీనివాస్, బిజెపి నాయకులు పల్లె సదానందం, కావేటి రాజగోపాల్, జెజ్జంకి దిలీప్, రాజం మహంత కృష్ణ, ప్రదీప్, చక్రధర్ రెడ్డి, పడాల శ్రీధర్, ఉప్పు కిరణ్, మౌటం నరసింగం, తుడి రవి, అక్క పెల్లి క్రాంతి, కర్ణాకర్, మొలుగూరి రాజా వీరు, సోడా బాబు, సంపత్, గుడ్ల సతీష్, పిట్ల వినయ్, మంతెన కృష్ణ, గాధని సతీష్, వేణు, ఉమేష్, హరీష్, పోగుల రాజు, మధుకర్, శ్రీను, రాజు, శివ, వంశీ, శ్రీనివాస్, సురేందర్, సంపత్, వెంకటేష్, ప్రశాంత్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# కాంగ్రెస్ ఓటమికి కారణం ఎవరు...

హైదరాబాద్, మార్చి 7,

రేవంత్ రెడ్డి సర్కార్ కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయంగా గట్టి ఎదురు దెబ్బ తగిలింది. తెలంగాణలో జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో అధికార పార్టీని తోసిరాజని రెండింటిని బీజేపీ తన్నుకుపోయింది. సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ఇప్పుడు రాజకీయంగా ఇరకాటంలో పడిందనే చెప్పాలి. అధికార పార్టీ హోదాలో కాంగ్రెస్ ఒక్క ఎమ్మెల్సీ స్థానం గెలవకపోవడం రేవంత్ సర్కార్ కు పెద్ద దెబ్బగా కాంగ్రెస్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. స్వయాన సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలోకి దిగినా అనుకున్న ఫలితాలు రాలేదు. సిట్టింగ్ స్థానం కోల్పోవడమే కాకుండా అది తమ బద్ధ శత్రువైన బీజేపీ ఖాతాలో పడటం హస్తం నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. 15 నెలల అధికారంలో తాము అన్ని హామీలు నెరవేర్చుతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తూ వచ్చింది. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రచారం చేసినా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ కోల్పోయింది. బీసీ నినాదంతో కాంగ్రెస్ లబ్ధి పొందాలని ప్రయత్నం చేసినా అది బూమ్ రాంగ్ అయింది. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిలుపుకున్న వైనానికి ఈ ఫలితాలు సాక్ష్యంగా ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ - నిజామాబాద్- ఆదిలాబాద్- మెదక్ జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజి రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిపై 5,106 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. హోరా హోరీ ఇద్దరి మధ్య విజయం దోబూచులాడినా, రెండో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపుతో బీజేపీ ముందుకు పోగా, కాంగ్రెస్ పార్టీ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా బీజేపీ బలపర్చిన కొమరయ్య గెలుపొందారు. ఇలా ఉత్తర తెలంగాణలో కీలకమైన రెండు స్థానాలను బీజేపీ గెల్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలిందని చెప్పాలి. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రెండు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఇక బీఆర్ఎస్ ఈ ఎన్నికల బరి నుండి తప్పుకుంది. దీంతో రెండు జాతీయ పార్టీలు గెలుపు కోసం తీవ్రంగా పని చేశాయి. కరీంనగర్ - నిజామాబాద్- ఆదిలాబాద్ - మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 15 జిల్లాలు, 42 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అంటే అక్కడి పట్టభద్రులు తీర్పుగా ఈ ఎన్నికల ఫలితాన్ని చూడాల్సి ఉంది. అంతే కాకుండా ఇది నేరుగా రెండు జాతీయ పార్టీల మధ్య పోటీ. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్- బీజేపీ పోటీ పడుతున్నాయి. తమకు బలం లేని చోట మిత్రపక్షాల కూటముతో పోటీ పడుతున్నాయి. అయితే ఇక్కడి ఎన్నికల్లో రెండు పార్టీలు నేరుగా పోటీ పడటంతో అటు కాంగ్రెస్ సర్కార్ , ఇటు బీజేపీ రెండు చాలా ప్రతిష్ఠాత్మకంగా ఈ ఎన్నికలను తీసుకున్నాయి. బీజేపీ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ , బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిష్ఠాత్మకంగా ఈ ఎన్నికలను తీసుకుని పని చేశారు. అటు సీఎం రేవంత్ రెడ్డి, పీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు, అధికార పార్టీఎమ్మెల్యేలు అదే రీతిలో ప్రచారం చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెల్చుకోవడంతో బీజేపీలో జోష్ పెరిగింది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ట్రయాంగిల్ పోటీని ఎదుర్కొన్న కాషాయం పార్టీ 8 అసెంబ్లీ స్థానాలను, 8 ఎంపీ స్థానాలను గెల్చుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీతో జరిగిన ఎమ్మెల్సీ పోరులో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు గాను రెండు బీజేపీ ఖాతాలో పడ్డాయి. దీంతో రాష్ట్రంలోని చట్ట సభల్లో కాషాయ పార్టీకి పది మంది సంఖ్యా బలం అంటే రెండు అంకెల స్కోరు కు చేరడం విశేషం. ఓవరాల్ గా 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు కేంద్ర మంత్రులు, మరో ఆరుగురు ఎంపీలు, ఒక రాజ్య సభ సభ్యుడు , తాజాగా ఇద్దరు ఎమ్మెల్సీల బలం బీజేపీది. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల గెలుపుతో కమలం పార్టీ ఉత్తర తెలంగాణలో తన బలాన్ని సుస్థిరం చేసుకుందనే చెప్పాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కమల నాథులు ఇప్పటి నుండే కసరత్తు ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ బరిలోకి దిగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ పార్టీ ఒక్క స్థానం గెలవలేకపోయింది. బీఆర్ఎస్ కు తమ విజయాలతో చెక్ పెట్టడం ద్వారా కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ నేతలు చెప్పుకునే పరిస్థితి కల్పించారు. స్థానిక సంస్థల్లోను కమలంను వికసింపజేస్తే ఆ తర్వాత టార్గెట్ తెలంగాణ అధికార పీఠమేనని పార్టీ నేతలు చెబుతున్నారు. ఆ దిశగా ఇప్పటికే కేంద్రంలోని ముఖ్య నాయకులు, రాష్ట్ర నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే బీజేపీ రాష్ట్ర పార్టీకి కొత్త సారథి నియమితుడవుతాడని కమలం సీనియర్లు చెబుతున్నారు. ఈ విజయం ఇచ్చిన జోష్ తో రానున్న రోజుల్లో బీజేపీ అధికార పీఠం దక్కించుకునే దిశగా సాగుతుందని చెప్పక తప్పదు.ఆ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీ కుల గణన పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడటం కూడా పార్టీకి నష్టం చేకూర్చింది. అంతే కాకుండా ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు అన్యాయం జరిగిందని ఇందుకు కాంగ్రెస్ పార్టీయే కారణమంటూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేసిన కామెంట్స్ కూడా కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో కొంత నష్టం చేశాయని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఉత్తర తెలంగాణలోని 19 మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, పీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రచారంలో భాగస్వామ్యులయ్యారు , కాని రిజల్ట్ భిన్నంగా రావడంతో ఎన్నికలను ఎదుర్కొనే విషయంలో వ్యూహ, సమన్వయ లోపం జరిగిందన్న చర్చ హస్తం నేతల్లో సాగుతోంది.

# రణస్థలం మండలం పైడి భీమవరం జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదం

శ్రీకాకుళం మార్చి 7,

పైడి భీమవరం లో ఓ పరిశ్రమలో విధులకు ఆరుగురు యువకులు రాత్రి డ్యూటీ కి వెళ్లే క్రమం లో రోడ్డు దాటుతున్న సమయం లో శ్రీకాకుళం వైపు నుండి అతివేగంగా వస్తున్న కారు ఢీ కొనడంతో ఓ యువకుడు అక్కడక్కడే మృతి చెందాడు. మిగిలిన ఐదుగురు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మృతిచెందిన యువకుడు విజయనగరం జిల్లా నెల్లిమర్ల తమ్మాయి పురం కి చెందిన అప్పలనాయుడు గా గుర్తించారు. ఇదంతా అక్కడున్న సీసీ కెమెరా లో రికార్డు అయ్యింది . కారు డ్రైవర్ కారు ఆపకుండా పరారైయ్యాడు.

# ఉమ్మడి జిల్లాలో ముగ్గురు పోలీసు అధికారుల బదిలీ కరీంనగర్ సీపీగా గౌస్

## అలం, బదిలీ కానీ జగిత్యాల ఎస్పీ

కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు జిల్లా పోలీసు అధికారులకు స్థానచలనం కాగా, జగిత్యాల ఎస్పీ మాత్రం బదిలీ చేయలేదు. రాష్ట్రంలో ఐపిఎస్ అధికారులను రాష్ట్ర డిజిపి బదిలీ ప్రక్రియను చేపట్టారు. కరీంనగర్ సిపి అభిషేక మహంతీని బదిలీ చేయగా స్థానం ప్రకటించలేదు.ఆయన స్థానంలో రానున్న గౌస్ అలం ఇంతకుముందు తెలంగాణలో పలు జిల్లాల్లో ఎస్పీగా బాధ్యతలు



నిర్వహించారు. ఈ ప్రాంతంపై సమగ్ర అవగాహన కలిగివున్న ఆయనకు కరీంనగర్ సీపీ గా నియమించడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ దీర్ఘకాలంగా కొనసాగుతున్నారని, ఆయనను బదిలీ చేయాలని ప్రచారం జరిగింది. రామగుండం సీపీ గా శ్రీనివాస్ స్థానంలో వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ బదిలీ చేసిందిమ్మె ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో తెలంగాణ లో ఉన్న ఎపి క్యాడర్ ఐపిఎస్ అధికారులను సొంత రాష్ట్రానికి వెళ్ళాలని కేంద్రం ఆదేశించింది. అయితే ఎన్నికల తరువాత కూడా కరీంనగర్ సిపిగానే అభిషేక్ మహంతిని కొనసాగిస్తారన్న వాదనలు వినిపించినప్పటికి స్థానచలనం కావడం గమనార్హం. తెలంగాణ ప్రభుత్వం కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు కమిషనరేట్ల సీపీ లను, ఓ జిల్లా ఎస్పీని, డిసిపిని బదిలీ చేయగా, పెద్దాపెల్లి డీసీపీ గా కరుణాకర్ ను నియమించింది.

# మొత్తం 571.69 ఎకరాల్లో రాజీవ్ స్వగృహ ప్రాజెక్ట్ కొనసాగుతుంది

అమరావతి

రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ కింద చేపట్టిన ప్రాజెక్టులపై అసెంబ్లీ లో మంత్రి నారాయణ జవాబిచ్చారు. 2007 లో ఎంఐజీ ఇళ్లు అభివృద్ధి చేసేలా రాజీవ్ స్వగృహ ప్రాజెక్ట్ తీసుకొచ్చాం. అనంతపురం,కర్నూలు లో ప్రాజెక్ట్ పూర్తి అయింది...మిగిలిన చోట్ల పెండింగ్ ఉంది. మొత్తం 571.69 ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్ కొనసాగుతుందని అన్నారు. ధరల విషయంలో మంత్రి వర్గ ఉపసంఘం పలు ప్రతిపాదనలు ఇచ్చింది. అయితే పెండింగ్ లో ఉన్న ఇళ్లను రద్దు చేయాలంటే న్యాయపరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ప్రాజెక్ట్ అమల్లో ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో చర్చించి ఎలా ముందుకెళ్లాలని నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

# ఆప్కాస్ ను రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

## ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్.

పాలకొండ

రాష్ట్రంలో పురపాలక సంఘాలలో ఉన్న ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

కమిటీ ఆధ్వర్యంలో మన్యం జిల్లా కలెక్టర్ కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించింది.

అనంతరం నేతలు విలేకరులు ఉద్దేశించి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆప్కాస్ ను రద్దు చేస్తున్నప్పుడు అంతకన్నా మెరుగైన జీవన విధానాన్ని కార్మికులకు అందించాలని కోటమి ప్రభుత్వం అలా చేయకుండా కాంట్రాక్టర్ల చెప్పు చేతల్లోకి కార్మికులను నెట్టాలని చూస్తే మరో పోరాటానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

279 జీవోను తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలు చేయాలని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గతంలో చూస్తే దానిపై పోరాడమని గుర్తు చేశారు.

జిల్లా పరిధిలో సాలూరులో నేతికి డబ్బులు లేవనే కారణంతో రెగ్యులర్ల జీతాలు చెల్లించడం లేదని ఫిబ్రవరి నెల జీతం కార్మికుల ఖాతాలకు వేయలేదని సభ్యులు నూనెలు చెప్పులు ఇవ్వాల్సి ఉన్న నిధులు లేవనే కారణంతో ఇవ్వడం కూడా చేయడం లేదని తెలిపారు.

చనిపోయిన కుటుంబాలు ఉద్యోగాలకు సంబంధించి కౌన్సిల్ తీర్మానం అయ్యి రెండు సంవత్సరాలు గడుస్తున్నా కార్మికుల కుటుంబాలకు పోస్టులు వేయలేదని తెలిపారు.

సాలూరు పట్టణంలో శ్యామలంబ పండుగ దృష్ట్యా కార్మికులకు సెలవులు ఇవ్వాలని జిల్లాలో పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని జీవో నెంబర్ 36 అమలు చేసి ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని డ్రైవర్ల వేతనాలు జీవో ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు మల్లేష్, సింహాచలం, రాముడు, శంకరు, మహిళా కమిటీ జిల్లా నాయకులు ఇందు నిర్మల, రవి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, కోశాధికారి సన్యాసిరావు, సిఐటియు నాయకులు సూరిబాబు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

# కీసర ప్రభుత్వ పాఠశాలలో కనికరం లేని ఉపాధ్యాయుడు విద్యార్థులను కరెంటు వైర్ తో చితకబాదిన పీఈటి ఆనంద్,

కీసర

దమ్మాయిగూడా మున్సిపాలిటీ కీసర ప్రభుత్వ పాఠశాలలో పిఈటీ ఆనంద్ అరాచకం బయటపడింది. ఒంట్లో బాగాలేదన్నా వినకుండ 8 మంది విద్యార్థినిలను చితకబాదాడు. 8వ తరగతి చదువుతున్న ప్రణతి , వైశాలి , కావ్య , నవ్య , చరన్య , అర్పన , బ్లెస్సి , కీర్తన లను గేమ్స్ పీరియడ్ లో ఆట లు ఆడేందుకు విద్యార్థినిలు రాలేదని ఏ మాత్రం కనికరం లేకుండా కరెంట్ వైర్ తో చితకబాదడు పిఈటి ఆనంద్.

ఇంటికి వచ్చిన విద్యార్థినులకు జ్వరం రావడంతో గమనించిన తల్లిదండ్రులు,ఒంటి పై గాయాలు చూసి షాక్ గురయ్యారు. జరిగిన విషయం తెలుసుకొని , ఆడపిల్లల పై విచక్షణ మరచి కరెంట్ వైర్ తో కొట్టడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పిఇటి ఆనంద్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు....

# రామానాయుడు విశ్రాంతి తీసుకునేలా రూలింగ్ ఇవ్వండి!

## శాసనసభలో, వెలుపల రామానాయుడుపై లోకేష్ ఆప్యాయత

అమరావతిఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కేవలం పనిపైనే కాకుండా కాస్త ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని ఇరిగేషన్ మంత్రి లోకేష్ సలహా ఇచ్చారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి నిమ్మల జ్వరంతో బాధపడుతున్న విషయాన్ని లోకేష్ ప్రస్తావిస్తూ... రామానాయుడు విశ్రాంతి తీసుకునేలా రూలింగ్ ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును కోరడంతో శాసనసభలో నవ్వుల పువ్వులు విరిశాయి. విశ్రాంతి తీసుకుంటారా లేక సభ నుంచి సస్పెండ్ చేయించమంటారా అంటూ లోకేష్ చమత్కరించారు. ఆ తర్వాత అసెంబ్లీ లాబీల్లో మంత్రి రామానాయుడు ఎదురుపడినపుడు ఆయన ఆరోగ్యంపై లోకేష్ వాకబు చేస్తూ... ఒక చేతికి సెలైన్ ఇంజెక్షన్ పెట్టుకుని నేడు మరో చేతిలో కాగితాలు పట్టుకుని తిరుగుతూనే ఉంటే ఆరోగ్యం ఏం కావాలని ఆప్యాయంగా ప్రశ్నించారు. నిన్నటి మీద ఈరోజు ఆరోగ్యం బాగానే ఉంది, అందుకే వచ్చానన్న రామానాయుడు సమాధానమిచ్చారు. మాట వినకుంటే నా యాపిల్ వాచ్ ని మీ చేతికి పెట్టి నిద్రను మానిటర్ చేస్తానని లోకేష్ చెప్పడంతో ఈరోజు సభ అయ్యాక మీ మాట ప్రకారమే విశ్రాంతి తీసుకుంటానని రామానాయుడు అన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు 25 శాతం రిబేటును సద్వినియోగం చేసుకోండి


## ఈ నెల 31 వరకు మాత్రమే గడువు ఉంది

**క్రమబద్ధీకరించుకోని వారికి భవిష్యత్తులో పర్మిషన్లురావు, రిజిస్ట్రేషన్లు కాబడవు**

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ వెల్లడి**

కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ నెల 31 లోపు ఆన్లైన్ లో ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం రిబేటు లభిస్తుందని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దరఖాస్తు దారులు ఎల్ఆర్ఎస్ 2020 వెబ్ సైట్ లోకి వెళ్లి పరిశీలించినట్లయితే వారియొక్క దరఖాస్తు కు సంబంధించి ఫీజు వివరాలు తెలుస్తాయని జిల్లాలోని కార్పొరేషన్, సుడా, మున్సిపాలిటీలు అన్నీ కలిపి 44 వేల437 దరఖాస్తులకు ఫీజు నిర్ణయించబడిందని తెలిపారు. ఫీజు నిర్ణయించబడిన 1435 దరఖాస్తులు ప్రోహిబిటెడ్ లో లేనట్లయితే మళ్లీ ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకుంటే తిరిగి పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.పది శాతం ప్లాట్లు అమ్మిన వెంచర్స్ కు కూడా మిగితా ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని అన్నారు.ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఆర్ఎస్ లేని ప్లాట్లు భవిష్యత్తులో ఎలాంటి అనుమతులు కానీ రిజిస్ట్రేషన్ లు కానీ కావని పేర్కొన్నారు. దరఖాస్తు దారులకు ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి




చేసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్లు 9652404978 మరియు 7093750333 కు ఫోన్ చేయవచ్చు అని అన్నారు. ఈ సమావేశంలో సిపిఓ అంజనేయులు,ఫీల్డ్ ఆఫీసర్లు అజయ్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# పైపులైను పనులను అడ్డుకున్న గ్రామస్థులు

నందిగామ్, మార్చి 7, నందిగామ నియోజకవర్గం వీరులపాడు మండలం నందలూరు వద్ద పైపు లైన్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. నందలూరు వద్ద ఉన్న వైరా, కట్టలేరు నుంచి నీటి తరలించేందుకు పనులు చేస్తున్న కంచికచర్ల మండల గండేపల్లి సెంధినీ ఫ్యాక్టరీ యాజమాన్యం పై గ్రామస్తులు విరుచుకుపడ్డారు. వేసవి సమయంలో నీటిని సెంధినీ ఫ్యాక్టరీ కి తరలిస్తే నీటి సమస్య ఉంటుందని నందలూరు, తాటిగుమ్మి, జమ్మవరం గ్రామస్తులు వాపోయారు...

# నారాయణపురంలో నీటి ఎద్దడి

యాదాద్రి

భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బోరు నీటిని నమ్ముకొని వరి పంటలు వేస్తే వేసవికాలం కంటే ముందే ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో భూగర్భ జలాలు ఎండిపోతున్నాయి. నీరు లేక చేతికి రావాల్సిన పంట...అందకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. పది రోజులుగా రోజు రెండు ట్యాంకర్ల నీటిని కొంటూ వరి పొలాలకు నీరు అందిస్తున్నారని అంటున్నారు. పొలాలకు కావలసిన నీరు అందకపోవడంతో చివరికి వరి పొలాల్లోకి పశువులను మేపుతున్నారు. ఒక్కో ఎకరానికి సుమారు 70 వేల వరకు పెట్టుబడి పెట్టాం. తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆపన్నహస్తం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

# పన్ను చెల్లించేంతవరకు మైహోమ్ సిమెంట్ పరిశ్రమ సిమెంట్ ఉత్పత్తిని నిలుపుదల చేయాలి: న్యాయవాది కమతం నాగార్జున

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 07:గత రెండు సంవత్సరాలుగా ఎటువంటి గ్రామపంచాయతీ పన్ను చెల్లించకుండా నడుస్తున్న మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ యూనిట్-4 ప్లాంట్ సిమెంటు ఉత్పత్తిని బేషరతుగా నిలువుదల చేయాలంటూ న్యాయవాది కమతం నాగార్జున శుక్రవారం మేళ్లచెరువు పంచాయతీ కార్యదర్శి షేక్ ఫరీద్ కు ఫిర్యాదు చేశారు. వెంటనే గ్రామపంచాయతీ పన్ను వసూలు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ గ్రామంలో సామాన్యుడు నుండి ముక్కు పిండి పంచాయతీ పన్ను వసూలు చేస్తున్న గ్రామపంచాయతీ అధికారులు మైహోం సంస్థ నుండి పన్ను వసూలు చేయకపోవడం వెనుక ఆంతర్యమేమో చెప్పాలని డిమాండ్ చేశారు. యూనిట్-4 సిమెంట్ ప్లాంట్ కు అనుమతులు జారీ చేసిన గ్రామపంచాయతీ రెండు సంవత్సరాలుగా కనీసం గ్రామపంచాయతీ పన్ను వసూలు చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రూ.1500 కోట్ల విలువచేసే మైహోమ్ సిమెంట్స్ యూనిట్-4 ప్లాంట్ కు గ్రామపంచాయతీ పన్ను ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా పన్ను వసూలు చేయకపోవడంపై గ్రామపంచాయతీ అధికారుల తీరుపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మైహోమ్ సిమెంట్స్ సంస్థ గ్రామపంచాయతీ పన్ను చెల్లించకపోవడం వల్లనే మేళ్లచెరువు గ్రామపంచాయతీ అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం మైహోమ్ సిమెంట్స్ సంస్థ



నుండి గ్రామపంచాయతీ పన్ను వసూలు చేయాలని ఆయన గ్రామపంచాయతీ అధికారులు కోరారు. పన్ను చెల్లించేంతవరకు మైహోమ్ సిమెంట్ పరిశ్రమ సిమెంట్ ఉత్పత్తిని వెంటనే నిలుపుదల చేయాలని ఆయన కోరారు.

# ముత్యాలమ్మకు బోనం సమర్పించిన అమ్మ ఫౌండేషన్ చైర్మన్, డిప్యూటీ సీఎం సతిమణి మల్లు నందిని



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మార్చి 7: మధిర నియోజకవర్గం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో బొడ్రాయి ముత్యాలమ్మ గుడి ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం బోనాలు ఎత్తుకుని గ్రామ దేవతలకు సమర్పించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క. అనంతరం బొడ్రాయి ప్రతిష్టా పూజా యాగశాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారితో పాటు వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అనుబంధ సంఘాల నాయకులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ...... బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆమె కోరారు. గ్రామాల్లో ప్రజలు నిత్యం కొలుచుకునే గ్రామదేవతలు దీవెనలతోనే ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కూరపాటి తిరీష, కూరపాటి కిషోర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నంవి దిగజారుడు రాజకీయాలు
# కాంగ్రెస్ కు ఎమ్మెల్సీ అభ్యర్థులే కరువు : మాజీ మేయర్ సునీల్ రావు

కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపి, బీఆర్ఎస్ కలిస్తేనే గెలుపు సాధ్యమైందనీ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మతిలేని వాఖ్యలు చేస్తున్నాడని బిజెపి జిల్లా నాయకులు, మాజీ మేయర్ వై. సునీల్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతో మంత్రి పొన్నం దిగజారుడు రాజకీయాలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పంక్షన్ హాల్ లో మాజీ కార్పొరేటర్ల తో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సునీల్ రావు మంత్రి పొన్నం పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలు జరిగితే అభ్యర్థులను పోటిలో పెట్టలేని దివాలాకోరు స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నది నిజమే కాదాని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పట్టబధ్రుల ఎమ్మెల్సీ లో మాత్రమే అభ్యర్థులను పెట్టి మిగితా రెండు స్థానాల్లో పోటిలో పెట్టకపోవడం అంతర్యమేంటో చెప్పాలన్నారు.వరంగల్, ఖమ్మం, నల్గొండ స్థానంతో పాటు, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ లో జరిగే టీచర్స్, పట్టబధ్రుల రెండు స్థానాల్లో బిజెపి పోటీలో నిలిచి గెలిచిందన్నారు. పై విషయాలన్నీ పొన్నం ప్రభాకర్ ఒప్పుకోవాల్సిన డిమాండ్ చేశారు. పట్టబధ్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని పోటిలో నిలిపి, అన్ని రకాల ప్రయోగాలు చేసి మూడు సభల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందనీ కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, దీనికి గల కారణం ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారని పొన్నం ప్రభాకర్ అర్థం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్ కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాల తోనే తనను బలిపశువు ను చెసినారని సాక్ష్యాత్తు ఎమ్మెల్సీ గా ఓటమి చెందిన నరేందర్ రెడ్డి ఒప్పుకున్నారని గుర్తుచేశారు. 3రోజుకు ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ జరిగిన ఒక్క కాంగ్రెస్ నాయకుడు రాలేదని చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిరుద్యోగులు, 317 బాదితులు, ప్రజలు, అన్ని వర్గాల పక్షాణ ఉద్యమం చేయడం ద్వారానే అందరు వారి శ్రమను గుర్తించి మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో అభ్యర్థులను గెలిపించుకున్నామని చెప్పారు. సరైన నాయకుడు కాంగ్రెస్ పార్టీ



లో లేరనీ చెప్పినా మీరు గుర్తుంచుకోపోతే అది మీ దౌర్భాగ్యంగా బావిస్తున్నామని చెప్పారు. వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి రకరకాలుగా ప్రలోభాలకు గురి చేసినా పట్టబధ్రులు మిమ్మల్ని కరుణించ లేదనీ స్పష్టం చేశారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ స్వయంగా బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కు మద్దతు ఇచ్చిన విషయాన్ని మీరు మరిచి పోవద్దనీ, మద్దతు ఇచ్చింది అందరికి తెలుసు అని అదే ఓపెన్ సీక్రెట్ అన్నారు. అది మరిచి ఓటమిని కప్పి పుచ్చుకోవడానికి మంత్రి పొన్నం దివాలకోరు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆనాడు ఎంపీల ఫోరం అధ్యక్షులు... అప్పుడు రాజీవ రహాదారి నిర్మాణం లో ఎన్ని అవకతవకలు, అక్రమాలు జరిగాయో చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నుండి రామగుండం వరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా రోడ్డు నిర్మాణం చేసే బాధ్యత బండి సంజయ్ కుమార్ తప్పకుండ స్వీకరిస్తారని చెప్పారు. ఈవిధంగా అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ద్వారా జరుగుతున్నయని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. బండి సంజయ్, కిషన్ రెడ్డిల నాయకత్వం ప్రతి ఓటర్ ను కలిసి ఒక్క రూపాయి పంచకుండా మా అభ్యర్థులను గెలిపించుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో నాయకులు సతీష్, ప్రవీణ్,రమేష్, గాయత్రి లు పాల్గొన్నారు.

# మాదిగల డప్పుల ప్రదర్శనను జయప్రదం చేయండి.



మణుగూరు మార్చి 07 (భారతశక్తి): మాదిగల డప్పుల ప్రదర్శనను జయప్రదం చేయాలని పినపాక నియోజకవర్గ ఇంచార్జి బోయిళ్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షులు మోదుగు వెంకటేశ్వరరావు మాదిగ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయిళ్ళ వెంకటేశ్వర్లు మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఈనెల 9న ఆదివారం ఉదయం 10 గంటలకు పినపాక నియోజకవర్గ కేంద్రం మణుగూరులో మాదిగల డప్పుల ప్రదర్శనను జయప్రదం చేయాలని ఆయన కోరారు. మహా జననేత పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశానుసారంగా జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ రిపోర్ట్ లో అవకతవకలను సరిచేయాలని, షెడ్యూల్ కులాల వర్గీకరణ మూడు గ్రూపులుగా కాకుండా ఏ బి సి డి నాలుగు గ్రూపులుగా విభజించి, ఇద్దరు మాదిగ ఎమ్మెల్యేలకు క్యాబినెట్లో మంత్రి పదవులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మణుగూరు మండల ఇన్చార్జి కొమ్ము హుస్సేన్ మాదిగ, బోయిల్ల నరసింహారావు మాదిగ, పొడుతూరి కళ్యాణ్ మాదిగ, చిట్యాల రజిత మాదిగ, ఉసికల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా పోరాడాలి:వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి. నిర్మల గీతాంబ



వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి7:ముందు తరాలతో పోల్చుకుంటే ప్రస్తుత తరంలో మహిళలు విభిన్న రంగాల్లో ముందు వరుసలో నిలుస్తున్నారని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి. నిర్మల గీతాంబ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మల గీతాంబ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు వెనుకబడి లేరని, అన్ని రంగాల్లో ముందు నిలుస్తున్నారని అన్నారు. ముందు తరాలతో పోల్చుకుంటే విభిన్న రంగాల్లో ముందున్నామన్నారు. కలెక్టర్లు, పోలీసులు, ఇతర ఎన్నో ఉద్యోగాలు మొదలుకొని ఆకాశం వరకు మహిళలు ఎన్నో అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందు నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఎందులోనూ తీసిపోలేరని, ఉద్యోగాలు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, అందుకు కలెక్టర్లు, తదితర ఎంతోమంది ఉద్యోగులే నిదర్శనం అని అన్నారు. ఒకరికొకరు గౌరవించుకున్నప్పుడే సమాజం ఎంతో ముందుకు వెళ్తుందన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా పోరాడాలన్నారు. మహిళలు జీవిత మార్గంలో లక్ష్యాన్ని కష్టపడి సాధించాలన్నారు. మనం కష్టపడి సాధించిన ప్రగతి ప్రస్థానాన్ని నెమరు వేసుకున్నప్పుడు ఎంతో సంతోషం వేస్తుందన్నారు. విభిన్న రంగాలలో రాణిస్తున్న మహిళలు మరెంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఎన్నో అవరోధాలను దాటి ఉన్నత స్థానంలో నిలిచినందుకు మహిళా అధికారులు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

::హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య::

మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి మహిళా ఒక రోల్ మోడల్ అని పేర్కొన్నారు. సమాజంలో పురుషులే మహిళా దినోత్సవం నిర్వహించినప్పుడే అసలైన మహిళా దినోత్సవం అని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులను ప్రోత్సహించినప్పుడు మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని అన్నారు. భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్, కల్చరల్ పోటీలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు, ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

:: హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి::

మాట్లాడుతూ సమాజంలో, కుటుంబ వ్యవస్థలో మహిళలే కీలకమని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని అన్నారు. సమాజంలో స్త్రీల పట్ల వివక్షను రూపుమాపే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అన్ని రంగాలలో మహిళలను ప్రోత్సహించాలన్నారు.

::టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు::

మాట్లాడుతూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. వివిధ క్రీడా మరియు సాంస్కృతిక పోటీలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. వివిధ బాధ్యతలలో ఎంతో ఒత్తిడి ఉండే మహిళా ఉద్యోగులు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా మరింత ఉత్సాహన్ని కలగజేస్తాయన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ లో కీలక బాధ్యతల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మల గీతాంబ, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను శాలువాలు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, మహిళా అధికారులు నీరజ, అనురాధ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షులు రామ్ రెడ్డి, కార్యదర్శి ఫణి కుమార్, రాజేష్ కుమార్, పవిత్ర, శ్రీలక్ష్మి, మాలతి, శ్రీ ప్రియ, చేతన, హేమలత, తన్మయి, అరుణ, వింధ్య, ప్రేమ లేత, హేమలత, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమం కోసమే సభ
## ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు..
## ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):మహిళల సమస్యలు పరిష్కరించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు శుక్రవారం సభ ద్వారా సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కరీంనగర్ లోని జగ్జీవన్ రావ్ కాలనీ అంగన్ వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మహిళలతో మాట్లాడారు. అంగన్ వాడీ కేంద్రంలో జరిగే ఈ సభకు వస్తే మహిళలకు అన్ని ఆరోగ్య విషయాలు తెలుస్తాయన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, ఊరు.. తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు తమ భోజనంలో అన్ని పోషక పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు.గర్భిణీగా నిర్ధారణ అయినప్పటి నుంచి మొదటి వెయ్యి రోజులు పోషకాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు.సమతుల్య ఆహారం తీసుకుంటే మందుల అవసరం ఉండదని.. గర్భిణులు తప్పనిసరిగా కాల్షియం, ఐరన్ మాత్రలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 54 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నామని.. మహిళలు విధిగా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షలే ప్రైవేట్ ఆసుపత్రిలో చేయించుకుంటే రూ.40 వేలకు పైగా ఖర్చు అవుతాయన్నారు.బీపీ, షుగర్, రక్తహీనత తదితర వైద్య పరీక్షలతో పాటు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కూడా చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలతో పాటు అన్ని రకాల మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చి నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు, ప్రాథమిక పాఠశాలలకు పిల్లలను పంపించాలని సూచించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. లిప్రాథమిక పాఠశాల సందర్శనలి కిసాన్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. పలు పాఠ్యాంశాలను ప్రశ్నించగా చిన్నారులు సరైన సమాధానం చెప్పడంతో కిసాన్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా షూ పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పాఠశాలలోనే అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయడం కోసం అదనపు గది నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో సబిత, మెప్మా పీడీ వేణుమాధవ్, డిప్యూటీ డిఎంహెచ్వో సుజాత, డిసిపిఓ పర్వీన్, పిఓ సనా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

మణుగూరు, మార్చి 07 (భారతశక్తి): సింగరేణి ఉన్నత పాఠశాల పివి కాలనీ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం పాఠశాల హెచ్ఎం స్వరూప రాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయినీలను, ఉపాధ్యాయేతర సిబ్బందిని



సన్మానించారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రథమ మహిళ ఐన హెచ్ఎం స్వరూప రాణిని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఎంతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా స్త్రీలు పురుషులతో పాటు సమానత్వాన్ని పొందిన ఈ రోజును పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయినిలకు కూడా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళల గొప్పతనం గురించి పాఠశాల హెచ్ఎం ఈజీ స్వరూప రాణి మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ మనకు జన్మనిచ్చిన తల్లికి మనమందరం రుణపడి ఉండాలని తెలియజేశారు. అనంతరం మహిళల గొప్పతనం గురించి ఉపాధ్యాయులు ప్రసంగించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయిని కళ్యాణి, వేణు, కృష్ణ బాబు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలపై హింసను వ్యతిరేకించాలి.

## -ప్రగతి శీల మహిళ సంఘం డిమాండ్

మణుగూరు, మార్చి 07 (భారతశక్తి): మహిళల గౌరవానికి భంగం కలిగించే అందాల పోటీలను వ్యతిరేకించాలని ప్రగతి శీల మహిళ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రగతి శీల మహిళ సంఘం ఆధ్వర్యంలో పూల మార్కెట్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

అనంతరం డిటి రామారావు కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైద్రాబాద్ వేదికగా జరిగే ప్రపంచ 72వ అందాల పోటీలను అడ్డుకుందామని, మహిళల అవయవాలపై వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విష సంస్కృతికివ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. స్త్రీ, పురుష సంబంధాలు మార్కెట్ సరుకు కాకూడదని, సమానత్వంతో గౌరవప్రథంగా వర్ధిల్లాలని నినాదాలు చేశారు.

కగార్ పేరుతో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న "ఊచకోత"లను నిలిపివేయాలన్నారు. ఉపా కేసులను రద్దుచేసి, రాజ్యాంగబద్ధ, ప్రజాస్వామిక హక్కులను కాపాడాలన్నారు. అర్హులైన మహిళలందరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.మూల ఆదివాసీ గూడాలకు మంచినీరు, విద్యుత్, రోడ్లతో పాటు ఇతరమౌలిక వసతులను కల్పించాలన్నారు. స్త్రీనిధితో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల అధిక దోపిడీని అరికట్టాలన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు.




చింతాలక్ష్మి నగర్ గ్రామ ప్రజలకు రక్షణకల్పిస్తూ, మంచి నీరు, విద్యుత్పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. కాంట్రాక్టు మహిళా కార్మికులకు పని భద్రతను కల్పించాలన్నారు. పెనాల్టీ పేరుతో వేతనంలో కోతలను నిలివివేయాలన్నారు. వనిస్థలంలో మరుగుదొడ్లతో పాటు, ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు.

యం.యం.సి. లబ్ధిదారులకు వయోపరిమితి 61 ఏండ్లకు పెంచాలన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడిని పరిష్కరించాలని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలల్లో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) భద్రాచలం డివిజన్ కార్యవర్గం సోడె అచ్చమ్మ, సల్లోజు విజయలక్ష్మి, కొడిమె రాధ, డివిజన్ అధ్యక్షురాలు వై. జానకి, రాష్ట్ర కోశాధికారి పెదగోని ఆదిలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు సున్నం భూలక్ష్మి డివిజన్ ప్రధాన కార్యదర్శి జక్కుల రాంబాబు, సీపీఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసీ మణుగూరు డివిజన్ కార్యదర్శి యస్.డి. నాసర్ పాష తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం పై అవగాహన : జిల్లా న్యాయసేవ సాధికార సంస్థ వెంకటేష్



కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా పట్టణంలోని అపూర్వ డిగ్రీ కళాశాల (బాలికల) లో జాతీయ న్యాయ సేవసాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ సెక్రటరి, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం స్త్రీలకు కల్పిస్తున్న హక్కుల గురించి, సైబర్ నేరాలు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో కళాశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్, న్యాయవాది తణుకు మహేష్ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి మోడీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది: బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి.

కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):కేంద్రం ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని , అందులో భాగంగానే ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో అనేక పనులు జరుగుతున్నాయని , గ్రామ రహదారులు మొదలుకొని నేషనల్ హైవేల అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయిస్తుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఈజీఎస్ 30 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ , అభివృద్ధి పై లేదన్నారు. గ్రామాల్లో సమస్యలురాజ్యమేలుతున్న, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందన్నారు. పాలకవర్గాలు లేక గ్రామపంచాయతీలను పట్టించుకునే నాధుడు లేక అనాధగా మారాయన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే దమ్ము ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. కానీ పనికిమాలిన వ్యాఖ్యలు, రాజకీయాలు చేయడానికి, కాంగ్రెస్ నేతలు, మంత్రులు పనికి వస్తారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అనంతరం కాంగ్రెస్ నేతలు , మంత్రులు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు , మంత్రులు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు, పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాతపెట్టిన ఇంకా సిగ్గు రాలేదన్నారు. ప్రజలను ఆరు గ్యారంటీలు, 420 హామీలతో, అబద్దాలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ను ప్రస్తుతం ప్రజలంతా చీకొడుతున్నారన్నారు. పట్టభద్రులు ,



టీచర్స్ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారనే విషయాన్ని గుర్తుంచుకొని మాట్లాడాలన్నారు. కాళేశ్వరం పై విచారణ, ఫోన్ టాపింగ్, విద్యుత్ కుంభకోణం , డ్రగ్స్ కేసు , ఫార్ములా ఈ రేస్ కేసు విషయాలను అటకెక్కించి బిఆర్ఎస్ తో లోపాయి కారి ఒప్పందాల తో ముందుకు కొనసాగుతుంది ఎవరో ప్రజలందరికీ అర్థమైందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బిజెపిని ఎదుర్కోవడానికి బిఆర్ ఎస్, కాంగ్రెస్ లు ఒక్కటై చేసిన కుట్రలన్నీ సమాజం గ్రహించిందన్నారు. ఇందులో భాగంగా కమలాపురం గ్రామం లోని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కనుకుంట్ల అరవింద్ ఇంటికెళ్ళి పరామర్శించిన తరువాత శనిగరం గ్రామ మాజీ సర్పంచ్ సతీమణి అంత్యక్రియల్లో పాల్గొన్నారు..వారి వెంట మండల అధ్యక్షులు ర్యా కం శ్రీనివాస్ తుమ్మ శోభన్ బాబు కట్కూరి అశోక్ రెడ్డి చెలిక శ్రీనివాస్ చిట్టి సుందరయ్య మేడిపల్లి రాజు పిట్టల సతీష్ దండవేని శ్రీనివాస్ భోగి భిక్షపతి బండి కోటేశ్వర రాజ్ మహమ్మద్ బుర కుమార్ రావుల ఆకాష్ కదారి గణేష్ నాసని రాజు పుష్కరి రాంబాబు పెండ్యాల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ రాహుల్.!

## - ఆదర్శం కెరీర్ గైడెన్స్ పిఓను అభినందించిన సెక్రటరీ
## - అన్నీ ఐటీడీఏల పరిధిలో అమలు చేయాలి
## - ఆదేశాలు జారీచేసిన సెక్రటరీ




భద్రాచలం, మార్చి 07 (భారతశక్తి): వినూత్న ఆలోచనలకు పెట్టింది పేరు భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్., ఇటీవల కాలంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఆయన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామును రూపకల్పన చేసి అమలు చేస్తున్నారు. గిరిజన విద్యాసంస్థల్లో కెరీర్ గైడెన్స్ సంబంధించి పోస్టర్ల ఏర్పాటు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రోగ్రాం సక్సెస్ ని ఇచ్చింది. విజయవంతంగా అమలవుతోంది. ఈ క్రమంలో ఈ కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం విషయం ట్రైబల్ వెల్ఫేర్ ప్రత్యేక సెక్రటరీ శరత్ దృష్టికి వెళ్ళింది. ఎంతో ప్రయోజనకరమైన ఈ ప్రోగ్రామును ఆయన ఎంతగానో మెచ్చుకున్నారు. ఐటీడీఏ పీవో రాహుల్ పై ప్రశంసల జల్లు కురిపించారు. ఇది అద్భుతమైన ఆలోచనని కితాబుని ఇచ్చారు. అంతేకాదు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో.. భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ రూపొందించిన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామును స్ఫూర్తిగా తీసుకొని అమలు చేయాలని ఆదేశాలు కూడా జారీ చేయడం జరిగింది. భద్రాచలం ఐటిడిఏ అమలు చేస్తున్న కెరీర్ గైడెన్స్ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో అమలు చేయాలని సెక్రటరీ సర్క్యులర్ జారీ చేయడం పిఓ రాహుల్ చర్యలపై ప్రశంసల జల్లు కురుస్తున్నాయి. గిరిజన విద్యా సంస్థల్లో విద్యా ప్రగతికి ఇప్పటికే అనేక విద్యా సంస్కరణలు తీసుకొస్తున్న పీవో రాహుల్ చేపట్టిన మరో సంస్కరణ సత్ఫలితాలు ఇవ్వడంతో అందరూ పిఓ ను అభినందిస్తున్నారు.

# ఏస్ యు అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వద్ద విద్యార్థుల ధర్నా

## స్టడీ హాల్ విద్యార్థుల అనుకూల సమయానికి ఓపెన్ చేస్తామని విసి హామీ, విరమించిన విద్యార్థుల నిరసన



కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):శాతవాహన యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వద్ద శుక్రవారం విద్యార్థుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. మూసి వేసిన స్టడీ హాల్ ఓపెన్ చేయాలని 2 గంటలపాటు ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, యూనివర్సిటీ విద్యార్థి వెంకటేష్, రోహిత్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ లోని మెయిన్ స్టడీ హాల్ ను యథావిధిగా తెరవాలని డిమాండ్ చేయడం జరిగింది. విద్యార్థులు రోజు ఉదయం క్లాసులైన తర్వాత స్టడీ హాల్ కి వెళ్లి చదువుకుందాం అంటే నిబంధనలు పెట్టడం జరిగింది. దాని ద్వారా విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురి అవుతూ వారు మానసిక ధైర్యాన్ని కొల్పుతున్నారు. ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు సౌకర్య వంతంగా చదువుకోవడం ఇబ్బందిగా ఉండడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. అదే విధంగా యూనివర్సిటీ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని నెట్వర్క్ ప్రాబ్లం ఉంది రూటర్లను ఏర్పాటు చేయాలని విద్యార్థులకు సౌకర్యవంతమైన సదుపాయాలు కల్పించాలని కోరడం జరిగింది.సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలి అని డిమాండ్ చేస్తూ,యూనివర్సిటీ ల సమస్యలపై పరిష్కరించాలని వారు అన్నారు. ముఖ్యంగా స్టడీ హాల్ టైమింగ్ లో విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా కృషి చేయలి అని వారు కోరారు.

అనంతరం 2 గంటల ధర్నా తర్వాత వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ స్పందించి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.రూటర్ లను ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్త అని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు రోహిత్,గంగాధర్,విజయ్,రాకేష్,నందీప్, వసంత్,రాకేష్,జగన్,నవీన్,వినోద్,రాజు,తరుణ్, భాషా ,నరేష్,మల్లేష్,శివ ,వినయ్ ,కళ్యాణి,సౌజన్య, భార్గవి,శ్రావణి,హర్ష ,మేఘన తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, మార్చి 07 (భారతశక్తి): మండలంలోని సోంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు శుక్రవారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంఖుస్థాపన చేశారు. ఇటీవల పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరైన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే పాయం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు మోడల్ హౌస్ గా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల గురించి ఆలోచిస్తుందని ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుగ్గంపూడి కృష్ణారెడ్డి, మండల నాయకులు, మహిళా నాయకులు, లబ్ధిదారులు బింగి రమణ, భాగి సుజాత, నుసుకూరి సత్య రాణి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రమంత్రి సంజయ్ ని కలిసిన సినిమాటోగ్రాఫర్ మధుసూదన్



కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి , కేంద్రం మంత్రి బండి సంజయ్ కుమార్ ను కరీంనగర్ జిల్లాకు చెందిన సినిమాటోగ్రాఫర్ మధుసూదన్ కోట మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి నివాసంలో కలిసిన కోట మధుసూదన్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శాలువా తో సత్కరించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లా పూడూరు గ్రామానికి చెందిన కోట మధుసూదన్ సినిమా టో గ్రాఫర్ గా రాణించడం అభినందనీయమని , తన ఫోటోగ్రఫీతో సమాజానికి, దేశానికి ఉపయోగపడే సినిమాలు తీయాలని మంత్రి కోరారు.

మధుసూదన్ మాట్లాడుతూ సినిమాకు సినిమాటోగ్రఫీ ప్రాణం లాంటిదని , డైరెక్టర్ ఆలోచనలకు , విజన్ కు అనుగుణంగా కెమెరా పనితనం తోడైనప్పుడే సినిమాలోని ప్రతి ఫ్రేమ్ ప్రేక్షకులను ఆకట్టుకునీ, అందరి మెప్పు పొందుతుందన్నారు. అసిస్టెంట్ కెమెరామెన్ గా పనిచేసిన తాను , మొదట్లో కొన్ని కమర్షియల్ యాడ్స్ కు సినీ ఫోటోగ్రాఫర్ గా పనిచేయడం జరిగిందన్నారు. మొదటగా సమీరం అనే సినిమాతో సినిమాటో గ్రాఫర్ గా అవకాశం వచ్చిందని , ఆ తర్వాత ఆదిత్య ఓం నటించిన బంది సినిమా కు సినిమా టో గ్రాఫర్ గా పనిచేసినట్లు తెలిపారు. ఇబ్బంది సినిమా 28 తారీకు రోజున సినిమా థియేటర్లో రిలీజ్ అయింది ఈ సినిమాలో కెమెరా పనితనం కనబడుతుందన్నారు. సినిమా నిర్మాతలు , దర్శకులు తమలాంటి కెమెరామెన్ లను, సినిమా టోగ్రాఫర్లను ఎంకరేజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయనతో పాటు సీనియర్ ఫోటోగ్రాఫర్ సొల్లు అజయ్ వర్మ పాల్గొన్నారు.

# కెఏఎస్ఏస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్





కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):కరీంనగర్ జిల్లా సర్జన్స్ అందరిని ఒకే చత్రం కిందికి తెస్తూ శుక్రవారం మైత్రి హోటల్ లో జరిగిన సమావేశం లో కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ ఆవిర్భవించింది. ఇందులో భాగంగానే కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ అధ్యక్షుడిగా వాసుదేవ శ్రీనివాస్ ని ఎన్నికైనారు.ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్ రవీందర్ రావు, డాక్టర్ వి సూర్యనారాయణ రెడ్డి, డాక్టర్ జి. ప్రశాంత్, డాక్టర్ జయరాం, డాక్టర్ బాస శంకర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ మంగిలాల్, డాక్టర్ సి. హెచ్. ప్రదీప్, డాక్టర్ అరుణ్, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ మోహన కృష్ణ, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ హరికృష్ణ రెడ్డి తదితర సర్జన్స్ ల బృందం పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వి. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ ద్వారా పలు ఉచిత క్యాంపులు, ఆధునిక సర్జరీ మార్పులను కరీంనగర్ సర్జన్ లకి అందుబాటులోకి తేవడానికి విధివిధానాలు, కార్యాచరణను రూపొందించుకుని ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా రానున్న రెండు సంవత్సరముల కాలవ్యవధికి గాను ప్రెసిడెంట్ గా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ వాసుదేవ హాస్పిటల్, సెక్రటరీగా డాక్టర్ వి. మంగీలాల్, ట్రెజరర్ గా డాక్టర్ సాయి ప్రసాద్ లు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ పలువురు అభినందనలు తెలిపినారు, ఐఎంఏ కరీంనగర్ ప్రెసిడెంట్ డాక్టర్ నరేష్, టీఎస్ఎంసి మెంబర్లు డాక్టర్ బండారి రాజ్ కుమార్, డాక్టర్ అమిత్, తానా కరీంనగర్ ప్రెసిడెంట్ డాక్టర్ చాట్ల శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర తానా ప్రెసిడెంట్ డాక్టర్ సురేష్, అలయన్స్ క్లబ్ ప్రతినిధులు కోల అన్నా రెడ్డి, ఈద కుమారస్వామి, గవర్నర్ వెంకటేశ్వర్లు, గాలిపెల్లి నాగేశ్వర్, ముస్కుల విద్యాసాగర్ రెడ్డి, లయన్స్ ప్రతినిధులు మధుసూదన్ రెడ్డి, కొండా వేణుమూర్తి, చిదుర సురేష్, డాక్టర్ రమణాచారి, డాక్టర్ వసంత రావు, డాక్టర్ ఎం. ఎల్. ఎన్. రెడ్డి, డాక్టర్ అలిమ్ లు శుభాభినందనలు తెలియజేశారు.

# కామన్ సర్వీస్ సెంటర్లతో ప్రజలకు విస్తృతంగా సేవలు: జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ






ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 07:కామన్ సర్వీస్ సెంటర్లతో ప్రజలకు విస్తృతంగా సేవలు అందుతాయని జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ అన్నారు.జిల్లా రెవెన్యూ అధికారిణి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ వర్క్ షాప్ ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారిణి మాట్లాడుతూ అభివృద్ధి గ్రామ స్థాయిలో తీసుకుని వెళ్లేందుకు, గ్రామాలలో డిజిటల్ సేవలు మెరుగుపరచడానికి, ఆర్థిక ప్రగతి ఈ గవర్నెన్స్ అందించేందుకు కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. దేశంలోని 10 జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టు క్రింద ఈ కార్యక్రమం అమలు చేస్తుండగా, మన ఖమ్మం జిల్లా ఇందులో ఎంపిక కావడం జరిగిందని తెలిపారు.ఖమ్మంలోని 589 గ్రామ పంచాయతీ లలో ఇప్పటికే 434 కామన్ సర్వీస్ సెంటర్ లు ఏర్పాటు చేసి డిజిటల్ సేవలు అందిస్తున్నామని అన్నారు. మన జిల్లాలో మిగిలిన 155 గ్రామాలలో సైతం ఇందిరా మహిళా శక్తి క్రింద మహిళా సంఘాలచే కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేశామని, 68 మంది స్వశక్తి మహిళా సంఘాలను గుర్తించామని, మిగిలిన సెంటర్లకు ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 155 గ్రామాలలో కామన్ సర్వీస్ సెంటర్లను మహిళలకు కేటాయించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మహిళా శక్తి క్రింద స్త్రీ టీ బ్రాండ్ ఏర్పాటు చేసి మంచి విజయం సాధించామని తెలిపారు.ఎస్.పి.వి %ఉ% హెడ్ జి2సి డా. విఘ్నేష్ స్వర్ణ మోహన్ మాట్లాడుతూ, ప్రజలకు సహాయార్థంగా ఉండేందుకు కామన్ సర్వీస్ సెంటర్ పని చేస్తుందని, కామన్ సర్వీస్ సెంటర్లలో రెండు కంప్యూటర్లు ఉండాలని, దివ్యాంగులు సైతం వినియోగించుకునేలా ర్యాంప్ ఏర్పాటు చేయాలని, ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలు తెలిసేలా బోర్డు పెట్టాలని అన్నారు. ప్రభుత్వ, బ్యాంకింగ్, ఆదార్ సేవలు, ఇతర పౌర సేవలను కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా అందే సేవలు కామన్ సర్వీస్ సెంటర్ నుంచి కూడా అందేలా ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా రుణాలు మంజూరు చేస్తే బ్యాంకులో నుంచి కమీషన్ లభిస్తుందని, కామన్ సర్వీస్ సెంటర్ నుంచి బీమా, కరెంట్ బిల్లులు, ఇతర బిల్లుల చెల్లింపులు, పాన్ కార్డు, పాస్ పోర్ట్ దరఖాస్తు, క్రెడిట్ కార్డు, బస్సు, రైల్, విమాన టికెట్ల బుకింగ్ వంటి వివిధ రకాల సేవలు అందించడంలో మంచి కమీషన్ లభిస్తుందని అన్నారు. ప్రజలకు సంబంధించిన వివిధ సమస్యలపై ఫిర్యాదుల నమోదుకు కూడా కామన్ సర్వీస్ సెంటర్ వినియోగించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, ఎస్బిఐ ఆర్ఎం లింగస్వామి, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, సి.ఎస్.సి. రాష్ట్ర హెడ్ కె. సునీల్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, టెక్నికల్ టీం సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు చారికి ఘన స్వాగతం పలికిన విద్యుత్ శాఖ అధికారులు




ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 07:ఖమ్మం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ గా ఇటీవల బాధ్యతలు చేపట్టి తొలిసారిగా బోనకల్ సెక్షన్ కి విచ్చేసిన సందర్భంగా వైరా డివిజన్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు, వైరా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్ కుమార్, బోనకల్ అసిస్టెంట్ ఇంజనీర్ టి.మనోహర్ చేతుల మీదుగా పుష్పగుచ్చం అందజేసి స్వాగతం తెలిపారు. అనంతరం ఖమ్మం జిల్లా సూపర్డెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు చారి బోనకల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ. విద్యుత్ శాఖ వారు విద్యుత్ వినియోగదారులకు సౌర విద్యుత్ వల్ల ప్రయోజనాలు తెలియజేస్తూ సౌర విద్యుత్ వల్ల కాలుష్యాన్ని తగ్గిస్తూ విద్యుత్ ఉత్పత్తిని పెంచుతూ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటుందని బోనకల్ మండలంలోని ప్రతి ఒక్క గ్రామానికి ప్రతి ఒక్క ఇంటికి, వ్యవసాయ మోటార్లకు ఉచిత సౌర విద్యుత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవలని విద్యుత్ మీటర్ ఉన్న ప్రతి ఒక్కరు వ్యవసాయం మోటర్ ఉన్న ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డులు ఫోన్ నెంబరు కరెంట్ బిల్లు వ్యవసాయ మోటార్ బిల్లు వ్యవసాయం భూమి యొక్క సర్వే నెంబరు విద్యుత్ శాఖ వారు వచ్చినప్పుడు వారికి ఇచ్చి సహకరించగలరని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ వైరా డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు, వైరా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్ కుమార్,బోనకల్ విద్యుత్ శాఖ ఏఈ టి మనోహర్ లైన్స్మెక్టర్ లు జి.నరసింహారెడ్డి,లైన్మెన్లు ఎండి జమీర్ పాషా, కే నాగరాజు, అసిస్టెంట్ లైన్మెన్లు పాత కోటి అర్జున్, పసుపులేటి రమేష్, ముత్తినేని క్రాంతి కుమార్, అన్మాండ్స్ పోతురాజు తిరుపతిరావు, నంద్రు సురేష్ బాబు, తగరం రమేష్ ,బోనకల్, రావినూతల, చిరునోమల గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు అవరోధమయ్యే భూసమస్యలపై తక్షణ చర్యలు: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, మార్చి 07(భారత శక్తి):జిల్లాలో శాంతిభద్రతలకు అవరోధంగా మారే భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం దిశగా మండల, సబ్-డివిజన్, జిల్లా స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి కమిటీలో తహశీల్దార్, ఎస్.హెచ్.ఓ.లు ఉంటారని, నివాస ప్రాంతాలు, నిర్మాణ అనుమతులు, సరైన అనుమతులు లేని అక్రమ కట్టడాలపై మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ కమీషనర్లను ప్రత్యేక అధికారులుగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల కమిటీ ప్రతినిధులు ప్రతి సోమవారం ఉదయం 10.30 గం.ల నుండి మధ్యాహ్నం 2 గం.ల వరకు అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి రిజిస్టర్లో వివరాలు నమోదు చేసి గ్రీవెన్స్ నంబర్ కేటాయిస్తారని తెలిపారు. దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించడం జరుగుతుందని, కనీసం 15 రోజులు, గరిష్టంగా 21 రోజులలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై సంబంధిత అర్జీదారులకు అవగాహన కల్పించి తగు సూచనలు చేయడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కమిటీ సూచనలు అనుసరించాలని తెలిపారు. సబ్ డివిజన్ స్థాయిలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి.లు ఉంటారని, మండల స్థాయి కమిటీ పనితీరును 15 రోజులకు ఒకసారి పరిశీలిస్తారని, సమస్యల పరిష్కారంలో మండల కమిటీకి తగు సూచనలు చేస్తారని, డివిజన్ స్థాయిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత మండల స్థాయి కమిటీకి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, డి.సి.పి, ఉంటారని, మండల, సబ్- డివిజన్ స్థాయి దరఖాస్తుల ప్రక్రియపై నెలవారి సమీక్ష నిర్వహిస్తారని, 21 రోజులలో పరిష్కారం కాని దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని తెలిపారు. నకిలీ, తప్పుడు ధృవపత్రాలుగా అనిపించినట్లయితే తదుపరి చర్యల కొరకు జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని తెలిపారు. కమిటీల సంబంధిత పనితీరు, ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కొరకు జిల్లా స్థాయిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 08736-250106 నంబర్ను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలను కమిటీల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కమిటీకి సంబంధించిన అధికారులు నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, విధులలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# బిఆర్ఎస్ అవుట్ డేటెడ్.. కాంగ్రెస్ కు కౌంట్ డౌన్ స్టార్ట్ :బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



కరీంనగర్, మార్చి 07(భారత శక్తి): కరీంనగర్ , అదిలాబాద్ , నిజామాబాద్ , మెదక్ పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించి తిరుగులేని శక్తిగా అవతరించిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ ఔట్ డేటెడ్ అయిందని, కాంగ్రెస్ పార్టీకి కౌంట్ డౌన్ మొదలైందని జోస్యం చెప్పారు. బిజెపి జిల్లా కార్యాలయంలో ఈనెల 8వ తేదిన చేపట్టబోయే విజయోత్సవ ర్యాలీనీ విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు విజయం సాధించి చరిత్ర సృష్టించారన్నారు. బిజెపి కి ఈ ఎన్నికల్లో అండగా నిలిచిన టీచర్స్, పట్టభద్రుల కు, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులు కార్యకర్తలు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనబడిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాయ మాటలు మోసపూరితమైన హామీలతో గద్దెనెక్కి, అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెడుతుందన్నారు. ప్రధానంగాఉద్యోగులు ,పట్టబద్రులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని , అందుకే ఎన్నికల్లో చెంపపెట్టు లాంటి తీర్పు ఇచ్చారన్నారు. బిజెపిని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ , బిఆర్ఎస్ పార్టీలు ఏకమై , అనేక కుట్రలు కుతంత్రాలు చేసి , విచ్చలవిడి డబ్బులు పంపిణీ చేసిన ఆ రెండు పార్టీలకు గుణపాఠం వచ్చే విధంగా టీచర్స్ పట్టభద్రులు తీర్పు ఇచ్చారన్నారు. బిఆర్ఎస్ అవుట్డేటెడ్ పార్టీ అయిందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంటర్ మొదలైందని , తెలంగాణలో బిజెపి శకం ఆరంభమైందన్నారు. విజయోత్సవ ర్యాలీకి ముఖ్య అతిధులుగ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రివర్యులు జి. కిషన్ రెడ్డి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరవుతున్నారని తెలిపారు. ర్యాలీ మధ్యాహ్నం 3:00 కు కరీంనగర్లోని వైశ్య భవన్ నుండి ప్రారంభమై తెలంగాణ చౌక్ వరకు కొనసాగుతుందన్నారు. బిజెపి శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యులు బోడిగె శోభ, మాజీ మేయర్లు సునీల్ రావు , డి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్ , సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు , జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి , కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్ పల్లి ప్రవీణ్ రావు, ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు , రంగు భాస్కరాచారి , సాయిని మల్లేశం, కళ్లెం వాసు దేవ రెడ్డి , కోశాధికారి వైద రామానుజం , స్టేట్ కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ్ చంద్ర , అలివేలు సమ్మిరెడ్డి , బండ రమణారెడ్డి బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ , నాయకురాలు శిల్ప వేదం , ఎస్సీ , ఎస్టి మోర్చా అధ్యక్షులు సోమిడి వేణు ప్రసాద్, కట్టరాజు లతోపాటు వివిధ మండలాల అధ్యక్షులు, జోన్ అధ్యక్షులు , ఇన్చార్జులు , నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంప్ లో ఘనంగా బిఆర్ఎస్ నాయకులు కొప్పుల సైదిరెడ్డి జన్మదిన వేడుకలు

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి )మార్చి 07:సూర్యాపేట జిల్లా, హుజూర్ నగర్ బిఆర్ఎస్ సీనియర్ నేత, ఉద్యమ నాయకులు, హుజూర్ న గర్ మాజీ జడ్పిటిసి డాక్టర్ కొప్పుల సైదిరెడ్డి జన్మదినం పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నందు మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంతకండ్ల జగదీశ్ రెడ్డి సమక్షంలో కొప్పుల సైదిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కొప్పుల సైదిరెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తులో ఎన్నో మంచి పదవులు అనుభవించాలని ఈ సందర్భంగా ఆశీర్వదించారు ఇట్టి కార్యక్రమంలో... హుజూర్నగర్ మండల బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కట్టా సతీష్, హుజూర్ నగర్ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్ బేత శివారెడ్డి, గరిడేపల్లి మండల కన్వీనర్ వట్టే యల్లయ్య యాదవ్, నేరేడుచర్ల కన్వీనర్ బుడిగె సతీష్ గౌడ్, కే సతీష్ సోషల్ మీడియా, మఠంపల్లి మండల బిసి నాయకులు నరాలశెట్టి గోపి నాయుడు మరియు పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# పోలీసులు వున్నారనే ధైర్యాన్ని ప్రజలకు కలిగించాలి: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)మార్చి07: పోలీసులు వున్నారు మనకు సాయం చేస్తారనే ధైర్యాన్ని ప్రజలకు కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెట్రోకార్, ఇంటర్ సెప్టార్‌కార్, హైవే పెట్రోలింగ్ విధులు పోలీస్ సిబ్బందితో వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ముందుగా సిబ్బంది ఎవిధమై విధులు నిర్వహిస్తున్నారని పోలీస్ కమిషనర్ సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది స్పందించి ఫిర్యాదు వద్దకు చేరుకోని వారి సమస్యను అడిగి తెలుసుకొని పరిస్కారించడం లేదా పోలీసు స్టేషన్ అధికారి దృష్టికి తీసుకవెళ్ళడం చేయాలని, ప్రధానంగా పెట్రొలింగ్ నిర్వహించే సిబ్బంది విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో పెట్రోలింగ్ అధికంగా చేయాలని, నేరం జరిగిన తరువాత పోలీసులు వెళ్ళేదాని కన్నా నేరం జరగకుండా చేయడం మంచిదని, ఇది దృష్టిలో పెట్టుకొని పెట్రోలింగ్ విధులు నిర్వహించాలని,అలాగే రాత్రి సమయాల్లో ప్రజలు మనపై వున్న నమ్మకానికి తగ్గట్లుగా పెట్రొలింగ్ చేసి చోరీలను నియంత్రించాలని, పెట్రో సిబ్బంది పెట్రోలింగ్ మాత్రమే కాకుండా ఎద్కెనా ట్రాఫిక్ సమస్య వచ్చినప్పుడు కూడా వేంటనే స్పందించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని. ఫిర్యాదుదారుల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ తెలంగాణ పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు పెంచాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు డిసిపి రవి, పోలీస్ కంట్రోల్ రూం ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్, ఐటీకోర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఏపూరు నీతి సూర్యుడు ప్రార్ధన మందిరంలో పేద వృద్ధ మహిళలకు చీరల పంపిణి

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 07: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (యస్) మండల కేంద్రం ఏపూరు గ్రామంలో స్థానిక సంఘ కాపరి పాస్టర్ రెవ.డా. పంది మార్కు నీతి సూర్యుడు ప్రార్ధన మందిరం నందు ఈ నెలలో జరిగే స్వస్థత మహాసభలలో భాగంగా రెండవ రోజు సభలో వంటెపాక యాదయ్య. అనసూర్య జ్ఞాపకార్ధంగా వారి అల్లుడు కూతురు పాల్వాయి అజయ్ రాణి లు ఇరవై మంది పేద వృద్ధ మహిళలకు బట్టల పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రైస్తవ రాష్ట్ర నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సెబా, కోయి కోయి పాటల రచయిత మీసాల గుర్రప్ప (క్రీస్తు దాసు ),సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ జలగం జేమ్స్ ల చేతుల మీదుగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చివ్వేంల పాస్టర్స్ పెలోషిఫ్ అధ్యక్షులు రెవ గుగులోతు బాలాజీ నాయక్, బానోత్ సుధాకర్, రెవ పి. వి. బోయాజ్, రెవ. జిల్లా శాంసన్, రెవ. జిల్లా శాంతి కుమార్,పాస్టర్ బాకీ సుధీర్,రెవ. బల్లెం జీవప్రకాష్, పాస్టర్ బోనగిరి స్టిఫెన్, పాస్టర్ మామిడి క్రిస్టోఫర్, పవన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



భారత శక్తి



# వర్షం ముప్పు లేదు.. మరి 'ఫైనల్' టై అయితే విజేతను ఎలా నిర్ణయిస్తారు?



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. దుబాయ్ వేదికగా ఆదివారం భారత్ – న్యూజిలాండ్ ) జట్ల మధ్య జరగనుంది. పాకిస్థాన్‌లో మాదిరిగా దుబాయ్‌లో మ్యాచ్‌లకు వర్షం ఆటంకం లేదు. దీంతో మ్యాచ్ ఎలాంటి ఇబ్బందిలేకుండా జరుగుతుందని వాతావరణ శాఖ చెబుతోంది. అయితే, 2019 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో మ్యాచ్ టై అయినట్లు.. ఇప్పుడు కూడా టై అయితే పరిస్థితి ఏంటనేది క్రికెట్ అభిమానుల సందేహం. అప్పుడంటే బౌండరీలను కౌంట్ చేసి కివీస్‌ను కాదని ఇంగ్లాండ్‌ను విజేతగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఐసీసీ పై తీవ్రస్థాయిలో విమర్శలు రేగాయి. దీంతో ఇలాంటి కీలక సమయంలో మ్యాచ్ టైగా ముగిస్తే విజేతను తేల్చేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. అదేంటో చూద్దాం.

వారిదే టైటిల్..

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఇరు జట్లూ ఒకే స్కోరు చేసి టై అయిందనుకుందాం. అప్పుడు విజేతను నిర్ణయించేందుకు సూపర్ ఓవర్‌ను వేయిస్తారు. టీ20 ఫార్మాట్‌లో ఇలాంటి విధానాన్ని అమలుచేస్తుంటారు. ఒకవేళ ఆ సూపర్ ఓవర్ కూడా టైగా ముగిస్తే.. మరిన్ని సూపర్ ఓవర్లను ఆడాల్సి ఉంటుంది. విజేత ఎవరనేది తేలేవరకూ తప్పదు. ఆ సూపర్ ఓవర్(ర్లు) ఎవరు గెలుస్తారో వారిదే ఛాంపియన్స్ ట్రోఫీ. ఓడిన జట్టు రన్నరప్‌గా నిలుస్తుంది.

ఒకవేళ వర్షం వస్తే..

పాకిస్థాన్‌లో మాదిరిగా దుబాయ్‌లో ఇప్పుడు వర్షం పడే అవకాశం లేదు. అయితే, అనుకోనివిధంగా వర్షం వచ్చిందనుకుంటే ఇరు జట్లూ విజేతగా ట్రోఫీని పంచుకుంటాయి. మ్యాచ్ ఫలితం రావాలంటే ఇరు జట్లూ కనీసం 25 ఓవర్ల ఆట ఆడాలి. అప్పుడే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన విజేతను తేలుస్తారు. వర్షం వల్ల ఫైనల్ రద్దు కావడంతో 2002లో భారత్, శ్రీలంక జట్లు పంచుకొన్న సంగతి తెలిసిందే. రెండు రోజులపాటు మ్యాచ్ సాగినా.. ఒక్కో ఇన్నింగ్స్ మాత్రమే జరిగాయి. ఫలితం తేల్చే అవకాశం లేకపోవడంతో కప్ ఇరు జట్లకూ దక్కింది.



# ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్.. కివీస్‌తో తస్మాత్ జాగ్రత్త

న్యూజిలాండ్.. భారత్‌కు కొరుకుడు పడని ప్రత్యర్థి. ఎందుకంటే ఆ జట్టు ఆట శైలి అలా ఉంటుంది. ఆల్‌రౌండ్ పవర్, అద్భుతమైన బ్యాటింగ్.. కళ్లు చెదిరే బౌలింగ్ కివీస్ సొంతం. కష్ట సమయాల్లో ఎవరో ఒకరు జట్టును నిలబెట్టేస్తుంటారు. అందుకే స్థిరమైన ఆటకు కివీస్ కేరాఫ్ అడ్రస్! ఆ జట్టు ఎక్కువ ఐసీసీ కప్‌లు గెలిచి ఉండకపోవచ్చు కానీ ఎక్కువసార్లు సెమీస్, ఫైనల్‌కు వచ్చిన ఘనత న్యూజిలాండ్‌కే దక్కుతుంది. అందుకే ఆదివారం ఛాంపియన్స్ ట్రోఫీ (%×జజ జష్టుఎ-జూఅశీఅం ఎతీశీజూష్తు% 2025) ఫైనల్లో కివీస్‌తో టీమ్‌ఇండియా జాగ్రత్తగా ఉండక తప్పదు.

ఆ ఒక్క మ్యాచ్ తప్పితే..

ఛాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్ (%×చీణ జం ల్గీ%) గొప్పగా ఆడింది. అద్భుతమైన ఆటతీరుతో ఫైనల్‌కు దూసుకొచ్చింది. భారత్‌తో మ్యాచ్‌లోనూ ఆఖరిదాకా పోరాడింది. ఈ ఒక్క మ్యాచ్ తప్పితే ఆ జట్టుకు ఎదురేలేదు. ఇంతటి ఆత్మవిశ్వాసానికి ఇటీవల విజయాలే కారణం. ఛాంపియన్స్ ట్రోఫ్మీకి ముందు పాకిస్థాన్‌లో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన న్యూజిలాండ్ తేలిగ్గా కప్‌ను చేజిక్కించుకుంది. ముఖ్యంగా మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్, యువ కెరటం రచిన్ రవీంద్ర, సూపర్ ఫీల్డర్ గ్లెన్ ఫిలిప్స్, ఆపద్బాంధవుడు డరిల్ మిచెల్, కెప్టెన్ శాంట్నర్ ఆ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. 34ఏళ్ల వయసులోనూ కుర్రాళ్లతో పోటీపడుతూ విలియమ్సన్ స్థిరంగా ఆడుతున్నాడు. మిడిలార్డర్‌లో వస్తూ జట్టు కష్టాల్లో ఉన్న ప్రతిసారీ ఆదుకుంటున్నాడు. మిగిలిన బ్యాటర్లలా అతడు ఎడాపెడా షాట్లు ఆడడు. కొలిచి కొట్టినట్లు.. చాలా పద్ధతిగా కొడతాడు. దుబాయ్ లాంటి పిచ్ కేన్ ఆటకు అతికినట్టు సరిపోతుంది. బంతిని మిడిల్ చేస్తూ.. చక్కని టైమింగ్‌తో పరుగులు సాధిస్తే ఇన్నింగ్స్ నిలబెట్టడం చాలా సులభం. భారత్‌తో గత మ్యాచ్‌లోనూ కేన్ ఇదే పని చేశాడు. జట్టును విజయం దిశగా తీసుకెళ్లాడు. అయితే మిగిలిన బ్యాటర్ల నుంచి సహకారం కొరవడడంతో న్యూజిలాండ్‌కు ఓటమి తప్పలేదు. పెద్ద మ్యాచ్‌ల్లో ఆడే ప్లేయర్ల వరుసలో ముందుండే విలియమ్సన్.. భారత్‌తో తుదిపోరులోనూ రాణించే అవకాశాలున్నాయి. ఒత్తిడిని మింగి.. కూల్‌గా తన పని తాను చేసుకుంటూపోయే కేన్‌తో రోహిత్ సేనకు పెను ప్రమాదమే పొంచి ఉంది.

రచిన్ రవీంద్ర రూపంలో భారత్‌కు మరో సవాల్ తప్పదు. ఈ టోర్నీలో ఆడింది మూడు మ్యాచ్‌లే అయినా రెండు సెంచరీలు చేసి ఔరా అనిపించాడీ ఆల్‌రౌండర్. బంగ్లాదేశ్‌పై ఆడిన తొలి మ్యాచ్‌లోనే శతకం సాధించిన రచిన్.. దక్షిణాఫ్రికాతో కీలక సెమీఫైనల్లో మరో సెంచరీ సాధించాడు. విలియమ్సన్‌తో కలిసి భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఫామ్‌లో ఉంటే ఎంత సులభంగా పరుగులు సాధిస్తాడో అతడు మరోసారి చాటి చెప్పాడు. ఓపెనింగ్‌లోనే అతడిని అడ్డుకోకపోతే టీమ్‌ఇండియా మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇక మైదానంలో మెరుపులా కదిలే గ్లెన్ ఫిలిప్స్ భారత్‌కు పెద్ద ప్రమాదకారే. టీమ్‌ఇండియాతో గత మ్యాచ్‌లో కోహ్లిని పెవిలియన చేర్చే క్రమంలో అతడు పట్టిన స్టన్నింగ్ క్యాచ్‌ను అభిమానులు అంత తేలిగ్గా మరిచిపోలేరు. ఫీల్డింగ్‌లోనే కాదు బ్యాటింగ్, బౌలింగ్‌లోనూ అతడు డేంజరే.

ఇక మిడిలార్డర్‌లో చాపకింద నీరులా పరుగులు చేస్తూ ఇన్నింగ్స్‌ను నిర్మించే డరిల్ మిచెల్‌ను ఎంత త్వరగా పెవిలియన్ చేరిస్తే అంత మంచిది. దుబాయ్ పిచ్‌పై ఇటీవల ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన అనుభవం కచ్చితంగా భారత్‌కు ఉపయోగపడుతుంది. కానీ ఒత్తిడిలోనూ రాణించడం.. పిచ్ పరిస్థితులను వేగంగా అర్థం చేసుకుని సత్తా చాటే లక్షణాలు ఉన్నా న్యూజిలాండ్.. టీమ్‌ఇండియాకు గట్టిపోటీ ఇవ్వడం ఖాయం. ఇటీవల టీ20 ప్రపంచకప్ ఫైనల్ మినహాయిస్తే.. గత కొన్నేళ్లుగా ఐసీసీ టోర్నీ తుదిపోరులో భారత్‌కు కలిసి రాలేదు. ముఖ్యంగా 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ తాలూకా చేదు జ్ఞాపకాలు ఇంకా మెదులుతూనే ఉన్నాయి. ఇప్పుడు అదే ఫార్మాట్లో జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీ తుదిపోరులో రోహిత్ సేన సత్తా చాటితే అభిమానులకు అంతకుమించిన ఆనందం ఏం ఉంటుంది.

# 37 ఏళ్ల నాటి ఫీట్‌ను భారత్ రిపీట్ చేస్తుందా?

ఐసీసీ టోర్నీ తుది పోరుల్లో భారత్ చివరిసారిగా న్యూజిలాండ్‌పై 37 ఏళ్ల కిందట విజయం సాధించింది. ఆ తర్వాత మూడుసార్లు కివీస్‌దే పైచేయి. ఇప్పుడు మరోసారి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ తుది పోరులో ఇరు జట్లూ తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. ఈసారి మాత్రం న్యూజిలాండ్‌ను ఓడించి తీరాలని భారత అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. గతంలో భారత్-కివీస్ ఎప్పుడు తలపడ్డాయంటే..?



1988 షార్జా కప్ ఫైనల్‌లో భారత్-న్యూజిలాండ్ తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా విజయం సాధించింది. మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ఐసీసీ టోర్నీ ఫైనల్స్‌లో కివీస్‌పై భారత్‌కిదే ఏకైక గెలుపు కావడం గమనార్హం.

2000లో భారత్ – కివీస్ జట్ల మధ్యే ఛాంపియన్స్ ట్రోఫీ (అప్పుడు నాకౌట్ టోర్నీ) ఫైనల్ జరిగింది. అందులో న్యూజిలాండ్ గెలిచి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. గంగూలీ, సచిన్ రాణించినా.. లక్ష్య ఛేదనలో ప్రత్యర్థిని అడ్డుకోలేకపోవడంతో ఓటమి తప్పలేదు.

2005 ముక్కోణపు సిరీస్ ఫైనల్‌లో భారత్‌ను కివీస్ ఓడించింది. ఈ రెండు జట్లే కాకుండా మూడో టీమ్‌గా జింబాబ్వే ఆడటం గమనార్హం.

ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ 2021 సీజన్ ఫైనల్‌కు భారత్, న్యూజిలాండ్ చేరిన సంగతి తెలిసిందే. ఇక్కడా టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. తొలిసారి జరిగిన ఈ డబ్ల్యూటీసీ ఫైనల్‌లో గెలిచిన కివీస్ 'టెస్టు' గదను సొంతం చేసుకుంది.

ఐసీసీ టోర్నీల ఫైనల్స్‌లో కివీస్ 3-1 ఆధిక్యంతో కొనసాగుతోంది. ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ లీగ్ స్టేజ్‌లో న్యూజిలాండ్‌ను భారత్ చిత్తు చేసిన సంగతి తెలిసిందే. మరోసారి టీమ్‌ఇండియా నుంచి అటువంటి ప్రదర్శనే పునరావృతం కావాలి.

# ఆల్ ది బెస్ట్ టీమ్‌ఇండియా.. రోహిత్‌ను దగ్గర నుంచి గమనించా: సూర్య




ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీఫైనల్‌కు టీమ్‌ఇండియా చేరుకుంది. న్యూజిలాండ్ (%×చీణ జం ల్గీ%)తో ఆదివారం తలపడనుంది. ఈ క్రమంలో భారత జట్టుకు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపాడు. ట్రోఫీని నెగ్గి స్వదేశానికి చేరుకోవాలని ఆకాంక్షించాడు. అదే సమయంలో రోహిత్ శర్మ 'ఫిట్‌నెస్'పై వస్తున్న విమర్శలను కొట్టిపడేస్తూ కీలక వ్యాఖ్యలు చేశాడు. కాంగ్రెస్ నేత షమా మొహమూద్ చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికే భారత మాజీ క్రికెటర్లు ఘాటుగా స్పందించిన సంగతి తెలిసిందే.

''ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ అద్భుతంగా ఆడుతోంది. ఇదే జోష్‌ను కొనసాగిస్తే తప్పకుండా టైటిల్‌ను కొట్టేస్తుంది. జట్టులోని ప్రతిఒక్కరూ అత్యుత్తమ ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నా. టీమ్‌ఇండియా విజేతగా నిలిచి స్వదేశానికి సగర్వంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నా. కెప్టెన్‌గా రోహిత్ శర్మ నాలుగు పెద్ద ఈవెంట్లలో జట్టును ఫైనల్స్‌కు చేర్చాడు. ఇదో గొప్ప విషయం. గత 15-20 ఏళ్ల నుంచి అతడు ఆడుతున్న తీరుతోనే ఇది సాధ్యం. రోహిత్ (%=శీష్ట్రఱ్ణ ూష్ముతీఖ%)ను నేను చాలా దగ్గర నుంచి గమనించా. అంతర్జాతీయ క్రికెటైనా.. ఫ్రాంచైజీ కోసమైనా అతడు కష్టపడే విధానం అద్భుతం. ఫిట్‌నెస్ విషయంలోనూ చాలా శ్రమిస్తాడు. అందుకే అతడు ఉన్నతస్థానంలో ఉన్నాడు. తప్పకుండా ఫైనల్‌లోనూ విజేతగా నిలుపుతాడని ఆశిస్తున్నా'' అని సూర్యకుమార్ (%ూబతీఖఎబఎఖతీ ్ఖఎఖజ%) వెల్లడించాడు.

ఐసీసీ టోర్నీ నాకౌట్ స్టేజ్‌లో భారత్ – కివీస్ మూడోసారి తలపడుతున్నాయి. 2000లో ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌తోపాటు 2019 వన్డే ప్రపంచకప్ సెమీ ఫైనల్, ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ 2021 ఫైనల్‌లో ఇరు జట్లూ తలపడ్డాయి. ఈ మూడు మ్యాచుల్లోనూ భారత్‌కు ఓటమి ఎదురైంది. వాటన్నింటికి ప్రతీకారంగా ఈసారి ఎలాగైనా భారత్ గెలిచి తీరాలని అభిమానులు కోరుకుంటున్నారు. దుబాయ్ వేదికగానే ఫైనల్ జరగనుండటంతో టీమ్‌ఇండియా ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. కానీ, కివీస్‌ను ఏమాత్రం తక్కువగా అంచనా వేయకూడదనేది క్రికెట్ విశ్లేషకుల సూచన.

# నిద్రపోయిన షకీల్.. టైమ్ ఔట్

%రావల్పిండి: పాకిస్థాన్ బ్యాటర్ సాద్ షకీల దేశవాళీ క్రికెట్లో అనూహ్య రీతిలో ఔటయ్యాడు. ప్రెసిడెంట్స్ కప్ ఫస్ట్‌క్లాస్ టోర్నీ ఫైనల్లో డ్రెస్సింగ్ రూమ్‌లో నిద్రపోయి ఆలస్యంగా క్రీజులోకి చేరుకున్న షకీల్‌ను అంపైర్లు టైమ్ ఔట్‌గా ప్రకటించారు. మంగళవారం పీటీవీతో జరిగిన మ్యాచ్‌లో స్టేట్ బ్యాంక్ తరఫున షకీల్ ఆడాడు. రంజాన్ మాసం కావడంతో రాత్రి 7.30 నుంచి 2.30 వరకు మ్యాచ్ నిర్వహించారు. పేసర్ మహ్మద్ షాజాద్ బౌలింగ్‌లో వరుసగా రెండు బంతుల్లో ఉమర్ అమీన్, ఫవాద్ ఆలం ఔటయ్యారు. ''మూడు నిమిషాలలోపు కొత్త బ్యాటర్ క్రీజులోకి రావాలి. కానీ మూడు నిమిషాల అనంతరం షకీల్ క్రీజులోకి వచ్చి గార్డ్ తీసుకున్నాడు. పీటీవీ కెప్టెన్ అమ్మాద్ బట్ అప్పీల్ చేయడంతో అంపైర్లు ఔట్‌గా ప్రకటించారు'' అని మ్యాచ్ అధికారి తెలిపాడు. ప్రపంచ క్రికెట్లో ఈ విధంగా ఔటైన ఏడో బ్యాటర్‌గా.. పాక్ చరిత్రలో మొట్టమొదటి ఆటగాడిగా షకీల్ పేరిట రికార్డు నమోదైంది.



# అలుపెరుగని బాటసారి

**మరపురాని మీ జ్ఞాపకాలను లిఖిస్తున్న చేతులు,ఆఖరి రాతలు రాస్తూ కన్నీటి చుక్కల దీపాలై ఆగి పోతున్నాయి**



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 07:25 సంవత్సరాలుగా, ప్రజాక్షేత్రంలో, సామాజిక రంగాలలో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , ప్రతిపక్ష, స్వపక్ష పీఏగా, 1500 కి.మీ వారి వెంట పాదయాత్రలో నడిచి, ప్రజా సమస్యల పరిష్కార మార్గంలో, పయనించి వారికి చేదోడు వాదోడుగా ప్రజల మనలను పొంది, ఇటీవల గుండెపోటు తో కన్ను మూయడం అత్యంత విషాదకరం. తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు 1974లో ఖమ్మంలో కీర్తిశేషులు తక్కెళ్ళపల్లి రామస్వామి ప్రమీల ల రెండవ సంతానంగా జన్మించి, ప్రస్తుత పినపాక మండలం ఏడుల్ల బయ్యారంలో పదవ తరగతి వరకు విద్యనభ్యసించి, తదుపరి ఉన్నత చదువులు ఖమ్మంలో పూర్తి చేశారు. అనంతరం ఐసిడిఎస్ లో జూనియర్ అసిస్టెంట్ ,సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తూనే తనతో పాటు పనిచేసే ఉద్యోగస్తులు బాగుకోసం టీఎన్జీవో అప్పటి అవిభక్త ఖమ్మం జిల్లా ప్రెసిడెంట్ గా సేవలందిస్తూ, తెలంగాణ ఉద్యమంలోనూ అత్యంత చురుకైన పాత్రను పోషించారు. ఆ క్రమంలోనే, అప్పటి ప్రతిపక్ష నాయకుడు ఇప్పటి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క దృష్టిలో తను పడటం, అప్పటినుండి, శ్రీనివాసరావు, వారి ప్రతి అడుగుజాడల్లో క్రియాశీలక పాత్రను పోషిస్తూనే అందరి మన్ననలను పొందాడు. డిప్యూటీ సీఎం వారు చనిపోయిన రోజు వారి కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని శ్రీనివాస రావు అంత్యక్రియలకు వచ్చి కంటతడి పెట్టాడు అంటేనే వారి ఔన్నత్యాన్ని అర్థం చేసుకోవచ్చు.అంతేకాకుండా వారు జన్మించిన నాయి బ్రాహ్మణ కుటుంబాలలోని ఉద్యోగస్తులందరినీ ఖమ్మం జిల్లాలో సేకరించి వారి ద్వారా, చదువులలో మంచి ప్రగతిని సాధిస్తూ ఆర్థికంగా వెనుక బాటులో ఉన్న అనేక మంది విద్యార్థులకు, తమ సహకారాన్ని అందించటం, ఆర్థికంగా వెనుకబడిన హాస్పిటల్స్ లో బిల్స్ కట్టలేనటువంటి వారికి సీఎం సహాయ నిధి నుంచి ఇప్పించిన సందర్భాలు అనేకం.తను పీఏగా నిత్యం బిజీగా ఉన్నప్పటికీ, తనకు వచ్చే ప్రతి కాల్ నీ రిసీవ్ చేసుకుని , వాటి పరిష్కార మార్గంలో ముందుండేవారని , నిగర్వి ,శాంతమూర్తి, చిరునవ్వు చెదిరిపోకుండా ఉండేవారని వారి అంత్యక్రియలకు హాజరైన అనేకమంది అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు చర్చించుకుంటుంటే, వారి కుటుంబ సభ్యులు, బంధువుల అర్థానాదాలు గుండెలు పగిలేలా ఉన్నాయి. శ్రీనివాసరావు బౌతికంగా లేకపోయినా, వారి నిర్వహణలో, వారి సహొ ద్యోగులకు, తను పుట్టిన జాతికి, ప్రజలందరూ ఆత్మగౌరవంతో బ్రతకాలని తను అందించిన సేవలు మరువలేనివి. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగటమే వారికి నిజమైన నివాళి అర్పిస్తున్నాం.

# రికార్డులు ట్యాంపరింగ్ చేసినందుకు ఇద్దరు గిర్ధావర్ లు సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 07:

సూర్యాపేట జిల్లా మోతే తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను ట్యాంపరింగ్ చేసినందుకు గాను ఇద్దరు గిర్ధావర్ లను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మోతే మండల గిర్ధావర్ గా విధులు నిర్వహిస్తున్న జే నిర్మలదేవి, అదనపు గిర్థవార్ షేక్ మన్సుర్ అలీలు పాత పహాణి రికార్డులలో పేర్లు లేకపోయినా పేర్లు ఉన్నట్లు సృష్టించి ధరణి లో మిస్సింగ్ సర్వే నెంబర్లు కింద 11 దరఖాస్తులు చేపించి భూమి ఉన్నట్టు తప్పుడు ధ్రువీకరణ చేసి పంపించటం జరిగిందని అన్నారు.

నిన్న రాత్రి ఇట్టి విషయమై కలేక్టర్ మోతే తహసీల్దార్ కార్యాలయానికి వేళ్ళి రికార్డులు పరిశీలించి ట్యాంపరింగ్ చేయటం జరిగిందని నిర్దారించడమైనది. పలు రికార్డులను ట్యాంపరింగ్ చేసి ఉన్నత అధికారులను తప్పుదోవ పట్టించిన మోతే మండల గిర్థవార్లు జే నిర్మలదేవి, అదనపు గిర్థవార్ షేక్ మన్సుర్ అలీ లను సస్పెండ్ చేస్తున్నట్లు అలాగే తదుపరి విచారణలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలిపారు.

# అన్నప్రసాదాలలో అదనంగా 'వడ' ప్రసాదంను పంపిణీ చేసిన టిటిడి ఛైర్మన్



తిరుపతి జిల్లా ప్రతినిధి,మార్చి 07, (భారత శక్తి): తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో మార్చి 06, గురువారం టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి టిటిడి ఛైర్మన్ భక్తులకు వడ వడ్డింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత అన్న ప్రసాదం మెనూలో భక్తులకు అదనంగా ఒక పదార్థం వడ్డించాలని ఆలోచన కలిగిందన్నారు. ఈ విషయాన్ని సీఎం శ్రీ నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన అంగీకారంతో వడల వడ్డింపు కార్యక్రమాన్ని ఈరోజు నుండి ప్రారంభించామన్నారు.ఇప్పటికే భక్తులకు నాణ్యమైన దినుసులతో భక్తులకు రుచికరమైన అన్న ప్రసాదాలు అందిస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు తెలియజేశారు.భక్తులకు పంపిణీ చేసే వడ తయారీలో శెనగపప్పు, పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, కొత్తిమీర, పొదీన, సోంపును ఉపయోగించనున్నారు.అన్న ప్రసాద కేంద్రంలో ఇకపై ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 04 గంటల వరకు 35 వేల వడలను భక్తులకు వడ్డించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింతగా పెంచి భక్తులకు రుచికరమైన భోజనం అందిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శ్రీ శాంతా రామ్, డిప్యూటీ ఈవోలు శ్రీ లోకనాథం, శ్రీ రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శ్రీ శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.లిటీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే విడుదల చేయబడినది.లి

# సీఎం గారు.... ఇదేం పాలన?

**పెంచాల్సిన వేతనాలను తగ్గించడమేంది?**

**ఇది కాంగ్రెస్ ప్రభుత్వ మతిలేని చర్య**

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా తీరు మారదా?: కేంద్ర హెూం శాఖ మంత్రి సంజయ్**



కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ శానిటేషన్ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని, పట్టణాల పరిశుభ్రతలో శానిటేషన్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిఎం ముఖ్యమంత్రి పనితీరు ఏమి బాగాలేదని మండిపడ్డారు. కరోనా మహమ్మారి కాలంలో ప్రాణాలను ఫణంగా పెట్టి అందించిన సేవలు మరువలేని, ఆనాటి నుండి వేతనాలు పెంచాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదనీ ఆరోపించారు.మున్సిపల్ డ్రైవర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లకు చెల్లిస్తున్న వేతనాలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు..భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రతి ఏటా పెరిగే నిత్యావసర ధరలు, ఇతర ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల జీత భత్యాలను పెంచడం పరిపాటెన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు పెంచకపోగా ఉన్న వేతనాల్లో భారీగా కోత విధించడం ఎంత వరకు సమంజసం? అని చెప్పారు.ఇప్పటి వరకు శానిటరీ ఇన్ స్పెక్టర్లకు నెల వేతనం రూ.22 వేలు చెల్లిస్తుండగా, ఆ వేతనాన్ని రూ.16,600లకు తగ్గించడం దుర్మార్గం. అట్లాగే డ్రైవర్లకు సైతం ఇదే విధంగా కోత విధించడం ఎంత వరకు న్యాయం? రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో 30 వేల 955 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. 2021 జూన్ 11న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ 30 శాతం మేరకు వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. నాటి నుండి నేటి వరకు అంటే గత నాలుగేళ్లుగా వేతనాల పెంపు ఊసే లేదు. పైగా దాదాపు 3 వేల మంది శానిటరీ ఇన్ స్పెక్టర్లు, డ్రైవర్ల వేతనాల్లో ఏకంగా 25 శాతానికిపైగా కోత విధించడం కాంగ్రెస్ ప్రభుత్వ మతిలేని చర్యగా భావిస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి అందుకు భిన్నంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసం? ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 5 డీఏలు పెండింగ్ లో ఉన్నప్పటికీ వాటిని చెల్లించడం లేదు. జీపీఎఫ్ లో దాచుకున్న సొమ్మును కూడా డ్రా చేసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఆఖరికి రిటైర్డ్ మెంట్ బెన్ ఫిట్స్ ఇవ్వకుండా కాళ్ల చెప్పులరిగేలా ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటూ ఉద్యోగులను వేధిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పినా తీరు మారకపోవడం బాధాకరం. నేడు మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ శానిటరీ ఇన్ స్పెక్టర్లు, డ్రైవర్ల వేతనాల్లో భారీగా కోత విధించడాన్ని చూస్తుంటే ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిపట్ల కాంగ్రెస్ కు ఉన్న వ్యతిరేక భావం అర్థమవుతోంది. తెలంగాణ ప్రజలు విజులు. అన్నీ గమనిస్తున్నారు. తక్షణమే చేసిన పొరపాటును సరిదిద్దుకుని మున్సిపల్ డ్రైవర్లు, శానిటేషన్ వర్క్ ఇన్ స్పెక్టర్ల వేతనాలను సరిచేయడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది అందరికీ వేతనాలను పెంచాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

# ఎన్నికల లోటుపాట్లపై సిఎంకు వివరిస్తా.

**ఓటమికి కరీంనగర్ కాంగ్రెస్ లో నాయకత్వ లోపమే.**

**ప్రత్యక్ష రాజకీయాల్లోనే కొనసాగుతా.**

**ఐటి శాఖ మంత్రి దుద్దిల్లకు కృత్ఞతలు**

**మీడియా సమావేశంలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**



కరీంనగర్, మార్చి 7(భారత శక్తి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టెక్నికల్ గా తాను ఓడిపోయినప్పటికీ నైతిక విజయం మాత్రం తనదేనని, పట్టబద్రులంతా తనకు అండగా నిలిచి ఓట్లు వేశారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా పోటీచేస్తే తనకు నష్టమే కలిగించిందని, ఈ కోటుపట్లపై సిఎంతో పాటు పార్టీ పెద్దలకు నివేదిక రూపంలో సమర్పిస్తామని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తనకు మరింత బాధ్యతను పెంచిందని రానున్న రోజుల్లో కాంగ్రెస్ వాదిగా పార్టీలో మరింత చురుకుగా పని చేస్తానని పార్టీ పటిష్టతకు అధిష్టానం తనకు ఏ బాధ్యత ఇచ్చిన నిర్వహిస్తానని వెల్లడించారు.కరీంనగర్ కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ లోపం స్పష్టంగా కనబడుతుందని కరీంనగర్ జిల్లాలో నాయకుడు లేని తండగా తయారైందన్నారు.పార్టీ ప్రక్షాళనకు తనవంతుగా కృషి చేస్తానని వెల్లడించారు.రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసికట్టుగా పని చేసేలా కృషి చేస్తానన్నారు.చెల్లుబాటు కానీ ఓట్లు 11శాతం 28686 ఓట్లు తన ఓటమికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు.చెల్లుబాటు కానీ పదివేల ఓట్లు తనకు వచ్చేవేనని వెల్లడించారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా చేసిన విష ప్రచారాన్ని పట్టభద్రులు పట్టించుకోలేదని ఓటర్లు మాత్రం తనకు మద్దతు పలికారని వెల్లడించారు. టెక్నికల్ గా తాను ఓటమిపాలైనా నైతికంగా తానే విజయం సాధించానని వెల్లడించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకోసం కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ శ్రేణులకు, అల్ఫోర్స్ కుటుంబ సభ్యులకు సిపిఐ సిపిఎం టీజేఎస్ వివిధ కుల సంఘాల నాయకులకు, ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని తనకు అండగా నిలిచిన మంథనిశాసనసభ్యులు, ఐటీ శాఖ మంత్రివర్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు..ఎన్నికలకు ముందు 42 నియోజకవర్గాల్లో పట్టభద్రులకు ఇచ్చిన హామీల అమలుకు రేపటి నుంచే నా కార్యాచరణ ఉంటుందని .అవసరమైతే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తానని తెలిపారు.చొప్పదండి వేములవాడ,సిరిసిల్ల లో కాస్త వెనుకబడి ఉన్నామని పేర్కొన్నారు.చెల్లుబాటు కానీ ఓట్లపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని 50 శాతం ప్లస్ వన్ ఓటు రాకపోయినా విజేతనుఎలా ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీలో లోటుపాట్లపై పార్టీ పెద్దలకు నివేదిక ఇస్తానని పార్టీలో స్తబ్దత నెలకొందని పార్టీ శ్రేణులను ఉత్సాహ పరిచేందుకు కృషి చేస్తానని పునరుద్ఘాటించారు.

# దేశవ్యాప్తంగా ఎస్సీ సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలి

కరీంనగర్, మార్చి 7(భారత శక్తి):దేశ వ్యాప్తంగా ఎస్సి సబ్ ప్లాన్ వెంటనే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జాతీయ కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కౌన్సిల్ సమావేశం బద్దం ఎల్లారెడ్డి భవన్లో జిల్లా ఉపాధ్యక్షులు కెలపాక వినోద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10,11,12 తేదీలలో వేములవాడలో జరుగు రాష్ట్రస్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన కార్యకర్తలకు



పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ సంక్షేమం పేరిట గడిచిన ఏడు దశాబ్దాలుగా అనేక పథకాలు ప్రవేశపెట్టి ఎంతో గొప్పగా అమలు చేస్తున్నట్టు చెప్పినప్పటికీ ఈ వర్గాల్లో వెనుకబాడుతనం పేదరికం పోలేదని ఇప్పటికీ సమాజంలో అత్యంత పేదరికం అనుభవించే వారే దళితులు అని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతి మాట్లాడుతూ ప్రత్యేక చట్టాలు సదుపాయాలు సబ్ ప్లాన్ తదితర సౌకర్యాలు కల్పించామని చెప్తున్నప్పటికీ దళితుల బతుకులు మౌలికమైన మార్పు రావటం లేదని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీల విద్య సామాజిక వికాసంతో పాటు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలైన ఎస్సీలకు జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని అన్నారు. ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయడం మూలంగా దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతున్న అన్నారు.ఈ నెల 10వ తేదీ నుండి వేములవాడలో జరిగే రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాలకు రాష్ట్ర, జాతీయస్థాయిలో మేధావులైనటువంటి దళిత ప్రొఫెసర్స్ వచ్చి రాష్ట్ర శిక్షణ శిబిరాలలో దళితులపై జరుగుతున్న దాడులు సమస్యలపై ప్రసంగిస్తారని వారు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర రఘు, కార్యదర్శి ఖండే ఎల్లయ్య, నాయకులు కొంకటి మొగిలి, చంచల భీమయ్య,రమేష్, మొగిలి, పరశురాములు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్




వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి7:వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్ 2011ఐపిఎస్ బ్యాచ్ కు చెందినవాడు. 2012 సంవత్సరంలో ములుగు ఏ. ఎస్పీ, వరంగల్ రూరల్ ఓ ఎస్ డి గా పని చేశారు. అనంతరం ఎల్.బి నగర్ డిసిపీ గాను, ఎస్పీగా జగిత్యాల్ లో పనిచేశారు. ప్రస్తుతం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రామగుండం పోలీస్ కమిషనర్ బదిలీ అయ్యారు.

# దివ్యాంగులకి యూడిఐడి కార్డు జారీ కొరకు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో అన్ని వసతులు ఏర్పాటు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా బ్యూరో(భారతశక్తి) మార్చి 07:దివ్యాంగులకి యూడిఐడి కార్డు జారీ కొరకు ప్రభుత్వ హాస్పిటల్ లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ యూడిఐడి పోర్టల్ పై అవగాహన కల్పించారు . ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2025 నుండి సదరం సర్టిపికెట్ స్థానం లో 21 అంగవైకల్యాలకి సంబంధించి యూనిక్ డిజబులిటి ఐడి కార్డు మంజూరు చేయటం జరుగుతుందని యూడిఐడి పోర్టల్ లో లబ్ధిదారులు ప్రత్యేక్షంగా గానీ, మీ సేవ ద్వారా గానీ ధరఖాస్తు చేసుకుంటే చీఫ్ మెడికల్ అధికారి లాగిన్ కి వస్తుందని తదుపరి స్లాట్ బుకింగ్ కి సంబందించిన వివరాలు మొబైల్ ద్వారా సందేశం లబ్ధిదారులకి పంపటం జరుగుతుందని తదుపరి అంగవైకల్యం శాతం పరిశీలించి సర్టిపికెట్ ని యూడిఐడి పోర్టల్ లో అప్డేట్ చేసి యూడిఐడి కార్డు లబ్ధిదారుల ఇంటికి స్పీడ్ పోస్ట్ చేయాలని సూచించారు. యూడిఐడి కొరకు కావాల్సిన టెక్నీకల్ సిబ్బంది, మౌళిక వసతులు పది రోజుల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.మాత శిశు సంరక్షణ కేంద్రం నందు ఉన్న గైనకాలజీ పోస్ట్ ఆపరేటివ్ వార్డు లో ఉన్న తల్లులకి,బేబీలకు అందిస్తున్న సేవలను సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు.ఒపీ, ఐపీ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు కి సంబందించిన రిజిస్టర్లని పరిశీలించారు.సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకి వైద్య సేవలు అందించాలని అన్నారు.బ్లడ్ బ్యాంక్, మైక్రో బయాలజీ, పాథలాజీ ల్యాబ్ లను,ఫార్మసి స్టోర్ ను



పరిశీలించారు.

బ్లడ్ యూనిట్ల వివరాలను అడిగగా 67 యూనిట్స్ సిద్ధంగా ఉన్నాయన్నారు. బ్లడ్ డోనేషన్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఫార్మసిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని లేని వాటిని ముందుగానే తెప్పించుకోవాలని ఆదేశించారు.జి జి హెచ్ ఆవరణలో నిర్మిస్తున్న నూతన బిల్డింగ్ ని కలెక్టర్ పరిశీలించారు.బిల్డింగ్ ప్లానింగ్ లో ఏమైనా మార్పులు చేర్పులు చేయాలని అనుకుంటే త్వరగా పూర్తి చేయాలని అధికారులకి సూచించారు.ఈ కార్యక్రమం లో సూపరిటీడెంట్ డాక్టర్ సత్యనారాయణ,ఆర్ యమ్ ఓ జనార్దన్,డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రశాంతి, ఎడి నెహ్రూ నాయక్,టి ఎస్ డి యమ్ సి లోహిత్ రెడ్డి,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా పోలీసుకు రెండు నూతన డాగ్స్.

## డాగ్ షెల్టర్ రూమ్స్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్





సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 07:సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖకు నూతనంగా ట్రాకర్ లూసీ , ఎక్స్-ప్లోజీవ్ బ్రూనో అనే రెండు డాగ్స్ ను కేటాయించిన సందర్భంగా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు నిర్మించిన డాగ్ షెల్టర్ గదులను (జాగిలం గదులు) జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. ముందుగా ఎస్పి కి ట్రాకర్ డాగ్ లూసీ పూలబుకే తో స్వాగతం తెలిపింది. ఈ సందర్బంగా ఎస్పి మాట్లాడుతూ పోలీస్ శాఖ నందు విధుల నిర్వహణ, కేసుల చేదనలో డాగ్స్ (జాగిలం) కు ఒక ప్రత్యేక స్థానం ఉన్నది అన్నారు. చాలా కేసుల్లో నేరస్తులను పసిగట్టుటలో డాగ్స్ బాగా పని చేశాయి, హంటర్, ట్రాకర్, నార్కోటిక్, ఎక్స్ ప్లోజీవ్ ఇలా 6 విభాగాల్లో శిక్షణ పొందిన డాగ్స్ మనకు ఉన్నాయి అన్నారు. కొత్తగా ట్రాకర్ డాగ్ (పేరు లూసీ) ఇది నేర స్థలంలో లభించే ఆధారాలతో నేరస్తులను గుర్తిస్తుంది, మరో డాగ్ ఎక్స్ ప్లోజివ్ (పేరు బ్రూనో) ఇది పేలుడు సామాగ్రిని గుర్తిస్తుందన్నారు. బాగా విధులు నిర్వర్తించాలని డాగ్ స్క్వాడ్ సిబ్బందిని ఆదేశించారు. డాగ్ శిక్షణలో ప్రతిభ చూపిన ప్రశంసా పత్రాలను డాగ్ స్క్వాడ్ సిబ్బందికి అందించారు.ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ లు నాగేశ్వరరావు, జనార్ధన్ రెడ్డి, ఏ ఆర్ డి ఎస్ పి నరసింహ చారి, ఆర్ ఐ లు నారాయణ రాజు, నరసింహ, డాగ్ స్క్వాడ్ ఆర్ ఎస్ ఐ రాజశేఖర్, ఆర్ ఎస్ ఐ లు సురేష్, కె.అశోక్, యం. అశోక్, రెహమాన్, మహేష్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాజీపేట బల్లార్షా మధ్య నడిచే ప్యాసింజర్ రైలు పునః ప్రారంభం



మందమర్రి టౌన్, మార్చి 07(భారతశక్తి): గత కోవిడ్ కాలంలో కాజీపేట బల్లర్ష మధ్య నడిచే ప్యాసింజర్ రైలు రద్దు తో రైల్వే ప్రయాణం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చొరవతో కాజీపేట – బల్లార్షా మధ్య నడిచే ప్యాసింజర్ తిరిగి ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు గడ్డం వంశీ కృష్ణ, గడ్డం వివేక్ వెంకట స్వామి చిత్రపటానికి మందమర్రి పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేయడం జరిగింది. అనంతరం పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకుడు రాయబారపు గత బి ఆర్ ఎస్ నాయకుల నిర్లక్ష్యం వల్ల కరోనా తర్వాత రైలు పున ప్రారంభం చేయలేదు.దీనివల్ల ప్రయాణికులు, వ్యాపారస్తులు,కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కన్నారు.ఈ సమస్యను తెలుసుకున్న పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ, చెన్నూరు శాసనసభ్యులు శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి కలిసి గత ఐదు నెలల నుండి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ, దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులను పలుమార్లు సమావేశమై మాట్లాడగా వెంటనే స్పందించిన రైల్వే శాఖ ఈ యొక్క కాజీపేట బల్లర్ష వెళ్లే రైలు పునః ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారుఈ రైలు పునః ప్రారంభం యువ నాయకుడు ఎంపీ వంశీ కృష్ణ ,చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి వల్లనే సాధ్యమైందని కోరారు.కాంగ్రెస్ వచ్చినంక పెద్దపల్లి పార్లమెంటు మరియు చెన్నూరు నియోజకవర్గం జరిగే అభివృద్ధి తో ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు మండల యూత్ కార్యదర్శి బియ్యపు రవి కిరణ్,రామసాని సురేందర్,పానుగంటి లక్ష్మణ్,ధనుక్ ా జ ే ష్ , చ ో ట ు , గ ణ ే ష్ , వ ు ే ప ా ష్ జీవన్,రాజేష్,చింటూ,శేఖర్,శ్రీను,సుజిత్,అశ్రఫ్,సాత్విక్, పాల్గొన్నారు.

# సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ కు టీ ఎన్జీవోల శుభాకాంక్షలు

కరీంనగర్, మార్చి 07 ( భారత శక్తి):మెదక్, నిజాంబాద్, కరీంనగర్, అదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలను అధికారులను ఉద్యోగులను సిబ్బందిని సమన్వయ పరిచి పోలింగ్, కౌంటింగ్ ను గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి టీఎన్జీవో లు మర్యాద కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అధికారులను, క్రింది సాయి సిబ్బందిని, పోలీస్ అధికారులను ఎప్పటికప్పుడు తదనుగుణంగా అప్రమత్తం చేస్తూ శాంతియుతంగా పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కు ఎంప్లాయిస్ జె ఏ సీ పక్షాన కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో కలిసి పులాబోకెను అందించామన్నారు.మార్చి 8 రోజున అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా 11వ తేదీ మంగళవారం రోజున ఎంప్లాయ్ జె ఏ సి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకొనుటకు మహిళా ఉ ద్యోగులకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరినారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ ను ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వానించామన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఘనంగా వేడుకలను



నిర్వహించాలన్నారు. వేడుకల నిర్వహణకు, మహిళా ఉద్యోగుల ఆటల పోటీలకు కావాల్సిన సిబ్బందిని ఇవ్వాల్సిందిగా సంబంధిత అధికారికి ఆదేశాలు జారీ చేసినారు వెంటనే సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, టీజీ ఓ ల జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, మహిళా నాయకులు శారదా, సబితా రాగి శ్రీనివాస్, సర్దార్ హరిమిందర్ సింగ్ ల్, సందీప్, కర్ణాకర్ పాల్గొన్నారు.

# దన్గర్వాడీ పాఠశాల విద్యార్థిని పరామర్శించిన జిల్లా కలెక్టర్

కరీంనగర్, మార్చి 07(భారత శక్తి):మంకమ్మతోటలోని దన్గర్వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ కోతి వస్తుందన్న భయంతో మొదటి అంతస్తు నుంచి దూకిన బాలుడిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరామర్శించారు.కొద్ది రోజుల క్రితం ధన్గర్ వాడి పాఠశాల 8వ తరగతి విద్యార్థి రఘువర్ధన్ పాఠశాలలో ఉండగా కోతి రావడంతో మొదటి అంతస్తు నుంచి కిందకి దూకాడు. దీంతో అతడి కాలి ఎముకలు విరిగాయి. కొద్దిరోజులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందాడు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బాలుడిపై ప్రత్యేక శ్రద్ధ చూపి కరీంనగర్లో మెరుగైన చికిత్స ఇప్పిస్తున్నారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రఘువర్ధన్ తో మాట్లాడారు. భయం వీడాలని, బాగా చదువుకోవాలని సూచించారు. అవసరమైన పుస్తకాలు తెప్పిస్తానని చెప్పారు. అనంతరం ఆసుపత్రిలో త్వరలో ప్రారంభించనున్న క్రిటికల్ కేర్ విభాగాన్ని సందర్శించారు. ఈ భాగంలో రోగుల



కోసం ఏర్పాటు చేయబోయే సౌకర్యాలు పట్ల ఆస్పత్రి సూపరింటెండెంట్ కు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ ఎం ఓ డాక్టర్ నవీనా ఉన్నారు.

# చేనేత, టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు సమర్పించాలి: చేనేత, జౌళి శాఖ ఏడి విజయలక్ష్మి

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 07:తెలంగాణ రాష్ట్రంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజి (ఐ ఐ హెచ్ టీ ) హైదరాబాదు నందు నూతనంగా మంజూరు కాబడిన చేనేత, టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్స్ లో 2025-26 సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం 60 సీట్లకు ప్రవేశం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.కోర్సు ఆరు సెమిస్టర్లతో 3 సంవత్సరాల కాలవ్యవధి కలిగి ఉంటుందని, ఈ కోర్సులో శిక్షణ కోరే అభ్యర్థులు 10వ తరగతి, తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై, 2025 జూలై 1 నాటికి బి.సి., జనరల్ కేటగిరిలకు 23 సంవత్సరాలు, షెడ్యుల్ కులాలు, తెగల వారికి 25 సంవత్సరాల వయస్సు వరకు ఉండాలని తెలిపారు.కోర్సు చదువుటకు ఆసక్తి, అర్హత గల జిల్లాలోని అభ్యర్థులు 2025 ఏప్రిల్ మొదటి వారంలోగా హైదరాబాదులోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యునివర్సిటి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు హిమజా కుమార్, ఓ.ఎస్.డి, సెల్ నెంబర్. 9030079242 నందు సంప్రదించాలని సహాయ సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# బిటిపిఎస్ లో సీపీఆర్ విధానం పై అవగాహన

మణుగూరు మార్చి 07 (భారతశక్తి): భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (బిటిపిఎస్)లోని భద్రతా వారోత్సవాల నేపథ్యంలో ఉద్యోగులకు సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతయ్య ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీటీపీఎస్ వైద్యులు మనోహర్, మణుగూరు ప్రభుత్వ హాస్పిటల్ వైద్యులు నిఖిల్ లు బి టిటీపీఎస్ ఉద్యోగులు, కార్మికులకు సీపీఆర్ పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విధి నిర్వహణలో ఉన్న సమయంలో హార్ట్ ఎటాక్ వంటివి





సంభవించినప్పుడు కంగారు పడకుండా సీపీఆర్ ఏ విధంగా చేయాలి, తద్వారా ఎలాంటి ప్రయోజనాలు వుంటాయో వివరించారు. సీపీఆర్ విధానం పై ప్రాక్టికల్ చేయించి చూపించారు. కార్యక్రమంలో బీ టీ పీ ఎస్ ఉద్యోగులు కార్మికులు, భద్ర తాధికారులు పాల్గొన్నారు.

# నాలుగు లైన్ల రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖామాత్యులు భట్టి విక్రమార్క మల్లు

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 07:ముదిగొండ నుంచి వల్లభి వరకు నాలుగు లైన్ల రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి శంకుస్థాపన చేసారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముదిగొండ పట్టణ పరిధిలో ముదిగొండ నుంచి వల్లభి వరకు 5 కిలో మీటర్ల మేరకు ప్రస్తుతం ఉన్న రెండు లైన్ల రహదారిని 28 కోట్ల రూపాయల ప్లాన్ నిధుల అంచనా వ్యయంతో నాలుగు లైన్ల రహదారిగా





విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ నిధులతో రహదారి విస్తరణతో పాటు డ్రైనేజి, ఫుట్ పాత్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు,రోడ్లు, భవనాలు శాఖ ఎస్ఇ హేమలత, ఇఇ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy